# abhaya Samskara kendram



## abhaya

## Teacher's Guide

# abhaya Samskara kendram (ask)

## Teacher's Guide

**This Book is published to provide step-by-step guidance to the Teachers / Volunteers of abhaya samskara kendram (ask) to conduct 30 Days Camp during Summer Season**

Published by
**abhaya FOUNDATION**
Hyderabad - 500 004. TS
www.abhayafoundation.org
with the support of CSR Funds granted by
**Regal Rexnord**

**abhaya samskara kendram**
**(ask)**
**Teacher's Guide**

Author : **Balachandra**
Copy Right © Balachandra

All rights reserved. No part of this work may be reproduced in any form without written permission of the publisher

First Edition : April, 2023
Copies : 500
Price : Invaluable

Published by
**abhaya FOUNDATION**
6-3-609/140/1, Anandnagar, Khairathabad,
Hyderabad - 500 004. Telangana
abhayafoundation@yahoo.com | abhaya@abhayafoundation.org
Mobile: 99592202450 | What's App: 8143707803

www.abhayafoundation.org | www.abhayahome.org
fb: abhayafoundationHyd | fb Page: abhaya Foundation - Home of Happiness
Twitter: abhayaheart | Youtube: abhayaheart

Printed at :
Dolphin Graphics
IDA, Uppal, Hyderabad - 500 039, TS
dolphingraphicsads@gmail.com
Ph: 8106988009

# Index


| | | |
|---|---|---|
| 1. | ఒక చిన్న మాట | 5 |
| 2. | abhaya Foundation | 7 |
| 3. | అభయ సంస్కార కేంద్రములు - సూచనలు | 9 |
| 4. | abhaya - Structure | 11 |
| 5. | దైనందిని | 12 |
| 6. | ప్రార్థనా శ్లోకములు | 13 |
| 7. | గీతా శ్లోకములు | 17 |
| 8. | భజగోవిందము | 25 |
| 9. | శతక పద్యాలు | 28 |
| 10. | శ్రీ సత్యసాయి పద్యసూక్తులు | 47 |
| 11. | వినుర బాలచంద్ర వినయ సాంద్రా! | 52 |
| 12. | దేశ భక్తి గీతాలు | 55 |
| 13. | పిల్లలు కథలెందుకు వినాలి? | 78 |
| 14. | పిల్లలు కథలెందుకు చదవాలి? | 80 |
| 15. | చిన్న కథలు | 82 |
| 16. | లింగాష్టకం | 132 |
| 17. | హనుమాన్ చాలీసా | 134 |
| 18. | భజనలు | 136 |
| 19. | Games | 142 |
| 20. | Activities | 150 |
| 21. | ఆదర్శ సూత్రములు | 154 |
| 22. | ఆరోగ్య సూత్రములు | 156 |
| 23. | శ్రీ సత్యసాయి వాక్య విభూతి | 157 |
| 24. | అభయ ఉచిత భోధనా తరగతులు | 159 |
| 25. | నివేదికలు | 165 |

# 1. ఒక చిన్న మాట

బాలచంద్ర గారికి సమాజము పై ఉన్న దివ్యప్రేమకు తార్కాణమై నిలిచి యున్నవే, అభయ సంస్కార కేంద్రాలు. జనసేవయే జనార్థన సేవగా ఎంచి, సంస్థ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించుకుంటూ సేవలో ఆనందమును అనుభవిస్తున్నారు. అందులో భాగమే అభయ సంస్కార కేంద్రముల నిర్వహణ, చిన్నారి పిల్లలకు చక్కని సంస్కారమును అందించి తద్వారా వారి ఇంద్రియ, దేహ, మనో, హృదయ మరియు ఆత్మవికాసములకు నాంది పలకాలని, వారు అందించిన దివ్య సంకల్పము మేరకు బాలబాలికల కోసమై ఎన్నో విన్నూత్న కార్యక్రమాలు చెపట్టుట జరుగుతున్నది. ఏ కార్యక్రమము చేసినా వారు ఆదేశించిన త్రిముఖాత్మక వ్యూహమును అందరూ గుర్తుంచుకోవలసి ఉంటుంది. దీని గురించి SAI మంత్రము వివరిస్తూ, SAI లోనే ఇమిడి యున్న ఈ పవిత్ర వ్యూహమును గూర్చి చెప్పడము జరిగింది.

S - Spiritual Transformation (ఆధ్యాత్మిక సంస్కరణ)

A - Association Transformation (సామాజిక సంస్కరణ)

I - Individual Transformation (వ్యక్తిగత సంస్కరణ)

ఇట్టి వ్యూహముతో, సంస్కారమును మొదట వ్యక్తిపరంగా తదుపరి సామాజిక పరంగా చివరకు ఆధ్యాత్మపరంగా కలిగించాలన్న ప్రయత్నముతో, ప్రధానంగా చిన్నారి బాలబాలికలు, విద్యార్థుల మరియు యువకుల వ్యక్తిగత ఉపయోగార్థమై ఈ "ask" పుస్తకమును అందించుట జరుగుతున్నది. వీరి చేతులలో ఈ "పుస్తకము" కరదీపికగా మారి, అందరినీ ఆదర్శ మార్గంలో నడిపించి, సంస్కార

జ్యోతి వెలుగుతో సమాజమును నింపాలన్నదే ఈ పుస్తక ధ్యేయము. దైనందిక జీవితములో ఏ పని చేసినా అందులో సంస్కారమును ప్రకటించ గలిగినప్పుడు ఆ పని దైవకార్యముగా మారునన్న పెద్దల మాటలను గుర్తుంచుకుని ఈ పుస్తకమును మీ చేత నుంచే ప్రయత్నం చేస్తున్నాము. అందరూ అందుకుని ఆచరణయుక్తమయిన ఆనందబిందువులను ఆస్వాదించి, ఆదర్శమును నిరూపించగలరని మా అభిలాష.

ఈ పుస్తకమును ఎంతో దయతో Regal Rexnord (Euroflex) సంస్థ వారు తమ సామాజిక సేవ బాధ్యత నిధులతో ముద్రించినందుకు వారికి మరియు యాజమాన్యానికి అందరి తరపున ధన్యవాదములు తెలుపుకుంటున్నాము.

సదా సేవలో...

Place : Hyderabad

Date : 29th April, 2023

**abhaya ask Team**

# 2. abhaya Foundation

abhaya Foundation was born out of the deep rooted pain CS Balachandra Sunku, its founder, had felt witnessing the acute suffering and misery of poor souls, when he was just a five year old child. As he grew, so did his resolve to help mitigate the tribulations of the weak and the needy. Balachandra upon graduating with a B.Sc., LL.B., later progressed to be a full fledged Company Secretary through the prestigious qualification FCS. Even as an employee he used to spend nearly 100% of his life time after office hours on pursuing service to the needy. He decided that the only way to fulfill his vision of service would be to dedicate his life to social service and remain unmarried, so that no personal relationships or obligations would come his way to disrupt his purpose of life.

The philosophy behind abhaya Foundation is the delivery of reassurance that help is available to anyone who is in desperate need of something. Something that can help him not just survive but live a better life and in turn spread the message of service. Our scope is not restricted to caring for just the sick or the destitute, but goes far beyond and covers a repertoire of social services that become our Mission: 'Service With a H.E.A.R.T'.

Our mission is therefore aptly termed as 'H.E.A.R.T'. Through this mission we attempt to contribute in whatever way

we can in the areas of

- H - Healthcare
- E - Education
- A - Awareness
- R - Rural Development
- T - Transformation

మరిన్ని వివరములకు www.abhayafoundation.org & www.abhayahome.org లను సందర్శించవచ్చును.

# 3. అభయ సంస్కార కేంద్రములు - సూచనలు

1. తరగతి ఓంకారముతో ప్రారంభించండి.
2. ప్రశాంత - పరిశుభ్ర వాతావరణాన్ని ఎన్నుకోండి.
3. సర్వమత సంబంధ దేవతామూర్తులతో అలంకరించండి.
4. బాలబాలికలకు "నమస్తే" అలవాటు చేయండి.
5. అందరూ శుభ్రమయిన బట్టలు వేసుకుని, తల దువ్వుకుని వచ్చే విధంగా సూచించండి.
6. అశ్లీల పదాలు, ఊత పదాలు, తిట్లు మాన్పించండి.
7. నిద్ర లేవగానే ప్రార్థించే అలవాటు చేయండి.
8. ప్రతిరోజూ స్నానం చేసేలా చూడాలి.
9. భోజన మంత్రమును అలవాటు చేయండి.
10. మలమూత్ర విసర్జన విషయంలో పరిశుభ్రత నేర్పండి.
11. మనమంతా ఒకే తల్లి బిడ్డలమన్నది బోధించండి.
12. తరగతిలో దక్షత గల విద్యార్థినీ విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించి వారి ద్వారా మరింత మంది బాలబాలికలను దక్షులుగా తీర్చిదిద్దాలి.
13. ప్రతి ఒకరికి ఒక పుస్తకమును ఇచ్చి అందులో తరగతులలో బోధిస్తున్న విషయాలను వ్రాసుకునేలా చేయాలి.
14. సమయాను సారముగా, సందర్భోచితముగా అందరికీ మన పండుగలు, సంప్రదాయములు, అలవాట్లు, నాయకులు, అవతార పురుషుల విషయాలు తెలియజేస్తుండాలి.

15. అప్పుడప్పుడు బాలబాలికలకు వివిధ రకములైన వినూత్నమైన పోటీలు ఏర్పాటు చేసి వారిని మరింత ప్రోత్సహించాలి.
16. చివరగా శాంతి మంత్రమును పఠించాలి.
17. కార్యక్రమ సమయసారిణి.
    ఓంకారము - ప్రార్థనాశ్లోకములు - బృందగీతము - సుభాషితము - భజన - చిన్నకథ - సప్తాహిక వార్తలు - ఆటలు - శాంతిమంత్రములు
18. బాలబాలికలు ఆదర్శమూర్తులుగా తయారు చేసే ఉత్కృష్ట సేవలో అంకితమయిన కార్యకర్తలు మొదట తాము ఆదర్శంగా ఉండిన మరింత త్వరితగతిన భగవద్ సేవలో ఫలితములను సాధించగలము.

# 4. abhaya Structure



# 5. దైనందిని

## Daily Schedule for 3 Hours (11 a.m. to 3 p.m.)

1. Prayer - 10 Mins
2. Silent Sitting - 5 Mins
3. Brinda Ganam (Group Singing/chanting) - 15 Mins
4. Basics (Tables Games) - 30 Mins
5. Moral Value Stories - 30 Mins
6. Games - 20 Mins
7. Item Preparation - 20 Mins
8. Shathaka Padyalu (Poems) - 20 Mins
9. Group Activity - 30 Mins

# 6. ప్రార్థనా శ్లోకములు

1. కరాగ్రే వసతే లక్ష్మీ । కరమధ్యే సరస్వతీ ॥
   కరమూలే స్థితే గౌరీ । ప్రభాతే కర దర్శనమ్ ॥

2. సముద్ర వసనే దేవి । పర్వత స్థనమండలే ॥
   విష్ణుపత్ని నమస్తుభ్యం । పాదస్పర్శం క్షమస్వమే ॥

3. ఓం గంగే చ యమునేచైవ । గోదావరి సరస్వతీ ॥
   నర్మదే సింధు కావేరి । జలేస్మిన్ సన్నిధింకురు ॥

4. ఓం అపవిత్ర పవిత్రోవా । సర్వావస్తాం గతోపి వా ॥
   యస్మరేత్ పుండరీకాక్షం । స భహ్యాభ్యంతర శ్శుచిః ॥

5. వక్రతుండ మహాకాయ । సూర్యకోటి సమప్రభ ॥
   నిర్విఘ్నం కురుమేదేవ । సర్వకార్యేషు సర్వదా ॥

6. ఓం గురుబ్రహ్మా గురుర్విష్ణు । గురుర్దేవో మహేశ్వరః ॥
   గురుస్సాక్షాత్ పరబ్రహ్మా । తస్మైశ్రీ గురవే నమః ॥

7. యాకుందేందు । తుషార హారధవళా ॥
యాశుభ్రవస్త్రన్వితా । యావీణా వరదండ మండితకరా ॥
యాశ్వేత పద్మాసనా । యాఃబ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిః ॥
దేవైః సదావందితా । సామాంపాతు సరస్వతి భగవతీ నిశ్శేష జాడ్యాపహా॥

8. ఓంకారం బిందు సంయుక్తం । నిత్యం ధ్యాయన్తి యోగినః ॥
కామదం మోక్షదం చైవ । ఓంకారాయ నమో నమః ॥

9. సర్వ మంగళ మాంగళ్యే । శివే సర్వార్థ సాధకే ॥
శరణ్యే త్రయంబకే గౌరి । నారాయణి నమోస్తుతే ॥

10. మనోజవం మారుత తుల్యవేగం । జితేంద్రియం బుద్ధిమతాం వరిష్టం ॥
వాతాత్మజం వానరయూధ ముఖ్యం । శ్రీరామ దూతం శిరసానమామి ॥

11. త్వమేవ మాతాచ పితా త్వమేవ । త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ ॥
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ । త్వమేవ సర్వం మమ దేవ దేవ ॥

12. శుభం కరోతి కళ్యాణం । ఆరోగ్యం ధన సంపదా ॥
దుష్టవృత్తి వినాశాయ । సాయిశ్వారాయ నమోస్తుతే ॥

13. ఓం భూర్భువస్సువః । తత్స వితుర్వ రేణ్యమ్ ॥
భర్గో దేవస్య ధీమహి । ధియో యోనః ప్రచోదయాత్ ॥
ఓం శాంతిః శాంతిః శాంతిః

14. ఓం సాయిశ్వారాయ విద్మ హే । సత్యదేవాయ ధీమహీ ॥
తన్నః సర్వః ప్రచోదయాత్ । ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

15. ఓం బ్రహ్మార్పణం బ్రహ్మహవిః । బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం ॥
బ్రహ్మైవ తేన గంతవ్యం । బ్రహ్మ కర్మ సమాధినా ॥

16. అహం వైశ్వానరో భూత్వా । ప్రాణినాం దేహమాశ్రితః ॥
ప్రాణాపాన సమాయుక్తః । పచామ్యన్నం చతుర్విధమ్ ॥

17. దీపం జ్యోతి పరబ్రహ్మ । దీపం సర్వ తమోపహ ॥
దీపేన సాధ్యతే సర్వం । సంధ్యాదీపం నమోస్తుతే ॥

18. శాంతాకారం భుజగశయనం । పద్మనాభం సురేశం ॥
విశ్వాధారం గగన సదృశం । మేఘవర్ణం శుభాంగం ॥
లక్ష్మీకాంతం కమలనయనం । యోగిహృధ్యానగమ్యం ॥
వందే విష్ణుం భవ భయహరం । సర్వలోకైక నాథం ॥

19. నమస్తేస్తు మహామాయే । శ్రీ పీఠే సురపూజితే ॥
శంఖ చక్రగదాహస్తే । శ్రీ మహాలక్ష్మి నమోస్తుతే ॥

20. పూర్వమ్ రామతపోవనాదిగమనమ్ । హత్వా మృగం కాంచనం ॥
వైదేహీ హరణం జటాయు మరణం । సుగ్రీవ సంభాషణం ॥
వాలీ నిగ్రహణం సముద్రతరణం । లంకాపురీ దహనం ॥
పశ్చాత్ రావణ కుంభకర్ణ హననం । ఏతద్ హి రామాయణమ్ ॥

21. వేదానుద్ధరతే జగన్నివహతే । భూగోళం ఉద్బిభ్రతే ॥
దైత్యం దారయతే బలిం ఛలయితే । క్షత్రక్షయం కుర్వతే ॥
పౌలస్త్యం జయతే హలం కలయతే । కారుణ్యమాతన్వతే ॥
మ్లేచ్ఛా న్మూర్ఛయతే దశా కృతికృతే । కృష్ణాయ తుభ్యం నమః ॥

22. కరచరణ కృతం వా । కాయజం కర్మజంవా ॥
శ్రవణ నయనజం వా । మానసం వాఅపరాధమ్ ॥
విహిత మవిహితం వా। సర్వమే తత్ క్షమస్య ॥
జయ జయ కరుణాబ్దే । శ్రీ మహాదేవ శంభో ॥

23. ఓం తత్ సత్ శ్రీ నారాయణ తు । పురుషోత్తమ గురు తు ॥
సిద్ధ బుద్ధ తు, స్కంద వినాయక । సవితా పావక తు, సవితా పావక తు॥
బ్రహ్మ మజ్దా తు, యెహోవా శక్తి తు । ఈషు పితా ప్రభు తు ॥
రుద్ర విష్ణు తు, రామ కృష్ణ తూ । రహీం తావో తు, రహీం తావో తు ॥
వాసుదేవ గో విశ్వ రూప తు । చిదానంద హరి తు ॥
అద్వితీయ తు, అకాల నిర్భయ । ఆత్మలింగ శివ తూ ॥
ఆత్మలింగ శివ తు, ఆత్మలింగ శివ తు ॥

23. సర్వే జనా సుఖినోభవంతు । సర్వే సంతు నిరామయా ॥
సర్వే భద్రాణి పశ్యంతు । మాకశ్చిత్ దుఃఖ భాగ్భవేత్ ॥

24. ఓం అసతోమా సద్గమయ । తమసోమా జ్యోతిర్గమయ ॥
మృత్యోర్మా అమృతంగమయ । ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

25. ఓం సహనావవతు । సహనౌభునక్తు ॥
సహవీర్యం కరవావహై । తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై ॥
ఓం శాంతిః శాంతిః శాంతిః

26. సమస్త లోకా సుఖినోభవంతు (3)

# 7. గీతా శ్లోకములు

అభయ సంస్కార కేంద్రము కొరకు భగవద్గీత నుండి 25 శ్లోకములు యెంచుకొనబడినవి. జ్ఞానము, సాధన, కర్మ, భక్తి, భగవంతుడు, అవతారములు – అను ఒక ప్రత్యేకమగు వరుసలో అన్నీ ఏర్పరచబడినవి. ఈ వరుసకు, వర్గీకరణకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. అది ఏమిటో ఇప్పుడు తెలుసుకొందాము.

శ్లో. 1, 2 – జ్ఞానము, విశ్వాసము. జ్ఞానము అనగా యేమి? జ్ఞానమనగా వివేకము. జీవితమును, దాని వివిధ సమస్యలను గూర్చిన సదవగాహనయే వివేకము అనబడుతుంది. అందుచేత పిల్లలకు వివేకము యొక్క ప్రాధాన్యత బోధించవలసియున్నది. వివేకము యొక్క ప్రాధాన్యతను గురించి తెలుసుకంటే చాలదు, దానిని పొందటానికి అచంచలమైన విశ్వాసముతో కృషి చేయవలెను. కనుక ఈ మార్గములో బాలలు వేయవలసిన మొట్టమొదటి అడుగు స్వాధ్యాయం అని చెప్పవచ్చును.

శ్లో. 3 నుండి 9 వరకు – సాధన, స్వాధ్యాయము సాధనకు దారి చూపిస్తుంది. సాధన అనగా యేమి? ఇంద్రియ నిగ్రహము, మనో, వాక్కాయ కర్మలలో పవిత్రత, ఇటువంటి కొన్ని ఆధ్యాత్మిక విషయాలను అలవర్చుకొనుటయే సాధన. నిర్మలమైన జీవితమును గడుపుట కూడ సాధనలో ఒక భాగమే. వివేకము సంపాదించుటకు జ్ఞానముతో కూడిన సాధన అవసరము. తనను తాను ఉద్ధరించుకోవడానికి చిత్తశుద్ధితో హృదయపూర్వకముగా చేసే కృషి సాధన.

శ్లో. 10 నుండి 14 వరకు – కర్మ, స్వాధ్యాయ, సాధనల ద్వారా సేవా మార్గమునకు చేరుకోవలెను. జ్ఞానము యొక్క సాధన యొక్క ఆవశ్యకత గూర్చి

అర్థము చేసుకొని, ప్రతివారు వానిని పొందుటకు ప్రయత్నించవలెను. స్వాధ్యాయ, సాధనల ద్వారా స్థిరచిత్తమును పొంది, జీవితములో వారి విద్యుక్త ధర్మములను ఆచరింపవలెను. ప్రతి పని కూడను ఫలాపేక్ష లేకుండా చేయవలెను. ప్రతి పనిని భగవంతునికి సమర్పించు పూజగా భావించుకొనవలెను. అదియే నిష్కామకర్మ అనబడుతుంది. నిష్కామకర్మ మానవునిలో జ్ఞానోదయము కలుగ చేస్తుంది. శాంతి సాధనయే పరమావధి అని జ్ఞానము ద్వారా మాత్రమే తెలిసికొనగలము. కాబట్టి ఎక్కడ, ఎవరు, ఎవరి కొరకు, ఏ పనిని చేసినా ఫలాపేక్ష వదలి చేయవలెను. అనగా నిస్వార్థకర్మను ఆచరింపవలెను. అటువంటి పని యోగము అనబడుతుంది. కర్మను చేయువాడు యోగి అనబడతాడు. నిష్కామకర్మ యోగమును ఆచరించువాడు భగవంతునితో సాన్నిహిత్యమును పెంచుకుంటాడు. అంతేకాక ప్రాపంచిక విషయములలో వివేచన శక్తి సంపాదిస్తాడు. ఈ శ్లోకములో భక్తుని యొక్క లక్షణములు వర్ణింపబడినవి.

శ్లో. 20 నుండి 24 వరకు – భగవంతుని అవతార వర్ణన, నిజమైన భక్తుడు మాత్రమే తనలోని భగవంతుని గుర్తించి, ప్రతివానిలోను భగవంతుని దర్శించి అవతారమే భగవంతుడు అని.

శ్లో. 25 – "భగవంతుని అభయ ప్రకటన" ఈ ఆఖరి శ్లోకములలో తనయందు అచంచల విశ్వాసము గల భక్తులకు భగవంతుడు ఇచ్చిన అభయము చెప్పబడినది. తనకు సంపూర్ణ శరణాగతి పొందిన వారి యోగ క్షేమములను భగవంతుడు స్వీకరిస్తాడు.

## జ్ఞానము

1. **శ్లో. నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే**
**తత్స్వయం యోగ సంసిద్ధః కాలేనాత్మని విన్దతి (4/38)**

*తా. ఈ ప్రపంచమున జ్ఞానముతో సమానముగా పవిత్రమైనది మరొకటి లేదు. యోగ సిద్ధిని పొందినవాడు కాలక్రమమున అట్టి జ్ఞానమును తనయందు తానే పొందుచున్నాడు.*

2. **శ్లో. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేన్ద్రియః**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తి మచిరేణాధిగచ్ఛతి (4/39)**

*తా. శ్రద్ధ గలవాడును, తదేక నిష్ఠతో కూడినవాడును ఇంద్రియములను జయించిన వాడునునగు మానవుడు జ్ఞానమును పొందుచున్నాడు. అట్లు జ్ఞానమును పొందిన వానికి పరమశాంతి శీఘ్రముగ లభించుచున్నది.*

## సాధన

3. **శ్లో. ఉద్ధరే దాత్మనా త్మానం నాత్మాన మవసాదయేత్**
**ఆత్మైవ హ్యాత్మనో బన్ధు రాత్మైవ రిపురాత్మనః (6/5)**

*తా. తన్ను తానే ఉద్ధరించుకొనవలెను. తన్ను అధోగతిని పొందించుకొన గూడదు. ఎందుకనగా ఒకప్పుడు తనకు తానే పరమ ఆప్తుడు మరొకప్పుడు తనకు తానే పరమ శత్రు అవుతున్నాడు.*

4. **శ్లో. ఇదం శరీరం కౌన్తేయ క్షేత్రమిత్య భిధీయతే**
**ఏతద్యో వేత్తితం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః (13/2)**

*తా. కుంతీపుత్రుడవగు ఓ అర్జునా! ఈ శరీరమే క్షేత్రమనబడుచున్నది. దానిని తెలిసికొనువాడు క్షేత్రజ్ఞుడని, క్షేత్ర క్షేత్రజ్ఞుల నెరిగిన వారు అందురు.*

**5. శ్లో. సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సమ్భవాః**
**నిబధ్నన్తి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ (14/5)**

*తా. ఓ అర్జునా! ప్రకృతి వలన బుట్టిన సత్త్వరజస్తమో గుణములు మూడును నాశరహితుడైన ఆత్మను దేహమునందు బంధించును.*

**6. శ్లో. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ**
**నిర్మమో నిరంహంకారః సమదుఃఖ సుఖఃక్షమీ (12/13)**

*తా. సమస్త ప్రాణుల యెడల ద్వేషము లేనివాడు, స్నేహభావము, దయ, కలవాడు అహంకార మమకారములు లేనివాడు, సుఖ దుఃఖములందు సమభావము కలవాడు, ఓదార్పు గలవాడు (భక్తుని లక్షణము).*

**7. శ్లో. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చయత్**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తవ ఉచ్యతే (17-15)**

*తా. ఇతరుల మనస్సునకు బాధ కలిగింపక సత్యమైనది, ప్రియమైనది, మేలు కలిగించునది అగు వాక్యమును ఉచ్చరించుట, వేదాదుల యొక్క అధ్యయనమును అభ్యసించుట వాచిక తపస్సని చెప్పబడుచున్నది.*

**8. శ్లో. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశమాత్మనః**
**కామక్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్ (16/21)**

*తా. కామము, క్రోధము, లోభము, అను యీ మూడు నరకమునకు ద్వారముల వంటివి. ఇవి తనకు నాశనమును గలుగచేయును. కాబట్టి యి మూడింటిని విడువవలెను.*

**9. శ్లో. శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే**
**ధ్యానాత్కర్మఫల త్యాగస్త్యా గాచ్ఛాన్తిరనన్తరమ్ (12/12)**

*తా. అభ్యాసము కంటే జ్ఞానము శ్రేయమైనది కదా! (శాస్త్రము వలన లభించినది) జ్ఞానము కంటే, ధ్యానము శ్రేష్ఠమైనది, ధ్యానము కంటే కర్మ ఫలమును విడుచు విశిష్టమైనది. అట్టి కర్మఫలత్యాగము వలన శీఘ్రశాంతి లభించును.*

# కర్మ

**10. శ్లో. కర్మణ్యేవాధి కారస్తే మా ఫలేషు కదాచన**
**మా కర్మఫల హే తుర్భూర్మాతే సఙ్గోస్త్వ కర్మణి (2/47)**

*తా. నీకు కర్మ చేయుట యందే అధికారము కలదు. కర్మఫలము నందు నీకు ఆసక్తి యుండకూడదు. కర్మఫలమునకు నీవు కారణము కావద్దు. అట్లని కర్మలు మానుటయందు నీవు ఇష్టము పెంచుకొనవలదు.*

**11. శ్లో. యుక్తః కర్మఫలం త్యక్త్వాశాన్తి మాప్నోతి నైష్ఠికీమ్**
**అయుక్తః కామకారేణ ఫలేసక్తో నిబధ్యతే (5/12)**

*తా. నిష్కామకర్మ యోగి కర్మల యొక్క ఫలమును విడిచిపెట్టి కర్మలు చేయుచు, చిత్తశుద్ధి ద్వారా ఆత్మనిష్ఠా సంబంధమైన శాశ్వతమగు శాంతిని పొందుచున్నాడు. అట్లుగాక ఫలాపేక్షతో కర్మను చేయువాడు కోర్కెచేత కర్మఫలమందు ఆసక్తితో బంధుడగుచున్నాడు.*

**12. శ్లో. బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్**
**బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా (4/24)**

*తా. యజ్ఞము నందలి హెూమ సాధనములు, హెూమ ద్రవ్యములు, హెూమము చేయువాడు. హెూమము చేయబడినది, ఇవన్నియు బ్రహ్మ స్వరూపములేయనెడి ఏకాగ్రభావముతో ఆ యజ్ఞాది కర్మలను చేయు మానవునిచే పొందదగు ఫలము కూడను బ్రహ్మయే.*

**13. శ్లో. తస్మాదసక్త స్సతతం కార్యం కర్మసమాచర**
**అసక్తోహ్యాచరన్ కర్మపర మాప్నోతి పూరుషః (3/9)**

*తా. ఫలమునందు ఆసక్తిలేక కర్మనాచరించు మానవుడు మోక్షము పొందుచున్నాడు. కాబట్టి నీవు ఫలాభిలాషను వదలి, విద్యుక్త కర్మలను చేయుము.*

**14. శ్లో. యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్
యత్తపస్యసి కౌన్తేయ! తత్కురుష్వ మదర్పణమ్ (9/27)**

*తా. ఓ అర్జునా! నీవేది చేసినను, భుజించినను, హోమమొనర్చినను, దానము చేసినను, తపస్సు చేసినను, అన్నిటిని నాకర్పింపుము.*

## భక్తి

**15. శ్లో. పురుషః సపరః పార్థ! భక్త్యా లభ్యస్త్వనన్యయా
యస్యాన్తః స్థాని భూతాని యేనసర్వమిదంతతమ్ (8/22)**

*తా. ఓ అర్జునా! ఏవనియందు ఈ ప్రాణికోటికి యంతయు నివసించు చున్నదో, ఎవడు ఈ సమస్త జగత్తుయందు వ్యాపించియున్నాడో అట్టి పరమ పురుషుడు అచంచలమగు భక్తి చేతనే పొందదగినవాడు.*

**16. శ్లో. సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢ నిశ్చయః
మయ్యర్పిత మనోబుద్ధి ర్యోమద్భక్తస్సమే ప్రియః (12/14)**

*తా. నిత్య సంతోషియు, సమబుద్ధి గలవాడును, మనస్సును స్వాధీన పరచుకొనినవాడును, దృఢమైన నిశ్చయము గలవాడును, నాయందు సమర్పింపబడిన మనోబుద్ధులు గలిగినవాడును, నాయందు భక్తి కలవాడును, ఎవ్వడు కలడో, అతడు నాకు ఇష్టుడు.*

**17. శ్లో. మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నముస్కురు
మామే వైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః (9/31)**

*తా. నాయందే మనస్సు నిలుపువాడవై, నా భక్తుడవై నన్నే పొందగలవు.*

**18. శ్లో. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ.
అహంత్వాసర్వపాపేభ్యోమోక్షయిష్యామి మాశుచః (18/66)**

*తా. సమస్త ధర్మములను విడిచిపెట్టి నన్నొక్కని మాత్రం శరణుబొందుము.*

*నేను సమస్త పాపములనుండియు నిన్ను విముక్తునిగ చేసేదను.*

**19. శ్లో. పత్రం పుష్పం ఫలంతోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి**
**తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః (19 / 26)**

*తా. ఎవడు నాకు భక్తితో ఆకును గాని, పువ్వును గాని, పండును గాని, జలమును గాని, అర్పించుచున్నాడో, అట్టి నిర్మల హృదయము గల వానిచే భక్తిపూర్వకముగ అర్పించబడిన ఆ వస్తువులను నేను (ప్రీతితో) ఆరగించుచున్నాను.*

## భగవంతుడు - అవతారము

**20. శ్లో. అహమాత్మ గుడాకేశః సర్వభూతాశయస్థితః**
**అహమాదిశ్చ మధ్యంచ భూతానామన్త ఏవచ (10/20)**

*తా. ఓ అర్జునా! సమస్త ప్రాణుల యొక్క హృదయమునందున్న ప్రత్యగాత్మను నేను అయి యున్నాను. అంతేకాక ప్రాణుల యొక్క ఆదిమధ్యాంతములును నేనే అయియున్నాను.*

**21. శ్లో. పశ్యమే పార్థ! రూపాణి శతశోధ సహస్రశః**
**నానావిధాని దివ్యాని నానా వర్ణాకృతీనిచ (11/5)**

*తా. ఓ అర్జునా! అనేక విధములు గల నున్నవియు, మానవాతీతము లైనవియు వివిధ వర్ణములు ఆకారములు గలవియు, అసంఖ్యాకములుగ వర్తించునవియు అయిన రూపములను చూడుము.*

**22. శ్లో. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ (15/14)**

*తా. నేను 'వైశ్వానరుడ'ను జఠరాగ్నిగా ప్రాణుల యొక్క శరీరమును ఆశ్రయించి, ప్రాణము, అపానము, వాయువు, వీనితో గూడుకొని, నాలుగు విధములగు అన్నమును (భుజించబడిన పదార్థము) పచనము చేయుచున్నాను.*

**23. శ్లో. పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే (4/8)**

*తా. సాధు, సజ్జనులను సంరక్షించుటకు, దుర్మార్గులను నాశనము చేయుటకు, ధర్మమును సరియైన విధముగా స్థాపించుటకు, నేను ప్రతి యుగము నందును అవతరించుచున్నాను.*

**24. శ్లో. యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ (4/7)**

*తా. ఓ అర్జునా! ఎప్పుడెప్పుడు ధర్మము క్షీణించి, అధర్మము వృద్ధి అవుతున్నదో అప్పుడు నన్ను నేనే సృష్టించుకొందును (అవతరించుచుందును).*

**25. శ్లో. అనన్యా శ్చిన్తయన్తో మాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ (9/22)**

*తా. ఎవరు యితర భావములు లేని వారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగ ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు, నాయందే నిష్ఠ గలిగిన అట్టివారి యొక్క యోగక్షేమములను నేనే భరించెదను.*

# 8. భజగోవిందము

**1. భజ గోవిందం భజ గోవిందం । గోవిందం భజ మూఢమతే ॥**
**సంప్రాప్తే సన్నిహితే కాలే । నహినహి రక్షతి డుకృఞ్ కరణే ॥**

*తా. హరిగోవిందా హరిగోవిందా, హరిగోవిందా అనరామందా, మృత్యువు దాపున మసలేటప్పుడు, వ్యాకరణము కాపాడదురా.*

**2. నలినీదళగత జలమతి తరళం । తద్వత్ జీవిత మతిశయ–చపలమ్ ॥**
**విద్ధివ్యాధ్యభిమానగ్రస్తం । లోకం శోకహతం చ సమస్తమ్ ॥**

*తా. తామరాకు పై తళతళలాడే, నీటిబొట్టువలె నిలకడ లేనిది, బ్రతుకభిమానపు తెగులు పుట్టరా, దిగులు దుఃఖముల తెరరా లోకము.*

**3. బాలస్తావత్ క్రీడాసక్తః । తరుణస్తావత్ తరుణీసక్తః ॥**
**వృద్ధస్తావత్ చింతాసక్తః । పరమే బ్రహ్మణీ కో పినసక్తః ॥**

*తా. ఆటలపాటల బాల్యంబాయెను, ప్రాయములో ప్రేమాయణమాయెను, ముదిమిని చింతలు ముదిరేపోయెను, పరబ్రహ్మ కాబట్టక పోయెను.*

**4. కాతే కాంతా కస్తే పుత్రః । సంసారో యమతీవ విచిత్రః ॥**
**కస్యత్వం కః కుత ఆయాతః । తత్త్వం చింతయ తదిహ భ్రాతః ॥**

*తా. ఎవతెభార్య ఇంకెవరో బిడ్డ? ఎంత విచిత్రమో యి సంసారము, ఎవరివాడ? వెవ్వెర? వెటు వచ్చి ఆ, తత్త్వమిక్కడే తమ్ముడ తెలియర.*

5. సత్సంగత్వే నిస్సంగత్వం । నిస్సంగత్వే నిర్మోహత్వం ॥
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం । నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥

*తా. సత్సంగముచే సహజ విరక్తీ, ఆ విరక్తి చే విగత భ్రాంతీ, భ్రాంతి తీరితే శాంతీ స్తిమితము, స్తిమిత శాంతిచే జీవన్ముక్తి.*

6. దిన యామిన్యౌ సాయం ప్రాతః । శిశిర వసంతౌ పునరా యాతః ॥
కాలః క్రీడతి గచ్ఛత్యాయుః । తదపిన ముంచత్యా శావాయుః ॥

*తా. రేయి పవళ్ళు సాయం ప్రొద్దులు, చలి వేసవులూ సారెకు మారును, కాలక్రీడల గడచే నాయువు, ఐనావదలదు ఆశావాయువు.*

7. యోగరతోవా భోగరతోవా । సంగరతోవా సంగవిహీనః ॥
యస్య బ్రహ్మణి రమతే చిత్తం । నందతి నందతి నందత్యేవ ॥

*తా. యోగియైన మరిభోగియైన, సంసారియైన సన్యాసియైననూ, స్వాంతము సత్యము ననుభవించితే, ఆనందమే ఆనందము నందనము.*

8. భగవద్గీతా కించిద్గీతా । గంగా జల లవ కణికా పీతా ॥
సకృదపి యేన మురారి సమర్చా । క్రియతే తస్య యమేనన చర్చా ॥

*తా. కొంచెము భగవత్ గీతాపఠనము, కొంచెము గంగా తీర్థము పానము, హరిపూజన మొకపరి కావించిన, అతనిని యముడేమని తర్కించును.*

9. పునరపి జననం పునరపి మరణం । పునరపి జననీ జఠరే శయనమ్ ॥
ఇహ సంసారే బహుదుస్తారే । కృపయా పారే పాహి మురారే ॥

*తా. మళ్ళీ పుట్టుట మళ్ళీ గిట్టుట, అమ్మ కడుపులో అణగి యుండుట, అంతులేని సంసారము దయతో, దాటింపుము నన్ను దబ్బున దేవా.*

10. త్వయి మయి సర్వత్రై కో విష్ణుః । వ్యర్థం కుప్యసి మయ్య సహిష్ణుః ॥
భవ సమచిత్త స్సర్వత్రత్వం । వాంఛస్య చిరాద్య ది విష్ణుత్వమ్ ॥

*తా. నీలో నాలో నిజమొక విష్ణువె, ఓపిక లేని నీ కోపము వ్యర్థము, ఎల్లెడ సమమై ఉల్లంబుంటే, అపుడే అనుభవమగు విష్ణుత్వము.*

**11.** **శత్రౌ మిత్రే పుత్రే బంధౌ । మా కురు యత్నం విగ్రహ సంధౌ ॥**
**సర్వస్మిన్నపి పశ్యాత్మానం । సర్వ త్రో త్సృజ భేదాజ్ఞానమ్ ॥**

*తా. శత్రుడు మిత్రుడు పుత్రుడు బంధువు, అనుచు ఉపేక్షాపేక్షలు మానుము, అన్నిటిలోను ఆత్మని చూడుము, భేదమనే అజ్ఞానము వీడుము.*

**12.** **గేయం గీతానామ సహస్రం । ధ్యేయం శ్రీపతి రూపమజస్రమ్ ॥**
**నేయం సజ్జన సంగేచిత్తం ధేయం । దీనజనాయ చ విత్తమ్ ॥**

*తా. పాడుము గీతలు నామ సహస్రము, భగవంతుని రూపము భావింపుము, సలుపుమెపుడు సజ్జన సాంగత్యము, దీన జనులకై దానము చేయుము.*

**13.** **అర్థమనర్థం భావయనిత్యం । నాస్తి తతస్సుఖలేశః సత్యమ్ ॥**
**పుత్రా దపి ధన భాజాం భీతిః । సర్వత్రైషా విహితా రీతిః ॥**

*తా. ధనమే కీడునుకొనురా నిత్యము, దానలేదు సుఖ లేశము సత్యము, కొడుకుకైనా భయపడురా ధనికుడు, నడచేదిదే యెల్లెడల నెప్పుడు.*

**14.** **ప్రాణాయామం ప్రత్యాహారం । నిత్యానిత్య వివేక విచారమ్ ॥**
**జాప్యసమేత సమాధి విధానం । కుర్వవ ధానం మహదవ ధానమ్ ॥**

*తా. ప్రాణాయామము ప్రత్యాహారం, నిత్యానిత్య వివేక విచారము, మంత్రముతోడ సమాధి విధానము, జాగ్రత్తగా నిశ్చలముగా చేయుము.*

**15.** **కామం క్రోధం లోభం మోహం । త్యక్త్వా త్మానం భావయకో హమ్ ॥**
**ఆత్మజ్ఞాన విహీనా మూఢా । స్తే పచ్యంతే నరకనిరూఢాః ॥**

*తా. కామము క్రోధము లోభము మోహము, విడువుము, నేనెవ్వడనని యనుకో!, తమ్ము తామెఱుగని దద్దమ్మల కగు, నరకము లోపల నానా బాధలు*

**16.** **గురుచరణాంబుజ నిర్భర భక్తః । సంసారాదచిరాద్భవ ముక్తః ॥**
**సేంద్రియ మానస నియమాదేవం । ద్రక్ష్యసినిజ హృదయస్థం దేవమ్ ॥**

*తా. సద్గురు చరణాబ్జము పై భక్తీ, త్వరగా ముక్తికి తరలే మార్గము, ఇంద్రియ మానస సాంద్ర నియమమే, హృదయస్థుని చూపించును దేవుని.*

# 9. శతక పద్యాలు

**1. కనకపు సింహాసనమున**
**శునకము గూర్చుండబెట్టి**
**శుభలగ్నమునం**
**దొనరగ బట్టము గట్టిన**
**వెనుకటి గుణమేల మాను వినురా సుమతీ!**

*తా: ఓ మంచి బుద్ధిగలవాడా! కుక్కది హీనగుణము, దానిని మంచి ముహూర్తమునాడు బంగారపు సింహాసనమున కూర్చొండబెట్టిననూ హీన బుద్ధి విడవదు. అలాగే హీనుని ఉన్నత స్థానమున కూర్చొండబెట్టిననూ అతని బుద్ధి మారదు అని భావం.*

**2. చీమలు పెట్టిన పుట్టలు**
**పాముల కిరవైన యట్లు పామరుడు దగన్**
**హేమంబు గూడబెట్టిన**
**భూమీశుల పాలజేరు భువిలో సుమతీ!**

*తా: ఓ సుమతీ భూమిలో చీమలు కష్టపడి పెట్టిన పుట్టలలో పాములు చేరును. అట్లే మూరు?డు దాచి ఉంచిన బంగారం రాజులపాలై అతనికి ఉపయోగపడకపోవును.*

**3.** **తలనుండు విషము ఫణికిని**
**వెలయంగా దోక నుండు వృశ్చికమునకున్**
**దలతోక యనక యుండును**
**ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!**

*తా: ఓ సుమతీ! పామునకు తలయందు విషముండును. తేలుకు విషము తోకలో ఉండును. కానీ దుర్మార్గుడైన మనిషికి తల, తోక యనక శరీరమంతయు విషము ఉండును.*

**4.** **పుత్రోత్సాహము తండ్రికి**
**పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జను లా**
**పుత్రుని కనుగొని పొగడగ**
**పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!**

*తా: ఓ సుమతీ! కొడుకు పుట్టగానే తండ్రికి సంతోషము కలగదు. కాని ఆ కొడుకు గొప్పవాడై ప్రజలు అతనిని పొగుడుతున్నపుడు ఆ తండ్రికి నిజమైన సంతోషము కలగును.*

**5.** **మాటకు బ్రాణము సత్యము**
**కోటకు బ్రాణంబు సుభటకోటి ధరిత్రిన్**
**బోటికి బ్రాణము మానము**
**చీటికి బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ!**

*తా: ఓ సుమతీ! మాటకు సత్యమే ప్రాణము. ఈ ప్రపంచమున కోటకు ప్రాణము వీరులైన సైనికులే అగుదురు. స్త్రీకి శీలమే ప్రాణము, అట్లే చీటీకి సంతకమే ప్రాణము. అనగా సంతకములేని చీటీ వ్యర్థమే కదా! అని భావం.*

**6.** **ఉపకారికి నుపకారము**
**విపరీతము గాదు సేయ వివరింపంగా**
**నపకారికి నుపకారము**
**నెపమెన్నక జేయువాడె నేర్పరి సుమతీ!**

*తా: ఓ సుమతీ! మనకు ఉపకారము చేసిన వారికి తిరిగి ఉపకారము చేయుట మంచి లక్షణము. అంతేగాని అందులో ప్రత్యేకత లేదు. కానీ అపకారము చేసిన వారిపై నెపములెన్నక తిరిగి వారికే ఉపకారము చేయగలిగినవాడే "నేర్పరి" అనిపించుకొనును.*

**7. తన కోపమె తన శత్రువు**
**తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ**
**తన సంతోషమె స్వర్గము**
**తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!**

*తా: ఓ సుమతీ! ఎవరికైనా తన కోపమే తన శత్రువగును. తన శాంతమే తనకు రక్షగా నిలుచును. తను చూపెడి దయాగుణమే బంధువులవలె సహకరించును. తాను సంతోషముగా ఉండగలిగినచో అది స్వర్గంతో సమానం. తాను దుఃఖమును చేతులారా తెచ్చుకొనినచో అదియే నరకమగుట తథ్యం అని భావం.*

**8. కొఱగాని కొడుకు పుట్టిన**
**కొఱగామియె కాదు తండ్రి గుణముల జెఱచున్**
**జెఱకు తుద వెన్ను పుట్టిన**
**జెఱకున దీపెల్ల జెఱచు సిద్ధము సుమతీ!**

*తా: చెరకుగడ చివర వెన్నుపుట్టినచో యా చెరుకుగడ యందలి తీపినంతయునూ ఎట్లు చెరచునో అట్లే అప్రయోజకుడగు కుమారుడు పుట్టిన ఆ వంశమునకు ఉపకారి కాకపోయిననూ సరికదా, తన తండ్రి మంచి గుణములను చెరచును, చెడ్డపేరు తెచ్చును అని భావం.*

**9. వినదగు నెవ్వరు సెప్పిన**
**వినినంతనె వేగపడక వివరింపదగున్**
**గని కల్ల నిజము దెలిసిన**
**మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!**

*తా: ఓ సుమతీ! ఎవరు చెప్పినా వినాలి. వినగానే తొందరపడక నిదానంగా ఆలోచించాలి. అలా ఆలోచించి సత్యమేదో, అసత్యమేదో తెలుసుకున్న వారే విచక్షణ కలిగినవారు అని భావం.*

**10. కూరిమిగల దినములలో**
**నేరములెన్నడును గలుగనేరవు మరి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోచుచుండ నిక్కము సుమతీ!**

*తా: ఓ సుమతీ! స్నేహము బాగుగా ఉన్న రోజులలో ఆ స్నేహితులకు ఒకరు చేసిన పనులలో మరొకరికి తప్పులు కనిపించవు. అదే స్నేహితులకు విరోధము వచ్చినపుడు ఒకరి చేష్టలు మరొకరికి దోషములుగా కనిపించును అని భావం.*

**11. ఎప్పుడు సంపద కలిగిన**
**నప్పుడు బంధువులు వత్తురది యెట్లన్నన్**
**దెప్పలుగ జెఱువు నిండిన**
**గప్పలు పదివేలు జేరు గదరా సుమతీ!**

*తా: మనకు ఎప్పుడైతే సంపదలు చేకూరునో, అప్పుడు బంధువులు అధికంగా వచ్చుదురు. ఎలాగనగా చెరువు నిండా నీరు చేరి అలలు వచ్చునట్టి సమయమున వేల కొలది కప్పలు వచ్చి చేరినట్లు అని భావం.*

**12. అప్పిచ్చువాడు వైద్యుడు**
**నెప్పుడు నెడతెగక బాఱు నేఱును, ద్విజుడున్**
**జొప్పడిన యూర నుండుము**
**చొప్పడకున్నట్టి యూర జొరకుము సుమతీ!**

*తా: ఋణమునిచ్చువాడును, వైద్యుడును, ఎల్లప్పుడును ఆగకుండ ప్రవహించు నదియును బ్రాహ్మణుడు గల గ్రామమందు నివసింపుము. వారులేని గ్రామమందు నివసింపకుము.*

**13.** **ఉత్తమ గుణములు నీచున**
**కెత్తెఱగున గలుగనేర్చు నెయ్యెడలం దా**
**నెత్తిచ్చి కఱిగిపోసిన**
**నిత్తడి బంగార మగునె యిలలో సుమతీ!**

*తా: ఓ సుమతీ! బంగారమునకు సమానమైన ఇత్తడిని తీసుకొని ఎన్నిసార్లు కరిగించి పోసినను బంగారము ఎట్లు కాదో, అదేవిధంగా లోకములో నీచునకు ఎక్కడను ఏ విధముగను మంచి గుణములు కలుగనేరవు.*

**14.** **అక్కఱకు రాని చుట్టము**
**మ్రొక్కిన వర మీని వేల్పు మోహరమునదా**
**నెక్కిన బారని గుఱ్ఱము**
**గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!**

*తా: ఓ సుమతీ! అవసరమునకు పనికిరాని చుట్టము, నమస్కరించి వేడిననూ కోరిక నెరవేర్చని భగవంతుని, యుద్ధసమయమున ఎక్కినపుడు ముందుకు పరిగెత్తని గుఱ్ఱమును వెంటనే విడిచిపెట్ట వలెను.*

**15.** **సిరి తా వచ్చిన వచ్చును**
**సలలితముగ నారికేళ సలిలము భంగిన్**
**సిరి తా పోయిన పోవును**
**కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ!**

*తా: ఓ సుమతీ! టెంకాయ లోపలి నీరు వచ్చినట్లు సంపద తెలియకుండానే వస్తుంది. ఏనుగు మింగిన వెలగపండులోని గుజ్జువలె సంపద తెలియకుండానే మాయమవుతుంది అని భావం*

**16.** **శ్రీరాముని దయచేతను**
**నారూఢిగ సకల జనులు నౌరా యనగా**
**ధారాళమైన నీతులు**
**నోరూరగ జవులు పుట్ట నుడివెద సుమతీ!**

*తా: మంచి బుద్ధి గలవాడా! శ్రీరాముని కరుణచేత, జనులందరును మెచ్చునట్లు అందరికిని హితమైన నీతులు చెప్పెదను.*

**17. అడిగిన జీతం బియ్యని**
**మిడిమేలపు దొరను గొలిచి మిడుకుటకంటెన్**
**వడిగల యెద్దులగట్టుక**
**మడిదున్నుక బ్రదుకవచ్చు మహిలో సుమతీ!**

*తా: అడిగినను నెలజీతమియ్యని ఆటోపముగల యజమానిని సేవించి కష్టపడుట కంటెను, మంచి యెద్దులను గట్టి పొలము దున్నుకొని బ్రతుకుట మంచిది.*

**18. అడియాస గొలువు గొలువకు,**
**గుడిమాన్యము సేయబోకు, కుజనులతోడన్**
**విడువకు కూరిమి సేయకు,**
**మడవిని దో దరయ కొంటి సరుగకు సుమతీ!**

*తా: ఏదో దొరకునను ఆశతో ఎవ్వరిని సేవింపకుము. గుడిభూములు దున్ని కౌలుకు వ్యవసాయము చేయకుము. (దేవుని సొమ్ము ఆ రూపముగా కూడ తినకూడదని యర్థము). దుర్మార్గులతో స్నేహము చేయవద్దు. తోడు లేకుండా అడవిలో ఒంటరిగా పోవద్దు.*

**19. ఇచ్చునదె విద్య, రణమున**
**జొచ్చునదే మగతనంబు, సుకవీశ్వరులున్**
**మెచ్చునదెకైత (నేర్పు), వాదుకు**
**వచ్చునదే కీడుసుమ్ము వసుధను సుమతీ!**

*తా: (శిష్యులకు) ఇతరులకు వివరించి చెప్పగలిగినదే నిజమైన పాండిత్యము, బయట ప్రగల్భములాడుట కాక యుద్ధములో నిలువగలిగినదే వీరత్వము, కవీంద్రులు మెచ్చునదే అసలైన కవిత్వము. వివాదమునకు దారితీయు పనియే మనుష్యునకు హానికరము.*

**20.** **ఉడు ముండదె నూరేండ్లును**
**బడి యుండదె పేర్మి బాము పదినూఱేండ్లున్**
**మడువున గొక్కెర యుండదె**
**కడు నిల బురుషార్థపరుడు కావలె సుమతీ!**

*తా: ఉడుము నూరేండ్లు బ్రతుకును, పాము వేయి యేండ్లు బ్రతుకును, మడుగులో కొంగ చిరకాలము జీవించును. వాని వలన లోకమునకు లాభమేమి? పోనిమ్ము, వానికైన స్వలాభమేమున్నది? (అనగా, ఆత్మోద్ధరణకై చేయు కృషి యేమున్నది?) మానవుడై పుట్టిన తరువాత ధర్మార్థకామమోక్షము లనెడి పురుషార్థములు సాధించవలెను. లేనిచో ఆ మానవుని జన్మము పైవాని వలెనే వ్యర్థము.*

**21.** **ఎప్పటి కెయ్యది ప్రస్తుత**
**మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్**
**నొప్పింపక తా నొవ్వక**
**తప్పించుక తిరుగువాడె ధన్యుడు సుమతీ!**

*తా: ఏ సమయములో ఏ మాటలాడిన సరిపడునో ఆలోచించి, దానికి తగినట్లుగా ఇతరులను బాధించక తాను బాధపడక అనుయోచిత చాతుర్యముతో మాటలాడి వ్యవహారమును పరిష్కరించుకొనువాడే వివేకవంతుడు.*

**22.** **తనవారు లేనిచోటును,**
**జనవించుక లేనిచోట, జగడముచోటన్,**
**అనుమానమైనచోటును,**
**మనుజున కట నిలువదగదు మహిలో సుమతీ!**

*తా: తన మంచిని గోరు ఆత్మీయులు లేనిచోటను, తన మాట చెల్లుబడిలేని చోటను, కలహము జరుగు చోటను, తన గౌరవము చెడిపోవునను అనుమానము గలిగిన చోటను మనుష్యుడు ఎప్పుడును ఉండుట మంచిది కాదు.*

**23. శుభముల నొందని చదువును,**
**అభినయమును, రాగరసమునందని పాటల్**
**గుభగుభలులేని కూటమి**
**సభమెచ్చని మాటలెల్ల జప్పన సుమతీ!**

*తా: మంచి చెడ్డలు గుర్తించు వివేకము నియ్యని చదువును, సంగీతాభినయయులు లేని వట్టిపాటయు, ప్రణయ కలహములు లేని సంసారమును సభవారు మెచ్చని ప్రసంగములును రుచిలేక చప్పగానుండును.*

**24. సరసము విరసము కొరకే**
**పరిపూర్ణ సుఖంబు అధిక బాధల కొరకే**
**పెరుగుట విరుగుట కొరకే,**
**ధర హెచ్చుట తగ్గుట కొరకె తథ్యము సుమతీ!**

*తా: పరిహాస మెక్కువనచో అది విరోధముగా మారుటకే, ఎక్కువ సుఖములు గలుగుట బాధలు గలుగుట కొఱకే, ఏదైనను (చెట్టు కావచ్చును) ఎక్కువగా పెరుగుట పడిపోవుట కోసమే. ధర హెచ్చినదనగా మరల తగ్గుట కోసమేయని గ్రహించవలెను.*

**25. స్త్రీల యెడల వాదులాటకు,**
**బాలురతో జెలిమిచేసి భాషింపకుమీ,**
**మేలైన గుణము విడువకు,**
**ఏలినపతి నిందసేయకెన్నడు సుమతీ!**

*తా: ఆడువారితో తగువులాడవద్దు. అజ్ఞానులైన బాలకులతో స్నేహము చేసి సంభాషించవద్దు. (పెద్దలను మన్నించుట చేతకాక వారు తేలిక చేయుదురు.) మంచి గుణములనెప్పుడును విడిచి పెట్టకుము. నిన్ను పోషించు రాజును (యజమానిని) ఎప్పుడును దుర్భాషలాడకుము.*

# వేమన పద్యాలు

**1. అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను**
**సజ్జనుండు బల్కు చల్లగాను**
**కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: తక్కువ బుద్ధి గలవాడు ఎప్పుడూ గొప్పలు చెప్పుచుండును. మంచి బుద్ధి గలవాడు తగినంత మాత్రమునే మాటలాడును. కంచు మ్రోగినంత పెద్దగా బంగారం మ్రోగదు కదా! అని భావం.*

**2. ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు**
**చూడచూడ రుచుల జాడ వేరు**
**పురుషులందు పుణ్య పురుషులు వేరయా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: ఉప్పు, కర్పూరం చూడటానికి ఒకే విధంగా కనిపించును. కానీ పరిశీలించి చూసినచో వాటి రుచులు, గుణములు వేరు వేరుగా ఉండును. ఆ విధంగానే మానవులందరూ ఒకే విధంగా అవయవ లక్షణములు, ఆకారములు కలియున్ననూ మామూలు మనుషుల కంటే గొప్పవారి లక్షణములను పరిశీలించి తెలుసుకొనగలిగినచో అవి విలక్షణముగా ఉండునని భావం.*

**3. గంగిగోవు పాలు గరిటెడైనను చాలు**
**కడివెడైన నేమి ఖరము పాలు**
**భక్తిగలుగు కూడు పట్టెడైనను చాలు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: ఓ వేమా! మంచి ఆవు పాలు కొంచమైనా ఉపయోగంగా ఉండును. కానీ కడవ నిండా ఉన్నా గాడిద పాలు పని ఏమి? భక్తితో పెట్టిన భోజనం కొద్దిగా అయినా చాలును కదా! అని భావం.*

4. **అనువుగానిచోట నధికులమనరాదు**
**కొంచెముండుటెల్ల కొదువ గాదు**
**కొండ అద్దమందు కొంచమై యుండదా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: మనకు తగని ప్రదేశంలో గొప్పవారమని, ఎక్కువ అని అనుట మంచిది కాదు. మనకు గల గొప్పతనమును, ఆధిక్యతను ప్రదర్శించకపోయినంత మాత్రాన మన ఔన్నత్యమునకు భంగం కలగదు. కొండ ఎంత పెద్దదైననూ అద్దములో చూచినపుడు చిన్నదిగానే కనిపించును గదా! అని అర్థం.*

5. **తల్లిదండ్రి మీద దయలేని పుత్రుడు**
**పుట్టనేమి వాడు గిట్టనేమి**
**పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: ఓ వేమనా! తల్లిదండ్రులపై ప్రేమలేని కుమారుడు పుట్టిననూ, చచ్చిననూ ఒక్కటే. పుట్టలలో పుట్టి ఎవరికీ ఉపయోగం లేక ఆ పుట్టలోనే చచ్చెడు చెదపురుగుల వలె తల్లిదండ్రులపై ప్రేమ లేని కుమారుని జన్మము వ్యర్థం కదా! అని భావం.*

6. **వేరుపురుగు చేరి వృక్షంబు జెఱచును**
**చీడపురుగు చేరి చెట్టు చెఱచు**
**కుత్సితుండు చేరి గుణవంతు చెఱచురా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: ఓ వేమనా! ఓ మహా వృక్షమును అడుగు భాగమున చేరిన వేఱు పురుగు ఆ వృక్షమును చంపివేయును. ఒక చీడ పురుగు ఆ చెట్టును నాశనం చేయును. అలాగే దుర్మార్గుడు మంచివారిని చెదగొట్టును కదా! అని భావం.*

7. **నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు**
**తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేలా**
**చాటు పద్యమిలను చాలదా యొక్క**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: ఓ వేమనా! నిజమైన మంచి నీలమణి ఒక్కటైనా చాలును. అంతేగానీ ఊరక మెరిసే గాజురాళ్ళు తట్టెడు ఉన్ననూ వ్యర్థమే. చాటు పద్యము ఒక్క దానిని విన్ననూ చాలును గదా! అనేక రసహీన పద్యములను విన్ననూ నిరుపయోగమే కదా! అని భావం.*

**8. మేడిపండు చూడ మేలిమై యుండును**
**పొట్ట విచ్చి చూడ పురుగులుండు**
**పిరికివాని మదిని బింకమీలాగురా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: ఓ వేమనా! పైకి మేడిపండు ఎర్రగా పండి చక్కగా కన్పించు చుండును. దానిని చీల్చి చూడగా పొట్టలో పురుగులుండును. పిరికివాడు పైకి గాంభీర్యముగా ప్రదర్శించినప్పటికీ పిరికి తనము కలిగియుండును.*

**9. ముష్టి వేపచెట్టు మొదలుగా బ్రజలకు**
**పరగ మూలికలకు పనికివచ్చు**
**నిర్దయుండు ఖలుడు నీచుడెందులకగు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: విశ్వవృక్షమైన ముష్టి, అమిత చేదుగా ఉండే వేపాకు కూడా ఔషధ రూపంగానైనా లోకానికి ఉపయోగపడతాయి. దుర్మార్గుడు సంఘానికి ఏ విధంగానూ ఉపయోగపడడు, అంతేకాదు హాని కూడా చేస్తాడు.*

**10. నీళ్ళలోన మొసలి నిగిడి యేనుగు బట్టు**
**బైట కుక్క చేత భంగ పడును**
**స్థానబల్మిగాని తన బల్మిగాదయా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: ఓ వేమనా! నీళ్ళలో ఉన్న మొసలి చిన్నదైననూ ఏనుగును కూడా నీటిలోకి లాగి చంపగలదు. కానీ ఆ మొసలి తన స్థానమైన నీటి నుంచి బయటకి వచ్చినపుడు కుక్క చేత కూడా ఓడింపబడును. మొసలికి ఆ బలము స్థానము వలన వచ్చినదే కాని తన స్వంత బలము కాదు.*

**11.** **వంపుకఱ్ఱగాచి వంపు తీర్చగవచ్చు**
**కొండలన్ని పిండిగొట్టవచ్చు**
**కఠినచిత్తు మనసు కరిగింపగా రాదు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: వంకర కఱ్ఱను మంటలో వేడి చేసి తిన్నగా చేయవచ్చు, కొండలను పిండి చేయవచ్చు. కఠిన చిత్తుని దయావంతునిగా మార్చలేం.*

**12.** **ప్రియములేని విందు పిండివంటల చేటు**
**భక్తిలేని పూజ పత్రి చేటు**
**పాత్రమెఱుగనీవిబంగారు చేటురా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: ప్రేమ లేని అన్న సంతర్పణము నందు పిండివంటకము వ్యర్థము. బంగారము అపాత్రతగల దానిచ్చి సొమ్ములు చేయమంటే బంగారము వన్నె తగ్గును. ఆ రీతిగానే దేవునిపై గురిలేని పూజ పత్రి పరమ వ్యర్థమని అర్థము.*

**13.** **నీచగుణములెల్ల నిర్మూలమైపోవు**
**కొదవలేదు సుజన గోష్ఠి వలన**
**గంధ మలద మేనికంపడగినయట్లు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: సుగంధ భరితమైన చందనాన్ని శరీరానికి పూసుకుంటే దేహానికుండే దుర్గంధం ఎలా పోతుందో అలాగే సుజన గోష్ఠి వలన మనలోని చెడు గుణాలన్నీ దూరమైపోతాయి. అందుచేత సదా సజ్జన సాంగత్యాన్నే కోరుకోవాలి అని అర్థం.*

**14.** **కుండ కుంభ మండ్రు కొండ పర్వత మండ్రు**
**యుప్పు లవణ మండ్రు యొకటి గాదె**
**భాషలింతె వేఱు పరతత్వమొకటే**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: సంస్కృతంలో కుండను కుంభం అంటారు. ఉప్పును లవణం అంటారు.*

*కొండను పర్వతం అంటారు. ఇక్కడ భాష మాత్రమే వేరు కాని అసలు పదార్థం ఒక్కటే. అలాగే మీరు రామ అనండి, ఏసు అనండి, అల్లా అనండి, నానక్ అనండి. కేవలం పేర్లు మార్పే కాని పరమాత్ముడు ఒక్కడే. భాష వేరైనా భావమొక్కటే. మతాలు వేరైనా మనుష్యులు ఒక్కటే అని అర్థం."*

**15. పసుల వన్నె వేరు పాలెల్ల ఒక్కటి**
**పుష్పజాతి వేరు పూజ ఒకటి**
**దర్శనంబులారు దైవంబు ఒక్కటె**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: మనుష్యులంతా ఒక్కటే. పశువులు వేరువేరు రంగులలో ఉన్నప్పటికీ అవి ఇచ్చే పాలు మాత్రం తెల్లగానే ఉంటాయి. అలాగే మనుషులు వివిధ వర్ణాల వారైనా మనసులు ఒకటిగా మసలుకోవాలంటాడు వేమన. పూవులు వేరువేరు రంగులతో ఉన్నా పూజకు వినియోగపడటంలో అవన్నీ ఒక్కటే గదా! అని అర్థం.*

**16. ఎరుగ వాని దెలుప నెవ్వడైనను జాలు**
**నొరుల వశముగాదు ఓగుదెల్ప**
**యేటివంక దీర్ప నెవ్వరి తరమయా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: తెలుసుకోవాలనే జిజ్ఞాసగలవారికి తెలియజెప్పడం అందరికీ సులభమే. తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళు అని వాదించటం మూర్ఖుని సహజ లక్షణం. అలాంటి వాడికి తెలియజెప్పటం ఎవరి తరం కాదు. ఏటికుండే ప్రకృతి సిద్ధమైన వంపును సరిచేయటం ఎవరికీ సాధ్యం కాదు. అలాగే మూర్ఖుడిని కూడా సరిచేయలేము.*

**17. చిత్త శుద్ధి కలిగి చేసిన పుణ్యంబు**
**కొంచెమైన నదియు గొదువ కాదు**
**విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: వైరాగ్యముతో ఆత్మానందము నొందెడి ఓ వేమా! వినుము. నిర్మలమైన మనస్సుతో ఏ కొంచెము పుణ్యకార్యము చేసినను అది చాల ఘనమైన ఫలమునిచ్చును. చాల చిన్నదైన మఱ్ఱి విత్తనము నుండి మహావృక్షము పుట్టుట లేదా?*

**18. ఆత్మశుద్ధిలేని యాచారమదియేల?**
**భాండశుద్ధిలేని పాకమేల?**
**చిత్తశుద్ధిలేని శివపూజలేలయా?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: పెద్దల నుండి వచ్చిన ఆచారమును అంతఃకరణ శుద్ధితో పాటించవలెను. ఆత్మశుద్ధిలేని యాచారము వ్యర్థము. వంట చేయు పాత్రలను ముందు శుభ్రపరచవలెను. అది లేనిచో ఆ వంట తినుటకు యోగ్యము కాదు. అట్లే స్నానాదులతో బాహ్యశుద్ధి కలిగియుండుటే కాక మనసును గూడ కామక్రోధాదులు లేకుండ ప్రశాంతముగా నుంచుకొని శివపూజ చేసిన ఫలము వుండును.*

**19. అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను**
**సజ్జనుండు బల్కు చల్లగాను**
**కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

*తా: అల్పబుద్ధి గల వాడు లేనిపోని గొప్పలు చెప్పుకొనుచు ఎక్కువగా మాటలాడును. సజ్జనుడైనవాడు తన గొప్పదనమును మరుగుపఱచి, అందరితోను మృదుమధురముగా కొద్దిగా మాటలాడును. లోకములలో విలువ తక్కువైన కంచు పెద్దగా మ్రోగుటయు, విలువ యెక్కువ గల బంగారము తక్కువగా మ్రోగుటయు మనము చూచుచున్నాము గదా!*

**20. రాముడొకడు పుట్టి రవికుల మీడేర్చె**
**కురుపతి జనియించి కులము జెఱచె**
**నిలను బుణ్యపాప మీలాగు కాదొకో**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం: అవతార పురుషుడైన రాముడు సూర్యవంశములో జన్మించి దుష్టశిక్షణ చేసి ఆ వంశమును ప్రసిద్ధినొందునట్లు చేసెను. కురువంశములో దుర్యోధనుడు జన్మించి, తన వంశము వారిని నిర్మూలించుటే కాక, కులమునకు ఆ ప్రతిష్ట తెచ్చెను. వీరిద్దరును పుణ్యపాపము లిట్లుండునని నిరూపించిరి.

**21.** **అల్పుడెన్ని విద్యలభ్యసించిన గాని**
**ఘనుడుగాడు హీన జనుడెకాని**
**పరిమళముల మోయ గాడిద, గజమౌనె**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: నీచబుద్ధిగల మానవుడు ఎన్ని విద్యలు నేర్చినను గొప్పవాడు కాలేడు. అధముడేయగును. గంధపు చెక్కలవంటి సుగంధ ద్రవ్యముల మోయుచున్నంత మాత్రమున గాడిద యేనుగవునా? (ఏనుగున కున్న గౌరవము వచ్చునా యని యర్థము.)*

**22.** **విద్యలేనివాడు విద్యాధికుల చెంత**
**నుండినంత పండితుండు కాడు**
**కొలను హంసలకడ గొక్కెర యున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: ఒక చదువురాని వాడు పండితుల దగ్గర మసలినంత మాత్రము చేత పండితుడుగా గుర్తింపబడడు. వాని బండారము బయటపడుచునే యుండును. కొలనులోని హంసల దగ్గర కొంగ తిరిగినంత మాత్రమున హంసయైపోవునా? వాని లక్షణములు దీనికెట్లు వచ్చును?*

**23.** **కోపమున ఘనత కొంచెమై పోవును**
**కోపమునను మిగుల గోడు గల్గు**
**కోపమడచనేని కోరిక లీడేరు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: కోపమున్న వాడెంత గొప్పవాడైనను తేలికగా చూడబడును. ఆ కోపము,*

*గొప్పదనమును తగ్గించును. ఆ కోపము వలననే తనకు దాను హాని కలిగించుకొనును. "కామ ఏష; క్రోధ ఏష రజోగుణసముద్భః" అని గీత. కామక్రోధములు మహాపాపిష్ఠివి. మహాశత్రువులు గూడ. అట్టి కోపము నణచుకొని శాంతుడైనచో అతని కోరికలన్నియు సిద్ధించును.*

**24. అన్ని దానముల అన్నదానమె గొప్ప**
**కన్న తల్లికంటే ఘనము లేదు**
**ఎన్న గురుని కన్న నెక్కువ లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: అన్ని దానములకంటెను అన్నదానము గొప్పది. ఏది పెట్టినను నరుని తృప్తి పరచలేము. కాని అన్నము పెట్టి "తృప్తోస్మి" అనిపించగలము. కన్న తల్లికంటె గొప్పది ఏదియు భూమిమీద లేదు. ధర్మరాజును యక్షుడు "భూమి కన్నను బరువైన దేది?" అని యడుగగా అతడు "నవమాసములు మోసి, ప్రసవ వేదన పడి, మనకు ధర్మాచరణమునకు యోగ్యమైన దేహమునిచ్చిన తల్లికంటెను బరువైనది, పృథివిలో లేదని" సమాధానమిచ్చెను. అందుకే "నమాతుః పరదైవతమ్" అని సూక్తి. అనగా తల్లిని మించిన గొప్ప దైవము వేరే లేదని యర్థము. ఇంక గురువు: తల్లి దేహమునిచ్చును, గురువు విజ్ఞానమును, వివేకమును ఇచ్చును, ఇవి మానవుడైన వాని కత్యవసరము. అందుచేతనే "గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్పరం బ్రహ్మ" అని గురువే పరదైవతముగా చెప్పబడెను. "నగురో రధికం, న గురో రధికం" (గురువు కంటె అధికుడు లేదు.)*

**25. పట్టుపట్టరాదు పట్టి విడువరాదు**
**పట్టెనేని బిగియ బట్టవలెను,**
**పట్టి విడుచుటకన్న బడి చచ్చుటయె మేలు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తా: ఏ విషయములోను, ఇది జరిగ తీరవలెనని పట్టుదల పూననే రాదు. ఒకవేళ అట్లు పట్టు పట్టినచో మధ్యలో వదలకూడదు. ఆ విధముగా మధ్యలో పట్టుదల విడిచిపెట్టుట కంటెను ఆత్మహత్య చేసికొని చచ్చుటయే చాలా మంచిది.

**26. తప్పు లెన్నువారు తండోపతండంబు**
**లుర్విజనులకెల్ల నుండుదప్పు,**
**తప్పులెన్నువారు తమ తప్పు లెఱుగరు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: ఎదుటి వారిలోని తప్పులెన్నువారు చాలమందియే ఉందురు. కాని అందరిలోను తప్పులుండును. అయితే, ఎదుటివారిలోని తప్పులెన్నువారు తాము చేసిన తప్పులను గుర్తింపరు.*

*"సహజాంధదశాః స్వదుర్ణయే, పరదోషేక్షణ దివ్యచక్షుషః" అని ఒక సూక్తియున్నది. లోకములోని ప్రజలు ఎదుటివారి తప్పులెన్నుటలో దివ్యదృష్టిని కలిగియుందురట. కాని తమ తప్పులు గుర్తించుటలో గ్రుడ్డివారివలె ప్రవర్తింతురట.*

**27. అనగ ననగ రాగమతిశయిల్లుచు నుండు**
**దినదినగ వేము తీయగుండు**
**సాధనమున బనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: పాడగాపాడగా రాగము బాగుగా వచ్చును. పాడుటమాని వేసినచో కంఠము సాధనము లేక మృదువుగా సాగదు. తినగా తినగా వేప చిగుళ్ళు కూడ తాయగా నుండును. అనగా చేదు నోటికి అలవాటై అదే బాగున్నట్లుండును. అట్లే మొదట ఏ పనియైనను చేతకానట్లున్నను చేయగా చేయగా చేయి తిరిగి నైపుణ్యము వచ్చును.*

**28. అనువుగాని చోట నధికుల మనరాదు**
**కొంచెమైన నదియుగొదువ కాదు**
**కొండ యద్దమందు గొంచమై యుండదా?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: సమయము, సందర్భము తనకు అనుకూలముగా లేని చోట తన గొప్పతనమును చాటుకొనుటకు ప్రయత్నించి నగుబాటు నొందకూడదు. కొంచెము తగ్గి ప్రవర్తించినంత మాత్రం చేత చిన్నతనము రాదు. పెద్దదైన కొండ*

అద్దమునందు చిన్నదిగానే కనిపించును. అంతమాత్రము చేత దాని ఘనత మాసిపోవునా?

**29. ధనము గూడబెట్టి దానంబు చేయక**
**తాను దినక లెస్స దాచుకొనును**
**తేనె టీగ కూర్చి తెరువరి కియ్యదా?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: ఎవ్వరికిని దానధర్మములు చేయక, పోనీ తానైనను అనుభవించక పదిముళ్ళు వేసి దాచుకొన్నచో అది ఇతరుల పాలగును. అనగా రాజైనను టాక్సుల రూపమున తీసుకొని పోవును. లేదా ఏ దొంగలైనను దోచుకొన పోవుదురు. తేనెటీగలు చాల కష్టపడి పువ్వు పువ్వునకును తిరిగి తేనెను సంపాదించి తాము తినకుండ దాచుకొనును. దాని నెవ్వడో దారిని బోవువాడు చూచి తేనెటీగల నదలించి తేనెను కొల్లగొట్టుకొని పోవునుగదా!*

**30. మాటలాడుటొకటి, మనసులో నొక్కటి,**
**ఒడలి గుణము వేరె, యోజవేరె**
**ఎట్లు గలుగుముక్తి యిలాగుతానుండ?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: మనసులోని ఆలోచన ఒకటి, పైకి చెప్పునదొకటి, చేసెడిది వేరొకటి, ఇది దుర్జన స్వభావము. ఇటువంటి వారికి ముక్తి యెట్లు వచ్చును.*

**31. మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్,**
**మనస్యన్యం వచస్యన్యం కర్మణ్యన్యం దురాత్మనామ్ ॥ అని సూక్తి**

*తా: మహాత్ములు, మనసులో నాలోచించినది మాటగా చెప్పుదురు. ఆ చెప్పినది అక్షరాల ఆచరించెదరు. ఇది వారి స్వభావము. దురాత్ములు మనసులో ఆలోచించునది వేరు, పైకి చెప్పునది వేరు, ఆచరించునది మరొక్కటి, ఇట్లు త్రికరణ శుద్ధిలేని దుర్జనులకు మోక్షమెట్లు కలుగును?*

**32. అంతరంగమందు నపరాధములు చేసి**
**మంచి వానివలెనె మనుజు డుండు**
**ఇతరులెఱుగకున్న నీశ్వరుడెఱుగడా?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: మనుష్యుడు తన మనస్సులో ఎన్నో దూరాలోచనములు చేయు చుండును. ఎవరికిని దెలియకుండ కొన్నింటిని వీలైనచో ఆచరణలో గూడ పెట్టును. కాని పైకి మాత్రము అందరికిని మంచివాని వలెనే కనబడుచుండును. తోడి మానవులకు వాని లోగుట్టు తెలియకపోవచ్చు. కాని సర్వాంతర్యామియైన ఆ భగవంతునికి వాని నైజము తెలియదా?*

**33. ఏకో హ మస్మీతి చ మన్యసే త్వం**
**తస్వాంతికే త్వం వృజినం కరోషి**

*అని ఒక సూక్తి యున్నది. "ఒక్కడనే యున్నాను. ఎవ్వరును చూచుటలేద"ని తప్పులు చేయుచున్నావు. కాని నీలోనే ఆత్మరూపుడై యున్న భగవానుని ముందు అనేక పాపములు చేయుచున్నాని గ్రహింపలేకున్నావు. ఎవ్వరు చూడకపోయినను ఆయన సాక్షిగా చూచుచుండును గదా! అని యర్థము.*

**34. చదివి చదివి కొంత చదువు చదువంగ**
**చదువు చదివి యింకన్ జదువు చదివి**
**చదువు మర్మములను చదువలేదయ్యోను**
**విశ్వదాభిరామ వినురవేమ!**

*తా: ఎంత కాలము చదివినా, ఎన్నెన్ని చదువులు చదివినా, చదువులలోని మర్మము అయిన ఆత్మతత్త్వము తెలియకపోతే ఆ చదువులన్నియు ఎందుకూ పనికి రావు. అనగా నిరర్థకములు, వ్యర్థములని యర్థము.*

# 10. శ్రీ సత్యసాయి పద్యసూక్తులు

1. అడవిలోననున్న ఆకాశమున నున్న
పట్టణమున నున్న పల్లెనున్న
గుట్టమీదనున్న నట్టేట నున్నను
మదిని సాయి నిన్ను మరువడెపుడు

2. శ్రీ పుట్టపర్తి నిలయుడు
కాపాడును నిన్ను నెపుడు కరుణాకరుడై
చేపట్టి నిన్ను బ్రోచును
ఏ పట్టున విడువకుండ ఏలును నిన్నున్

3. కంటికి కనిపించు దృశ్యంబు కాంచి మీరు
సత్యమదియేనని నమ్మబోకుడు సంబరమున
విశ్రమించక నాతోడి వెడలి రండి
సత్యమిదియని తెలుపుదు సంతసముగ

4. పొగకు మూలము నిప్పుల పుంజముండ
రైలు బండిని నడిపించు డ్రైవరుండ
ఆటోమేటిక్ లైటుకు అధిపుడుండ
ఒకడు ప్రకృతిని సృష్టింప నుండ వలదె

5. ఉన్నాడయా! దేవుడున్నాడయా! కన్నులకు కనిపించకున్నాడయా!
లోకాల చీకట్లు పోకార్ప రవిచంద్ర దీపాలు గగనాన
త్రిప్పుచున్నాడయా!
లక్షలాదిగ నున్న నక్షత్రముల నెల్ల నేలరాల్పక మింట
నిలుపుచున్నాడయా!
ఈ ధరుణి చక్రమిరుసు లేకుండగ ఎల్లవేళల త్రిప్పుచున్నాడయా
జీత బత్తెము లేక ప్రీతితో మనకొఱకు గాలిలో సురిటీలు విసరేదయా!
ఆధారమే లేక అలరారుచున్నట్టి ఆకాశమును ఆపుచున్నాడయా!
పొంగి పొరలుచు వచ్చి పృథ్విపై పడకుండ
కడలి రాజు కాళ్ళు ముడిచాడయా!
కనిపించకేమి చేస్తున్నాడయా!
తెరచాటు తానుండి తెరముందు ప్రజల నుంచి
తైతక్కలాడించు చున్నాడయా!

6. తల్లి కంటె మిగుల దైవంబె దగ్గర
సన్నిహితుడు చాల తండ్రి కన్న
అట్టి దైవమును వీడ అబ్బును పాపంబు
సత్యమైన బాట సాయి మాట

7. మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే
వస్త్రభేదము వేరు దారమొక్కటే
శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటే
జీవజాతులు వేరు జీవుండు ఒక్కటే
కులము లన్నియు వేరు పుట్టుక ఒక్కటే
దర్శనంబులు వేరు దైవమ్ము ఒక్కటే
పూలవన్నెలు వేరు పూజ ఒక్కటే
తెలియ లేకను మానవుల్ తెలివి దప్పి

బ్రతుకు కోసము బహుబంధ బద్ధులైరి
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార

8. విష్ణువే గొప్పని వైష్ణవులనుచుండ
    శంభుండు గొప్పని శైవులనగ
గణపతి గొప్పని గాణపతులు పల్క
    శారద గొప్పని చదువరులన
అల్లా ఘనుండని తురకలు చెప్ప
    క్రీస్తుయే గొప్పని క్రైస్తవులన
బుద్ధుడే గొప్పని బౌద్ధులను చుండ
    మహావీరుడే గొప్పని జైనులనగ
జోరాష్ట్ర గొప్పని పారశీలు చెప్ప
    నానక్ గొప్పని సిక్కులనగ
సాయియే గొప్పని బాబా భక్తులు చెప్ప
    అందరొక్కటేయని కొందరనగ
సర్వమత సమ్మతముగ సత్యమైన
    బ్రహ్మ మొక్కటి యని మీరు పలుక వలయు

9. భక్తి చదువులన్ని భక్తితో చదివేరు
ముక్తి చదువు కెవరు ముందు రారు
ఇట్టి వారు నన్ను ఎఱుగంగ నేర్తురా!
ఎట్టి విద్యలుండి ఏమి ఫలము?

10. చదువులన్ని చదివి చాల వివేకియై
మదిని తన్నెఱుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏ రీతి నున్నను
హీను డవగుణంబు మానలేడు

11. స్వగృహే పూజ్యతే మూర్ఖః
స్వగ్రామే పూజ్యతే ప్రభుః
స్వరాజ్యే పూజ్యతే రాజా
విద్యాన్ సర్వత్ర పూజ్యతే

12. చదివి వ్రాయ నేర్చిన వారంతా విద్యార్థులేనా?
కాలేజీ డిగ్రీలు పొంద విద్యావంతుడగునా?
సుజ్ఞానము సుకృతములేని విద్యలు సద్విద్యలగునా?
బ్రతుకుటకే విద్యయన్న బ్రతుకలేదె పశుపక్షులు!

13. మంచి మాట వినరు మనసిచ్చి చెప్పిన
చెడ్డమాటలట్టె చెవిన జేరు
ఇట్టి వారు నన్ను ఎఱుంగ నేర్తురా?
ఎంత చదువుయుండి ఏమి ఫలము?

14. విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్పి
సంకుచిత భావములనెల్ల సమయ జేసి
ఐకమత్యము సహజీవనాధికములు
సమత నేర్పునదే గాదె సరస విద్య

15. సత్ప్రవర్తన సద్బుద్ధి సత్యనిరతి
భక్తి క్రమశిక్షణ కర్తవ్యపాలనంబు
నేర్పునదె విద్య అద్దాని నేర్వవలయు
సత్యమును తెలుపు బాట శ్రీ సాయి మాట

16. గ్రామ సేవయన్న రామసేవయే సుమీ
రామరాజ్యమన్న ప్రేమ మయమే
ప్రేమలేకయున్న క్షేమంబులేదయా
సేవలేకయున్న శాంతిలేదు

17. పట్టిన పట్టేదో పట్టనే పట్టితివి
    పట్లు నెగ్గెడు దాకా అట్టి యుండు
తలచినదేదియో తలచనేతలచితివి
    తలపుతీరెడు దాక తరలకుండు
కోరిన దేదియో కోరనే కోరితివి
    కోరిక తీర్చెడు దాక కోరినిలువు
అడిగినదేదియో అడగనే అడిగితివి
    అడిగినదిచ్చు దాకా మరలకుండు
పోరు పడలేక తానైన బోవ్రవలయు
    బడలు తెలియకు నీవైన చావవలయు
అంతెయేకాని మధ్యలో వెళ్ళుట
    భక్తుని లక్షణము కాదు

# 11. వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

1. కోరిక బ్రతికించు కొన్నాళ్ళు కొన్నేళ్లు
ఆశ బ్రతికించు నీయుండు దాకా
అశయమొక్కటే అమరత్వ మిచ్చేది
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

2. విలువలు నడిపించు విజయ పథము పైన
యాత్ర జాతి కొరకు యతిగ జేతు
చివరి శ్వాస వరకు సేవింతు నార్తులన్
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

3. బలము యువతదేరా భారతావనికెల్ల
ఎల్ల భూమికిడగ నెంచు శక్తి
యుక్తి నిచ్చి మనము యువతను మార్చాలి
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

4. బాధ దీర్చ మనుచు భగవంతు గోరకు
తోడు తీసుకెళ్లు తొలగించి వేయు
అద్వైత మణచేను అన్ని క్లేశమ్ములన్

5. స్ఫూర్తి నొంది నారి పూర్ణ శక్తిగ మారి
ప్రేరణౌను పుడమి పేర్మి నొంద
అబల సబలయవ్వ ఆత్మ విశ్వాసమ్ము తో
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

6. లక్షమెంచవోయి లక్ష కోరికలున్న
కక్ష మారనట్టి కర్మ జేసి
శివుని నంది గాంచు చిద్విలాసము రీతి
వినుర బాల చంద్ర వినయ సంద్రా

7. నీడ నిచ్చి మేము నిన్ను గాచితి మంటు
కొమ్మలకులెల్ల కొలువు జెప్ప
మానులవుదురేద్వ మహి తల్లి తండ్రులు
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

8. జీవితానికొక జిజ్ఞాస యుండాలి
ప్రముఖ పాత్ర నొప్పు పథము వెనుక
పరమ పదము నొంది బ్రతకాలి నిత్యమై
వినుర బాల చంద్ర వినయ సాంద్రా

9. పంచ వోయి ప్రేమ పరమాత్ము కొకనికే
జీవనమ్ము సాగ సేవ చేసి
మంచి కొరకే బ్రతుకు మరణించ వేనాడు
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

10. కన్న వారి సేవకన్న పూజల వేవి
కలిమి నివ్వలేవు కాంక్షలుడగ
భవ్య భావ బంధ భాద్యతలు దాటించు
వినుము భారతీయ వీర సుతుడా

11. బ్రతుక నిచ్చు విద్య బడి లోన నేర్చేవు
బ్రతుకు నిచ్చు విద్య అభయ నేర్పు
బ్రతికి బ్రతుక నిచ్చు భావనే దైవంబు
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

12. చిత్రమైన గీయి చిత్తైన చేసుకో
బ్రతుకు కుంచె నీదే ప్రతిభ నీదే
అమరగల్గు రంగు లద్దనేర్చితివేని
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

13. దానమిచ్చు నప్పుడు దర్పాన్ని జూపిన
ధనము నవ్వి వాని దశను మార్చు
తాను మాధ్యముగ తల పోయ ధన్యుడౌ
వినుర బాలచంద్ర వినయ సాంద్రా!

14. ఒట్టు ప్రోత్సహించు నొంటరివవకుండ
వెన్ను తట్టి హితుల వెంట నడుపు
సంకట మవు కార్య సఫలత నందేవు
వినుర బాలచంద్ర వినయ సాంద్ర..

# 12. దేశ భక్తి గీతాలు

## 1. వందేమాతరం

వందేమాతరం వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందేమాతరం
శుభ్రజ్యోత్స్న పులకిత యామినీం
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం ॥వందేమాతరం॥

## 2. మా తెలుగు తల్లికి

మా తెలుగు తల్లికి మల్లె పూదండ
మా కన్న తల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కను చూపులో కరుణ
చిరునవ్వు లో సిరులు దొరలించు మా తల్లి
గల గలా గోదారి కదలి పోతుంటేను
బిర బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి

మురిపాల ముత్యాలు దొరలు తాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై నిఖిలమై నిలచి యుండే దాక
రుద్రమ్మ భుజ శక్తి మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారు మ్రోగే దాక
నీ ఆటలే ఆడుతాం నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

## 3. భారతీయ వీరులం

భారతీయ వీరులం – భరతమాత బిడ్డలం
మాతృదేశ గౌరవం – కాపాడే ధీరులం
శాంతికోరు పాపలం – సమత పెంచు బాలలం
మేము భావి పౌరులం – త్యాగధనుల వారసులం
వేష భాష లేవైనా – మతాచార మేదైనా
మనం భారతీయులం – ఒకే తల్లి పిల్లలం
ప్రపంచాన మన దేశం – ప్రతిభను నిలబెట్టుదాం
మనమంతా సైనికులం – మనం ప్రజాసేవకులం
జాతి స్వేచ్ఛ నపహరించు – శత్రువు నెదిరించుతాం
విజయం సాధించుతాం – జయపతాక నెగరేద్దాం
విజయం సాధించుతాం – జయపతాక నెగరేద్దాం
హిమశైల కిరీటయై – సముద్ర పాదపీఠయై
గంగ, యమున, గోదావరి – కృష్ణవేణి సహితయై
విలసిల్లే భరతమాత – మన తల్లికి జోహార్
భారతీయ వీరులం – భరతమాత బిడ్డలం
భారతీయ వీరులం – భరతమాత బిడ్డలం

# 4.దేశమును ప్రేమించుమన్నా

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్న
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయి!
పాడి పంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటు పడవోయి
తిండి కలిగితే కండ కలదోయి
కండ కలవాడేను మనిషోయి
ఈసురోమని మనుషులుంటే
దేశ మేగతి బాగుపడునోయి
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేసి సరుకులు నించవోయి
అన్ని దేశాల్ క్రమ్మవలె నోయి
దేశి సరుకుల నమ్మవలె నోయి
డబ్బు తేలెనట్టి నరులకు
కీర్తి సంపదలబ్బవోయి!
వెనుక చూసిన కార్యమేమోయి
మంచి గతముల కొంచమేనోయి
మందగించక ముందు అడుగేయి
వెనక పడితే వెనకే నోయి!
పూను స్పర్ధను విద్యలందే
వైరములు వాణిజ్య మందే
వ్యర్థ కలహం పెంచబోకోయి
కత్తి వైరం కాల్చవోయి!
దేశాభిమానము నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుకోయి
పూని యేదైనను, నొక మేల్

కూర్చి జనులకు చూపవోయి!
ఓర్వ లేమి పిశాచి దేశం
మూలుగులు పీల్చేసె నోయి!
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయి!
పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపి కెక్కడ సుఖం కద్దోయి
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్ల లోయి
సొంత లాభము కొంత మానుకు
పొరుగువారికి తోడు పడవోయి
దేసమంటే మట్టి కాదోయి
దేశమంటే మనుషులోయి!
చెట్ట పట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడువవలె నోయి
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలె నోయి!
మతం వేరైతేను యేమోయి
మనము వొకటై మనుషులుంటే
జాతి యన్నది లేచి పెరిగి
లోకమున రాణించునోయి!
దేశ మనియెడి దొడ్డ వృక్షం
ప్రేమలను పూలెత్తవలె నోయి
నరుల చమటను తడిసి మూలం
ధనం పంటలు పొందవలె నోయి!
ఆకులందున అణిగి మణిగి
కవిత పలకవలె నోయి
పలుకులను విని దేసమందలి
వనములు మొలకెత్త వలెనోయి!

## 5. తల్లీ భారతి

తల్లీ భారతి వందనమమ్మా
నీ ఇల్లే మా నందనమమ్మా
మేమంత నీ పిల్లలమూ
నీ చల్లని ఒడిలో మల్లెలమూ ॥తల్లీ॥
తల్లితండ్రులను గురువులను
ఎల్లవేళలా కొలిచెదము
చదువులు బాగా చదివేదమమ్మా
జాతిగౌరవం పెంచెదమమ్మా ॥తల్లీ॥
కులమత భేదము మరిచెదమూ
కలతలు మాని మెలిగెదమూ
మానవులంతా సమానమంటూ
మమతను సమతను పెంచెదరూ ॥తల్లీ॥
తెలుగు జాతికే అభ్యుదయము
నవభారతికే నవోదయం
భావిపౌరులం మనం మనం
భారత జనులకు జయం జయం ॥తల్లీ॥

## 6. జయ జయ జయ ప్రియ భారత

జయ జయ జయ ప్రియ భారత జనయిత్రి దివ్య ధాత్రి
జయ జయ జయ శత సహస్ర నర నారీ హృదయ నేత్రి
జయ జయ సశ్యామల సు శ్యామచలా చేలాంచల
జయ వసంత కుసుమలతా చరిత లలిత చూర్ణ కుంతల
జయ మదీయ హృదయాశ్రయ లాక్షారుణ పద యుగళా
జయ జయ జయ ప్రియ భారత జనయిత్రి దివ్య ధాత్రి
జయ దిశాంత గత శకుంత దివ్యగాన పరితోషణ

జయ గాయక వైతాళిక గళ విశాల పద విహరణ
జయ మదీయ మధుర గేయ చుంబిత సుందర చరణ

## 7. ఏ దేశమేగినా ఎందుకాలిడినా

ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపురా నీ జాతి నిండు గౌరవము
రాయప్రోలన్నాడు ఆనాడు అది మరిచిపోవద్దు ఏనాడు
పుట్టింది నీ మట్టిలో సీత
రూపు కట్టింది దివ్య భగవద్గీత
వేదాలు వెలసిన ధరణి రా
ఓంకార నాదాలు పలికిన అవని రా
ఎన్నెన్నో దేశాలు కన్ను తెరవని నాడు
వికసించె మన నేల విజ్ఞాన కిరణాలు
ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపురా నీ జాతి నిండు గౌరవము
వెన్నెలది ఏ మతము రా
కోకిలది ఏ కులము రా
గాలికి ఏ భాష ఉంది రా
నీతికి ఏ ప్రాంతముంది రా
గాలికీ నీటికీ లేవు భేదాలు
మనుషుల్లో ఎందుకీ తగాదాలు కులమత విభేదాలు
ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా

పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపురా నీ జాతి నిండు గౌరవము
గౌతమ బుద్ధుని బోధలు మరవద్దు
గాంధీ చూపిన మార్గం విడవద్దు
గౌతమ బుద్ధుని బోధలు మరవద్దు
గాంధీ చూపిన మార్గం విడవద్దు
దేశాల చీకట్లు తొలగించు
స్నేహ దీపాలు ఇంటింటా వెలిగించు
ఐకమత్యమే జాతికి శ్రీరామ రక్ష
అందుకే నిరంతరం సాగాలి దీక్ష...
అందుకే నిరంతరం సాగాలి దీక్ష...

## 8. గాంధీ పుట్టిన దేశం

గాంధీ పుట్టిన దేశం
రఘురాముడు ఏలిన రాజ్యం
ఇది సమతకు మమతకు సంకేతం
ఇది సమతకు మమతకు సంకేతం
గాంధీ పుట్టిన దేశం
రఘురాముడు ఏలిన రాజ్యం
ఇది సమతకు మమతకు సంకేతం
ఇది సమతకు మమతకు సంకేతం
రఘుపతి రాఘవ రాజారాం
పతితపావన సీతారాం
ఈశ్వర అల్లా తేరేనాం
సబకోసన్మతి దే భగవాన్
భేదాలన్నీ మరచి మోసం ద్వేషం విడచి
భేదాలన్నీ మరచి మోసం ద్వేషం విడచి

మనిషి మనిషిగా బ్రతకాలి
ఏనాడూ నీతికి నిలవాలి
మనిషి మనిషిగా బ్రతకాలి
ఏనాడూ నీతికి నిలవాలి
బాపూ ఈ కమ్మని వరమే మాకివ్వు
అవినీతిని గెలిచే బలమివ్వు
అవినీతిని గెలిచే బలమివ్వు
గాంధీ పుట్టిన దేశం
రఘురాముడు ఏలిన రాజ్యం
ఇది సమతకు మమతకు సంకేతం
ఇది సమతకు మమతకు సంకేతం
రఘుపతి రాఘవ రాజారాం
పతితపావన సీతారాం
ఈశ్వర అల్లా తేరేనాం
సబకోసన్మతి దే భగవాన్
ప్రజలకు శాంతి సౌఖ్యం కలిగించే దేశమే దేశం
ప్రజలకు శాంతి సౌఖ్యం కలిగించే దేశమే దేశం
బానిసభావం విడనాడి ఏజాతి నిలుచునో అది జాతి
బానిసభావం విడనాడి ఏజాతి నిలుచునో అది జాతి
బాపూ నీ చల్లని దీవెన మాకివ్వు
నీ బాటను నడిచే బలమివ్వు
నీ బాటను నడిచే బలమివ్వు
గాంధీ పుట్టిన దేశం
రఘురాముడు ఏలిన రాజ్యం
ఇది సమతకు మమతకు సంకేతం
ఇది సమతకు మమతకు సంకేతం
రఘుపతి రాఘవ రాజారాం
పతితపావన సీతారాం

ఈశ్వర అల్లా తేరేనాం
సబకోసన్మతి దే భగవాన్
రఘుపతి రాఘవ రాజారాం
పతితపావన సీతారాం

## 9. నీ ధర్మం నీ సంఘం నీ దేశం

నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు
సత్యం కోసం సతినే అమ్మిన్నదెవరు - హరిశ్చంద్రుడు
తండ్రిమాటకై కానలకేగినదెవరు - శ్రీరామచంద్రుడు
అన్న సేవకే అంకితమైనదెవరన్నా - లక్ష్మన్న
పతియే దైవమని తరించింపోయినదెవరమ్మ - సీతమ్మ
ఆ పుణ్యమూర్తులు చూపినమార్గం అనుసరించుటే ధర్మం
అనుసరించుటే నీ ధర్మం నీ ధర్మం మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు
చాపకూడుతో సమతను నేర్పెను నాటి పలనాటి బ్రహ్మన్న
మేడిపండులా మెరిసే సంగం గుట్టువిప్పెను వేమన్న
వితంతుల విధి వ్రాతలు మార్చి బ్రతుకులు పండించె కందుకూరి
తెలుగు భారతిని ప్రజలభాషలో తీరిచిదిద్దెను గురజాడ
ఆ సంస్కర్తల ఆశయరంగం నీవు నిలిచిన సంఘం
నీవు నిలిచిన ఈ సంఘం నీ సంఘం మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు
స్వతంత్రభారత రధసారధియై సమరాన దూకె నేతాజి
సత్యాగ్రహమే సాధనమ్ముగా స్వరాజ్యమే తెచ్చె బాపూజి
గుండెకెదురుగా గుండె నిలిపెను ఆంధ్రకేసరి టంగుటూరి
తెలుగువారికొక రాష్ట్రం కోరి ఆహుతి ఆయెను అమరజీవి
ఆ దేశభక్తులు వెలసిన దేశం నీవు పుట్టిన భారతదేశం

నీవు పుట్టిన ఈ దేశం
నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు
మహనీయులనే మరవద్దు

## 10. దేశం మనదే తేజం మనదే

దేశం మనదే తేజం మనదే
ఎగురుతున్న జెండా మనదే
నీతి మనదే జాతి మనదే
ప్రజల అండదండా మనదే
అందాల బంధం ఉంది ఈ నేలలో
ఆత్మీయ రాగం ఉంది ఈ గాలిలో
ఏ కులమైనా ఏ మతమైనా
ఏ కులమైనా ఏ మతమైనా
భరతమాతకొకటేలేరా
ఎన్ని బేధాలున్నా మాకెన్ని తేడాలున్నా
దేశమంటే ఏకమౌతాం అంతా ఈ వేళ
వందేమాతరం అంటామందరం
వందేమాతరం అంటామందరం
దేశం మనదే తేజం మనదే
ఎగురుతున్న జెండా మనదే
నీతీ మనదే జాతీ మనదే
ప్రజల అండదండా మనదే
అందాల బంధం ఉంది ఈ నేలలో
ఆత్మీయ రాగం ఉంది ఈ గాలిలో
ఏ కులమైనా ఏ మతమైనా
భరతమాతకొకటేలేరా

రాజులు అయినా పేదలు అయినా
భరతమాత సుతులేలేరా
ఎన్ని ద్వేషాలున్నా మాకెన్ని దోషాలున్నా
దేశమంటే ప్రాణమిస్తాం అంతా ఈవేళ
వందేమాతరం అంటామందరం
వందేమాతరం ఓ... అంటామందరం
వందేమాతరం వందేమాతరం
వందేమాతరం వందేమాతరం
వందేమాతరం వందేమాతరం

## 11. శ్రీలు పొంగిన జీవగడ్డై పాలు పారిన భాగ్యసీమై

శ్రీలు పొంగిన జీవగడ్డై పాలు పారిన భాగ్యసీమై
వరలినది ఈ భరత ఖండము భక్తి పాడర తమ్ముడా!(2)
వేద శాఖలు వెలసెనిచ్చట ఆదికావ్యం బలరె నిచ్చట
బాదరాయణ పరమ ఋషులకు పాదు సుమ్మిది తమ్ముడా
॥శ్రీలు పొంగిన॥
విపిన బంధుర వృక్ష వాటిక ఉపనిషన్మధువొలికెనిచ్చట
విపుల తత్వము విస్తరించిన విమల తలమిది తమ్ముడా ॥శ్రీలు పొంగిన॥
సూత్ర యుగముల శుద్ధ వాసన క్షాత్ర యుగముల శౌర్య చండిమ
చిత్ర దాస్యము చే చరిత్రల చెరిగిపోయెర తమ్ముడా ॥శ్రీలు పొంగిన॥
మేలి కిన్నెర మేళవించీ రాలు కరుగగ రాగమెత్తి
పాలతీయని బాలభారత పథము పాడర తమ్ముడా ॥శ్రీలు పొంగిన॥
దేశగర్వము దీప్తి చెందగ దేశచరితము తేజరిల్లగ
దేశమరసిన ధీరపురుషుల తెలిసి పాడర తమ్ముడా ॥శ్రీలు పొంగిన॥
పాండవేయుల పదునుకత్తులు మండి మెరిసిన మహితరణ కథ
కండగల చిక్కని పదంబుల కలిపి పాడర తమ్ముడా ॥శ్రీలు పొంగిన॥

## 12. తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే

తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే కొలిచెదమా
భావం భాగ్యం కూర్చుకొని ఇక జీవన యానం చేయుదమా
సాగర మేఖల చుట్టుకొని సుర గంగ చీరగా మలచుకొని
గీతా గానం పాడుకొని మన దేవి కి ఇవ్వాలి హారతులు
గాంగ జటాధర భావనతో హిమ శైల శిఖరమే నిలబడగా
గలగల పారే నదులన్నీ ఒక బృంద గానమే చేస్తుంటే
ఎందరు వీరుల త్యాగబలం మన నేటి స్వేచ్ఛకే మూలబలం
వారందరిని తలచుకొని మన మానస వీధిని నిలుపుకొని

## 13. నిర్మల సుర గంగాజల సంగమ క్షేత్రం

నిర్మల సుర గంగాజల సంగమ క్షేత్రం
రంగుల హరివిల్లులు విలసిల్లిన నిలయం
భారతదేశం మన జన్మ ప్రదేశం
భారత ఖండం ఒక అమృత భాండం
ఉత్తరాన ఉన్నతమౌ హిమగిరి శిఖరం
దక్షిణాన నెలకొన్నది హిందు సముద్రం
తూరుపు దిశ పొంగి పొరలె గంగా సంద్రం
పశ్చిమాన అనంతమై సింధు సముద్రం ॥భారతదేశం॥
ఒకే జాతి సంస్కృతి ఒకటున్న ప్రదేశం
రత్నగర్భ పేరు గన్న భారత దేశం
ధీర పుణ్య చరితలున్న ఆలయ శిఖరం
సత్య ధర్మ శాంతులున్న ప్రేమ కుటీరం ॥భారతదేశం॥
కోకిలమ్మ పాడగలదు జాతీయ గీతం
కొండకోన వాగు పాడు సంస్కృతి గీతం
గుండె గుండె కలుసుకుంటే సమరస భావం

చేయి చేయి కలిపితేనే ప్రగతుల తీరం ॥భారతదేశం॥
మనది అన్న భావముంటే మనుగడ సాధ్యం
శక్తి శూన్యమయి ఉంటే ప్రగతి అసాధ్యం
సంఘటనయే ఈ యుగాన సర్వశక్తి పీఠం
సత్యజ్యోతి మన శక్తిని నిలిపే నిలయం ॥భారతదేశం॥

## 14. పాడవోయి భారతీయుడా

పల్లవి॥ పాడవోయి భారతీయుడా
ఆడి – పాడవోయి విజయగీతిక
నేడే స్వాతంత్ర్యదినం – వీరుల త్యాగఫలం
నేడే నవోదయం – నీదే ఆనందం ॥పాడ॥

చరణం 1 స్వాతంత్ర్యం వచ్చెననీ సభలే చేసి
సంబరపడగానే సరిపోదోయి
సాధించినదానికి సంతృప్తిని చెంది..
అదే విజయమనుకుంటే పొరబాటోయి
ఆగకోయి భారతీయుడా
కదలి సాగవోయి ప్రగతిదారులా ॥ఆగ॥

చరణం 2 ఆకాశం అందుకునే ధరలొకవైపు
అదుపులేని నిరుద్యోగం మింకొకవైపు
అవినీతి బంధు ప్రీతి చీకటిబజారు
అలుముకొన్న నీదేశం ఎటు దిగజారు
కాంచవోయి నేటి దుస్థితి
ఎదిరించవోయి ఈ పరిస్థితి ॥కాం॥

## 15. చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా

చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా
గతమెంతో ఘన కీర్తి గలవోడా
వీర రక్తపు ధార వార వోసిన సీమ
పలనాడు నీదెరా వెలనాడు నీదెరా
బాల చంద్రుడు చూడ ఎవరోడోయ్
తాండ్ర పాపయ కూడ నీవోడోయ్ ॥చెయ్యెత్తి॥
నాయకీ నాగమ్మ, మల్లమాంబ, మొల్ల
మగువ మాంచాల నీ తోడ బుట్టిన వోళ్ళె
వీర వనితల గన్న తల్లేరా
ధీర మాతల జన్మ భూమేరా ॥చెయ్యెత్తి॥
కల్లోల గౌతమి వెల్లువల క్రిష్ణమ్మ
తుంగభద్రా తల్లి పొంగిపొరలిన చాలు
ధాన్య రాశులు పండు దేశాన
కూడు గుడ్డకు కొదువ లేదోయి ॥చెయ్యెత్తి॥
పెనుగాలి వీచింది అణగారి పోయింది
నట్టనడి సంద్రాన నావ నిలుచుండాది
ముక్కోటి బలగమై ఒక్కటై మనముంటే
ఇరుగు పొరుగులోన ఊరు పేరుంటాది
తల్లి ఒక్కటె నీకు తెలుగోడా
సవతి బిడ్డల పోరు మనకేలా ॥చెయ్యెత్తి॥

## 16. తెలుగు జాతి మనది

తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది?
తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది?
తెలంగాణ నాది... రాయలసీమ నాది...

సర్కారు నాది... నెల్లూరు నాది...
అన్నీ కలిసిన తెలుగునాడు... మనదే... మనదే... మనదేరా..
తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది
ప్రాంతాలు వేరైనా మన అంతరంగమొకటేనన్నా
యాసలు వేరుగ ఉన్నా... మన భాష తెలుగు భాషన్నా
వచ్చిండన్నా.... వచ్చాడన్నా... ఆ....
వచ్చిండన్నా.... వచ్చాడన్నా పరాల తెలుగు ఒకటేనన్నా...
తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది
మహాభారతం పుట్టింది రాణ్మహేంద్రవరంలో
భాగవతం పుట్టింది ఏకశిలానగరంలో
ఈ రెంటిలోన ఏది కాదన్న
ఈ రెంటిలోన ఏది కాదన్న ఇన్నాళ్ళ సంస్కృతి నిండుసున్నా
తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది
పోచంపాడు ఎవరిది... నాగార్జున సాగరమెవరిది
పోచంపాడు ఎవరిది... నాగార్జున సాగరమెవరిది
మూడు కొండలు కలిపి దున్నినా ముక్కారు పంటలు బండ్లకెత్తినా
అన్నపూర్ణమ్మ కన్నబిడ్డలం. ఐదు కోట్ల తెలుగువారిది
తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది
సిపాయి కలహం విజృంభించ నరసింహాలై గర్జించాము
స్వతంత్ర భారత్‌కి జై
గాంధీ, నెహ్రూల పిలుపునందుకుని సత్యాగ్రహాలు చేసాము
వందేమాతరం... వందేమాతరం
స్వరాజ్య సిద్ధి జరిగిన పిమ్మట స్వరాష్ట్రమును సాధించాము
జై విశాలాంధ్ర
దేశభక్తిలో తెలుగువారికి దీటే లేదనిపించాము
తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది
ఇంటిలోన అరమరికలు ఉంటే ఇల్లెక్కి చాటాలా
కంటిలో నలక తీయాలంటే కనుగుడ్డు పెరికి వేయాలా

పాలుపొంగు మన తెలుగుగడ్డను పగులగొట్టవద్దు
పాలుపొంగు మన తెలుగుగడ్డను పగులగొట్టవద్దు
నలుగురిలో మనజాతిపేరును నవ్వులపాలు చెయ్యొద్దు
తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది
తెలంగాణ మనది... రాయలసీమ మనది...
సర్కారు మనది... నెల్లూరు మనది...
అన్నీ కలిసిన తెలుగునాడు... మనదే... మనదే... మనదేరా..
తెలుగు జాతి మనది.... నిండుగ వెలుగు జాతి మనది

## 17. నా జన్మభూమి

నా జన్మభూమి... భూమి... భూమి...
నా జన్మభూమి ఎంత అందమయిన దేశము
నా యిల్లు అందులోని కమ్మని ప్రదేశము
నా సామిరంగ హెయ్ హెయ్ నా సామిరంగ ॥నా జన్మభూమి॥
నడిచే దారిలో నవ్వే పువ్వులు
శాంతి నాదాలతో ఎగిరే పిట్టలు ॥నా జన్మభూమి॥
పచ్చని పంటలు వెచ్చని జంటలు
చల్లని జీవితం ఇదే నవభారతం హెయ్ నా సామిరంగ ॥నా జన్మభూమి॥
బతకాలందరు దేశం కోసము
దేశమంటేను మట్టికాదోయ్ మనుష్యులోయ్
స్వార్థము వంచనా లేనిదే పుణ్యము
త్యాగమూ రాగమూ మిళితమే ధన్యహెువోయ్ నా సామిరంగ ॥నా జన్మ॥

## 18. భారతమాతకు జేజేలు

భారత మాతకు జేజేలు బంగరు భూమికి జేజేలు
ఆ సేతు హిమాచల సస్యశ్యామల జీవ ధాత్రికి జేజేలు ॥భారత॥

త్రివేణి సంగమ పవిత్ర భూమి నాల్గు వేదములు పుట్టిన భూమి
గీతామృతమును పంచిన భూమి పంచశీల బోధించిన భూమి ॥భారత॥
శాంతి దూతగ వెలసిన బాపు, జాతి రత్నమై వెలిగిన నెహ్రూ
విప్లవ వీరులు వీర మాతలు ముద్దు బిడ్డలై మురిసిన భూమి ॥భారత॥
సహజీవనము సమభావనమూ సమతావాదము వేదముగా
ప్రజాస్వామ్యమే ప్రగతి మార్గముగ లక్ష్యములైన విలక్షణ భూమి॥భారత॥

## 19. పాడుదమా స్వేచ్ఛా గీతం

పాడుదమా స్వేచ్ఛాగీతం
ఎగరేయుదమా జాతిపతాకం
దిగంతాలు నినదించి విశ్వవిఖ్యాతి నొందగా జాతి గౌరవం ॥పాడుదమా॥
జలియన్ వాలా బాగు దురంతపు
నెత్తుటి ధారలు హత్తుకొని
ఉరికొయ్యల చెరసాలల గోడల
దారుణాలు తలకెత్తుకొని
పొగిడిన కాలం పోరాడిన కాలం
మరి మరి ఒకపరి తలచుకొని
మృత వీరుల గాథలు తెలుసుకొని ॥పాడుదమా॥
వందేమాతరమని నినదించిన
వీరుల శౌర్యం తలచుకొని
స్వాతంత్రం నా జన్మహక్కని
గర్జించిన గళమందుకొని
పోరాట ఫలం స్వాతంత్ర ఫలం
కలకాలం కాపాడుకొని
కడు గర్వంగా కొనియాడుకొని ॥పాడుదమా॥
మన్యం గుండెల మంటై రగిలిన
విప్లవ జ్యోతి స్ఫూర్తియని

గుండు కెదురుగా గుండె నిలిపిన
తెలుగు సింగముల తెగువగని
చీకటి గుండెల బాకై మెరిసిన
గరిమెళ్లను గురుతుంచుకొని
మన తెలుగు తేజమును నింపుకొని ॥పాడుదమా॥
జనగణమనముల జాగృతినింపిన
జెండా గాథలు చెప్పుకొని
జయహే జయజయహే జననీ యని
జయ గీతమ్ములు పాడుకొనీ
పావన చరితం పరిమళభరితం
అఖండ భారత ఖండమని
అది అక్షయ అమృతభాండమనీ ॥పాడుదమా॥

## 20. భరతమాత బిడ్డలం అందరం

1. పల్లవి: భరతమాత బిడ్డలం అందరం –
భరతమాత బిడ్డలమే అందరం (2)

కలిసి వుంటె కలదు సుఖం – కలహిస్తే దుఃఖమయం
పరస్పరం ప్రేమిద్దా – పరదూషణ మానేద్దాం
కులబేధాలొద్దు మనకు – బాషాబేధాలొద్దు
అంటరానితనమొద్దు – అందరమొకటిగ వుందాం ॥భరత॥

దేశమంటే మట్టి కాదు – దేశమంటే మనుషు లోయ్
దేశాన్ని ప్రేమిద్దాం – త్యాగాన్ని చూపిద్దాం
పవిత్రముగ జీవించి – పావని చరితను పొంది
స్వార్థమ్మును విడనాడి – సత్యసాయిని చేరుదాం ॥భరత॥

మనశక్తిని మనము తెలిసి – యువశక్తిని చాటుదాం
గ్రామగ్రామాల్లోన – సేవలెన్నో చేద్దాము
సేవలెన్నైనా అవి – కష్టసాధ్యములైన
ఒకరినొకరు చేరి మనము – విజయము సాధించుదాం॥భరత॥

2. నిర్మల సుర గంగా జల సంగమ క్షేత్రం
రంగుల హరి విల్లులు విలసిల్లిన నిలయం
భారతదేశం మన జన్మ ప్రదేశం
భారత ఖండం ఒక అమృత భాండం

ఉత్తరాన ఉన్నతమైహిమ గిరిశిఖరం
దక్షిణాన నెలకొన్నది హిందూ సముద్రం
తూర్పుదిశ పొంగి పొరలే గంగా సంద్రం
పశ్చిమాన అనంతమై సింధు సముద్రం ॥నిర్మల॥

ఒకే జాతి సంస్కృతి ఒకటున్న ప్రదేశం
రత్న గర్భ పేరుగన్న భారతదేశం
ధీరపుణ్య చరితలున్న ఆలయశిఖరం
సత్యధర్మ శాంతులున్న ప్రేమకుటీరం ॥నిర్మల॥

కోకిలమ్మ పాడగలదు జాతీయగీతం
కొండ కోన వాగు పాడు సంస్కృతి గీతం
గుండె గుండె కలిపితేనే సమరస భావం
చేయి చేయి కలిపితేనే సమరస గీతం ॥నిర్మల॥

## 21. సారే జహాసె అచ్ఛా

సారే జహాసె అచ్ఛా హిందుస్తాన్ హమారా
హమ్ బుల్ బులే హై ఇస్‌కే, యే గుల్ సితా హమారా
పరబత్ వో సబ్ సే ఊంఛా హమ్‌సాయా ఆస్‌మాన్ కా
వో సంతరీ హమారా! వో పాస్‌బా హమారా
గోదిమే ఖేల్‌తీహై ఇస్‌కీ హజారో నదియా
గుల్‌షన్ హై జిన్‌కే దమ్‌సే రష్‌కే జినా హమారా
మజ్ – హబ్ నహీ సిఖాతా ఆపస్‌మె బైర్ రఖ్‌నా
హిందీ హై హమ్ వతన్ హై హిందుస్తాన్ హమారా

## 22. బాలలం బాలలం - భరతమాత బిడ్డలం

.  బాలలం బాలలం – భరతమాత బిడ్డలం
భవ్యగీతి పాడుతాం – భారతి నేకొలుస్తాం ॥బాల॥

చరణం 1  తల్లి మాట తండ్రి మాట తప్పకుండ వింటాము
గురువు మాట మీద మేము గురుత్వము నిలుపుతాం
చదువులెన్నో చదువుతాం సంస్కరం పొందుతాం
పరీక్షలో నెగ్గుతాం ప్రగతి బాటలో నడుస్తాం ॥బాల॥

చరణం 2  సమయ పాలనను మేము సవ్యంగా పాటిస్తాం
సౌశీల్యం సద్భావం సంఘములో పెంచుతాం
క్రమము తప్పకుండ మేము క్రమశిక్షణ పాటిస్తాం
కాఠిన్యత చూపకుండ కలసిమెలసి జీవిస్తాం ॥బాల॥

చరణం 3  ధర్మ పథము మీరకుండ ధర్మమునే నిలుపుతాం
దేశ ప్రజలు ఒక్కటని దీక్షబూని చాటుతాం

సమానత్వ సందేశం సాటి వారికం దిస్తాం
చెట్టా పట్టాలు పట్టి - సాగి ముందుకేగుతాం ॥బాల॥

చరణం 4 విజ్ఞానము నార్జించి విజ్ఞులమై నిలుస్తాం
వీరత్వమునే పెంచుచు వీరులమై నడుస్తాం
దేశభక్తి నిస్వార్థం, సౌభ్రాతృత పెంచుతాం
దేశమాత సేవలోన దేహాలను అర్పిస్తాం ॥బాల॥

## 23. తరతరాల చరిత్ర పిలుపిది మరువబోకుము సోదరా

తరతరాల చరిత్ర పిలుపిది మరువబోకుము సోదరా
నరనరాన స్వదేశ భక్తియే పరుగులెత్తగ నిమ్మురా

రామ రాజ్యము ధర్మరాజ్యము - సకలజన సుఖశాంతి మూలము
దివ్యజీవన మొసగు రాజ్యము - దేశ ప్రజలకు తెల్పునేమన
రాక్షసత్త్వము రూపుమాపుట - లక్షముగ గ్రహియింపదగునని

శరధి గట్టిన మానవేంద్రుడు - స్వర్ణలంకను గొన్నవీరుడు
దాశరథి శ్రీరామ చంద్రుని - చరిత తెలిపెడి సారమేమన
జన్మభూమికి స్వర్గమైనను - సాటిరాదని చాటినాడని

సింధునది తీరానయవనులు - హిందువీరుల ఖడ్గధాటికి
కదన భూమిని వదలిపారిన - కథలు తెలిపెడి సారమేమన
క్షాత్రవీర్యము బ్రహ్మతేజము - కలిసి యుండిన కలదు జయమని

అడవులే ఆశ్రయములైనను - ఆకులలములె అన్నమైనను
మొగలు పాదుష గుండెలదరగ - జీవితాంతము పోరుసల్పిన
వీరరాణ తెల్పునేమన - జాతిశ్రేయము ధ్యేయమౌనని

## 24. చేయి చేయి కలుపుదాం సేవ చేయ కదులుదాం

చేయి చేయి కలుపుదాం సేవ చేయ కదులుదాం
ప్రజల కొరకై పవిత్రంగా ప్రతి నిమిషం బ్రతుకుదాం

చరణం 1. అవయవాలు వేరైనా ఆత్మ మాత్రమొక్కటే
ప్రాంతం వేరేదైనా ప్రజలంతా ఒక్కటే
భాషలెన్ని పలికినా భావం సంపదొక్కటే
ప్రమాదాలు ఎదురైతే ప్రతిస్పందన మొక్కటే ॥చేయి॥

చరణం 2. కంటి నలుసు కాలి ముల్లు కలిగించే బాధలను
గుండె రగుల మెదడు కదల కరముల తొలగించురా
భరత భూమి సీమలోన బాధలు పెల్లుబికినా
మన కండలు కరిగించి ఇడుముల తొలగించుదాం ॥చేయి॥

చరణం 3. జనశక్తిని జాతికొరకు జాగృతమొనరించుదాం
ఒకే తల్లి బిడ్డలమను ఊహనిచట పెంచుదాం
"వందేమాతర" మంటూ ముందు ముందు కేగుదాం
ఒకరికొకరు తోడు నిలచి ఉన్నత సాధించుదాం ॥చేయి॥

## 25. గోవిందుడేల రాడె గోపాలు డేలరాడె

గోవిందుడేల రాడె గోపాలు డేలరాడె
మా అయ్య ఏలరాడె మాతండ్రి ఏలరాడె
నల్ల నల్లని వాడు నామాలు గలవాడు
పుట్ట పుట్టము వాడు నెమలి పింఛము వాడు

మత్స్యావతారమున మడుగులోన దాగినాడె
మడుగులోన దాగి నాడె వేదములు తెచ్చినాడె

వరహావతారమున వసుధను ఎత్తినాడె
వసుధను ఎత్తినాడె అసురుని చీల్చినాడె

నరసింహ రూపమున కంబమునదాగినాడె
కంబమున దాగినాడె రక్కసుని చీల్చినాడె

వామనావతారమున బలినిదానమడిగినాడె
బలిని దాన మడిగినాడె బ్రహ్మాండం నిండినాదె

పరుశురాముడై తానురాజులను చంపినాడె
రాజులను చంపినాడె భూమి దానమిచ్చినాడె

రామావతారమున రావణుని చీల్చినాడె
రవణుని చీల్చినాడె భూమి భారము తీర్చినాడె

బుద్ధావతారమున సుద్దులెన్నో నేర్పినాడె
సుద్దులెన్నో నేర్పినాడె బౌద్ధమతం నిల్పినాడె

# 13. పిల్లలు కథలెందుకు వినాలి?

- ఆకట్టుకునేలా, హావభావాలతో, నాటకీయంగా కథచెప్పగలిగితే పిల్లలు ఒళ్ళుమరచి, కళ్ళు చెవులు అప్పగించి వింటారు. అప్పుడు వారి ఏకాగ్రత తారాస్థాయిలో ఉంటుంది.
- ఆసక్తిగా వినే క్రమంలో అర్థం కాని పదాలు దొర్లితే వాటిని అప్రయత్నంగానే సందర్భానుసారంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు – కథ వాటి మూలంగా ఆగడం నచ్చదు కనుక, అర్థం కాని పదంగానీ, విషయం గానీ కథ అర్థం కావడానికి అడ్డం పడుతోంది అనిపిస్తే వెంటనే ప్రశ్నిస్తారు. ప్రశ్నలు వేయడం – సందేహాలు తీర్చుకోవడం అలవడుతుంది.
- టి.వి., కంప్యూటర్ వంటి దృశ్యమాధ్యమాల్లో ఊహించేందుకు తావుండదు. కథ వింటున్నపిల్లలు అందులోని దృశ్యాలనీ, వ్యక్తుల్నీ, జంతువుల్నీ వారి ఊహల్లో చూస్తారు. అదో అద్భుతమైన అనుభవం!
- ఊహల్లో – నిజ జీవితంలో ఎన్నడూ అనుభవంలోకి రాని వింతైన అనుభవాలకు లోనౌతారు. (సాహసం, పరాక్రమం, గాలిలో ఎగరడం, ఈగంత చిన్నగా అయిపోవడం, కొండంత పెద్దగా పెరిగిపోవడం లాంటివి)
- సాధారణంగా పిల్లలు కథలోని ప్రధాన పాత్రలతో తమని గుర్తించుకుంటారు. (ఆడపిల్లలైతే రాజకుమార్తెగానో, అబ్బాయైతే రాజకుమారుడిగానో). ఆ పాత్రల యొక్క లక్షణాలు తమవిగా ఊహించుకోవడంలో అప్రయత్నంగా

మంచి విలువలను, వీరోచిత లక్షణాలను కలిగి ఉండడం, చెడును ఎదిరించడం, న్యాయాన్ని రక్షించడం లాంటి గుణాలు తమలో ఉండాలని కోరుకుంటారు. (అందుకే చిన్నపిల్లల కథల్లో ప్రధాన పాత్రలు ఉదాత్తంగా, ఉన్నతంగా ఉండాలి).

- విభిన్న నేపథ్యాలున్న కథలు చెప్తే పిల్లలు వాటి ద్వారా ఎన్నో సంగతులు నేర్చుకుంటారు. పాఠం వినేటప్పటికంటే, కథ వినేటప్పుడు ఏకాగ్రత పదిరెట్లు ఎక్కువ ఉంటుంది కాబట్టి, చరిత్ర సంగతులు, పురాణగాథలు, వివిధ దేశాల జీవనశైలులు లాంటి విషయాలెన్నో కథల ద్వారా విన్నప్పుడు వాటిని సులభంగా గుర్తు పెట్టుకుంటారు.
- హాస్యపూరిత కథలైనా, సాహస గాథలైనా, పురాణాలైనా, పంచతంత్రం వంటి జంతువుల కథలైనా, ప్రస్తుత కాలం నేపథ్యంగా ఉన్న కథలైనా... ఏవైనా గానీ మంచి-చెడులను పిల్లలు అలవోకగా వడపోసి విలువలను వారే నిర్ధారించుకోగలుగుతారు. నీతిని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కథల్లోని పాత్రలు, వాటి లక్షణాలు పిల్లలపై వారి వ్యక్తిత్వ నిర్మాణంపై గాఢమైన ప్రభావం చూపిస్తాయి.
- కథలు చెప్పడం - పిల్లలు వినడంలో పెద్దలకు పిల్లలకు మధ్య అనుబంధం ఏర్పడుతుంది. మీరు అమ్మా నాన్నలైతే మీ పట్ల పిల్లలు మరింత ఆపేక్ష పెంచుకుంటారు. మీరు టీచరైతే పిల్లలకు దగ్గరవడానికి. వారిలో బెరుకు. సంకోచం పోగొట్టడానికి ఇది మంచి మార్గం.

# 14. పిల్లలు కథలెందుకు చదవాలి?

- కథలే కాదు. అసలు పిల్లలు ఏదైనా ఎందుకు చదవాలి? చదవడం బాగా వస్తే మంచి మార్కులొస్తాయి. మంచి మార్కులొస్తే మంచి ఉద్యోగమొస్తుంది. ఇలాంటివి పెద్దవాళ్ళుగా మనం ఆశించే ప్రయోజనాలు. కానీ పిల్లలెందుకు చదువుతారు?
- చదివేది వారికి ఇష్టంగా ఉంటే చదువుతారు.
- చదవడం సంతోషంగా ఉంటే చదువుతారు.
- మరి కథలకు మించినవేమన్నా అలాంటివి ఉన్నాయా?
- చదవడం జ్ఞాన సముపార్జనకి అత్యంత అవసరం. చదవడం అనేది పరీక్షల కోసమో, మార్కుల కోసమో కాదు. క్రొత్త విషయాలను నిరంతరం తెలుసుకుంటూ ఉండడంలోని ఉత్సాహం కోసం, విచిత్రమైన ఊహల ప్రపంచంలో విహరించడానికి, థ్రిల్ కోసం, చక్కని భాషను ఆస్వాదించడంలోని ఆనందం కోసం చదవడం వ్యసనం కావాలి.
- విస్తృతమైన పఠనాభిలాష, అలవాటు ఉన్న పిల్లలకు పాఠ్య పుస్తకాలలోని విషయాలను చదవడం, మంచి నీళ్ళ ప్రాయమే అవుతుంది. (మనకు కావాల్సిన మార్కులూ వస్తాయి!)
- ఒక పాఠ్య పుస్తకం ద్వారా కొన్ని విషయాలు మాత్రమే తెలుస్తాయి. ఇతర పుస్తకాలు చదివే పిల్లలకు ఎన్నో విషయాలు తెలుస్తాయి.

- రకరకాల పుస్తకాలు చదివే పిల్లలకు భాషపై పట్టు అలవోకగా వచ్చేస్తుంది. తెలిసిన విషయాన్ని చక్కగా వివరించి చెప్పగలిగే, వ్రాయ గలిగే నైపుణ్యం సులభంగా అలవడుతుంది. కాబట్టి ప్రశ్నలు – జవాబులు బట్టీ వేయడం అనే వ్యర్ధ ప్రయాస వారికి అవసరం ఉండదు.
- చదివే అలవాటున్న పిల్లలు చదవడం, వ్రాయడం, విషయ పరిజ్ఞానం, సృజనాత్మక వ్యక్తీకరణ లాంటి విషయాల్లో ఖచ్చితంగా మెరుగ్గా ఉంటారు.
- చదివే ప్రతి పుస్తకం పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది – చదవడం ఎన్నో నైపుణ్యాలను, జ్ఞానాన్ని ఇస్తుంది కాబట్టి.

# 15. చిన్న కథలు

## ఎవరు గుడ్డి?

“మన నగరంలో ఎంతమంది గుడ్డివారున్నారు” అని ఒకరోజు అక్బరు దర్బారులో ప్రశ్నించాడు. ఎవరు జవాబు చెప్పలేకపోయారు. అక్బర్ బీర్బల్ వైపు చూశాడు. ఏదో ఒక సమాధానం బీర్బల్ కు చెప్పక తప్పుతుందా!

ఆ మరునాడు బీర్బల్ చక్రవర్తి కోటకు దగ్గరలో జనసంచారం ఎక్కువగా ఉన్నచోట చిన్న చెప్పుల దుకాణం పెట్టి అందులో ఒక చెప్పుల జత కుడుతూ కూర్చున్నాడు. కొద్ది దూరంలో బీర్బల్ నియమించిన పనివారు కాగితం, కలం పట్టుకుని నిలబడి ఉన్నారు.

“ఆయన చేస్తున్న పనిని చూసి చాలామంది బీర్బల్ గారు మీరు ఇక్కడ ఏం చేస్తున్నారు?” అని అడగసాగారు. అలా అడిగిన వారి పేర్లను బీర్బల్ సేవకులు కాగితంలో వ్రాసుకుంటున్నారు.

సాయంకాలం చక్రవర్తి విహారానికి బయలుదేరాడు. బీర్బల్ కూర్చున్న చోటు వైపు వచ్చారు. బీర్బల్ ను చూసి అక్బర్ కూడా అందరిలాగే అదే ప్రశ్న వేశాడు. “చెప్పులు కుడుతున్నాను ప్రభూ” అని బీర్బల్ సమాధానం చెప్తుండగానే, సేవకులు రాస్తున్న జాబితాలో అక్బర్ చక్రవర్తి పేరు కూడా చేరింది .

మరునాడు బీర్బల్ దర్బారులో చక్రవర్తికి.

గుడ్డి వారి జాబితాను సమర్పించాడు. ఆ జాబితా తీసుకుని ఆసక్తిగా పరిశీలించాడు చక్రవర్తి. అందులో చివరన తన పేరు చూడగానే ఉలిక్కిపడ్డాడు.

ఇదేమిటి బీర్బల్? ఇందులో నా పేరు కూడా ఉంది. నేను గుడ్డివాడినా?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు అక్బరు.

బీర్బల్ చేతులు జోడించి "ప్రభువులవారు నన్ను మన్నించాలి. కొందరు పుట్టుకతో గుడ్డివారయితే, మరి కొందరు చూపు ఉండి కూడా గుడ్డివారే. నిన్న నేను చేస్తున్న పని స్పష్టంగా కనబడుతోంది అయినా 'ఏం చేస్తున్నారని'? అందరూ నన్ను ప్రశ్నించారు. చివరకు ప్రభువులవారు కూడా. మరి ఇలాంటి వారు గుడ్డివారే కదా ప్రభూ!" అన్నాడు బీర్బల్.

తను అడిగిన ప్రశ్నకు జవాబు మరొక కోణంలో సరదాగా చూపించిన బీర్బల్ యుక్తికి ముసిముసిగా నవ్వుకున్నాడు అక్బరు చక్రవర్తి.

## నిజమైన మిత్రుడు

స్వర్ణపురంలో నారాయణరెడ్డి, శ్రీనివాస్, చలపతి, రఘుపతి అనే మిత్రులుండేవారు. వారి ముగ్గురిదీ ఒకటే ఊరు. ఒకే స్కూల్లో చదువుకున్నారు. అంచేత వారు చాలా స్నేహంగా ఉండేవారు. నారాయణరెడ్డి పట్నం చేరి వ్యాపారం ప్రారంభించాలనుకున్నాడు. తన ఆలోచన మిత్రులకు చెప్పాడు. ఏ బిజినెస్ లాభసాటిగా ఉంటుందో, ఏ బిజినెస్ ప్రారంభిస్తే మంచిదో వివరించి చెప్పి, తోచిన సలహాలిచ్చి, నీవు వ్యాపారంలో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాము. అన్నారు మిత్రులు. నాకు రావలసిన డబ్బు మొత్తం బ్యాంకు నుండి డ్రా చేసి ఇంట్లో వుంచాను. ఉదయమే పట్నం వెళ్ళి వ్యాపారానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలి అన్నాడు నారాయణరెడ్డి. మిత్రులు కొంతసేపు మాట్లాడి ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళిపోయారు.

ఆ రోజు రాత్రి నారాయణరెడ్డి ఇంట్లో దొంగతనం జరిగింది. దొంగలు సర్వం దోచుకెళ్ళారు. విచారంగా వున్న మిత్రుడ్ని ధైర్యంగా వుండమని చెప్పి ఓదార్చి వెళ్ళిపోయారు మిత్రులుముగ్గురూ! శ్రీనివాస్ మాత్రం ఇంటికెళ్ళి ఐదువందల రూపాయలు డబ్బు తీసుకొని వచ్చి పట్నం వెళ్ళి పోలీస్ రిపోర్టు ఇద్దాం . అవసరానికి ఈ డబ్బు వుంచు అని నారాయణరెడ్డికి ఇవ్వబోయాడు.

డబ్బు తీసుకోవడానికి నారాయణరెడ్డి నిరాకరిస్తే, కష్టంలో వున్నప్పుడు

సహాయపడకుంటే స్నేహానికి అర్థం లేదురా! నీవు కష్టంలో వున్నావని నిన్ను వదిలివెళ్ళే స్వార్థపరుడ్నికాదు అంటూ బలవంతంగా డబ్బు చేతిలో పెట్టాడు శ్రీనివాస్. శ్రీనివాస్ రోజూ మిత్రుని కలిసి ధైర్యం చెప్పేవాడు. డబ్బిచ్చేవాడు. దొంగతనం జరిగినప్పటి నుండి చలపతి, రఘుపతి తప్పించుకుని తిరగసాగారు. ఇల్లు తప్ప అంతా పోగొట్టుకున్నాడు. తమను ఎక్కడ డబ్బు సాయం అడుగుతాడో అని రావడం మానివేశారు. మిత్రులలో వచ్చిన మార్పు చూసిన నారాయణ రెడ్డికి “ఎప్పుడు సంపదే కలిగిన అప్పుడు బంధువులు వత్తురది వెంట్లన్నన తెప్పలుగ చెరువులు నిండిన కప్పలు పదివేలు చేరు సుమతీ” అన్న సుమతీ శతకంలో ఎప్పుడో చదువుకున్న పద్యం గుర్తుకువచ్చింది. ఓ రోజు నారాయణరెడ్డి శ్రీనివాస్‌ను కలిసి శ్రీనివాస్ తనకు ఇచ్చిన డబ్బు వాపసు ఇచ్చి నిన్ను చూస్తుంటే చాలా సంతోషంగా వుందిరా! కష్టాలలో కూడా విడవక నీలా తోడుగా వున్నవాడే నిజమైన మిత్రుడు. చలపతి, రఘుపతి నా దగ్గరకు రావటంలేదు. పట్నంలో నేను ప్రారంభించబోయే వ్యాపారానికి సహాయపడే మిత్రుడు కావాలి. మీలో నిజమైన మిత్రుడెవరో తెలుసుకోవడానికిదొంగతనం జరిగినట్లు నాటకమాడాను. పట్నంలో ప్రారంభించబోయే వ్యాపారానికి నీవు సహాయంగా వుండు. వచ్చిన లాభం సమంగా పంచుకుందాం అన్నాడు.

స్వచ్ఛమైన స్నేహంతో మిత్రులిద్దరూ కలిసి ఫ్రెండ్స్ అండ్ కో అనే పేరుతో వ్యాపారం ప్రారంభించి అనతికాలంలోనే మంచిపేరు డబ్బు సంపాదించారు. కొంత కాలానికి చలపతి, రఘుపతి యిద్దరూ ఉద్యోగాలు దొరక్క, ఉన్న ఆస్తులన్నీ కరిగిపోయి ఉద్యోగాన్వేషణలో పట్నం చేరారు. అక్కడ నారాయణరెడ్డి, శ్రీనివాస్‌లు ప్రారంభించిన ఫ్రెండ్స్ అండ్ కో గురించి గొప్పగా విని ఉద్యోగం కోసం వెళ్ళారు. అక్కడకి వెళ్ళిన తరువాత గాని వాళ్ళకి తెలియలేదు. ఆ కంపెనీ తమ మిత్రుడు నారాయణరెడ్డిదేనని. మిత్రుల పరిస్థితిని అర్థం చేసుకొని పాత విషయాలు మరచిపోయి వారిద్దరికీ ఉద్యోగాలు యిచ్చారు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌లు.

# మేకపోతు గాంభీర్యం

అనగనగా ఒక మేక దాని యజమానికి ఆ మేక అంటే ఎంతో ఇష్టం. ఆ మేకకు కృష్ణుడు అని పేరు పెట్టి ఎంతో ప్రేమగా చూసుకోసాగాడు ఆ యజమాని. ఒక రోజు.... మిగతా మేకలతో కలిసి కృష్ణుడుని కూడా అడవికి మేతకు తీసుకుని వెళ్లాడు. కృష్ణుడు మేకల మందతో కలిసి అడవిలో బాగా ఆడుకుంది. కడుపునిండా గడ్డి, ఆకులు అలములు తిన్నది. ఆ రోజు దానికి చాలా ఆనందంగా ఉంది. ఉరుకులు పరుగులు పెడుతూ అడవి అంతా తిరిగిన ఆ మేకపిల్ల అందరికన్నా ముందు వెళ్లాలన్న ఉత్సాహంతో మందనుంచి తప్పిపోయింది. చాలాసేపు అడవి అంతా తిరిగింది. ఎంతసేపు తిరిగినా అది మేకల మందను చేరుకోలేకపోయింది. అప్పటికే చీకటి పడిపోవడంతో ఇక చేసేదేం లేక ఎటు పోవాలో తెలీక ఒక గుహ కనబడితే ఆ గుహ లోపలికి పోయి పడుకుంది.

కొంతసేపటికి ఏదో అలికిడి వినిపిస్తే కృష్ణుడికి మెలకువ వచ్చి లేచింది. ఆ గుహలో నివాసం ఉంటున్న సింహం దాని వేట ముగించి సుష్టుగా భోజనం చేసినట్టుంది. త్రేంచుకుంటూ వచ్చింది. సింహం గురించి ఇంతకుముందు వినడమే తప్ప కృష్ణుడు దానిని ఎప్పుడూ చూడలేదు. అలాంటిది సింహాన్ని చూడగానే మేకపోతుకు గుండెలు దడదడలాడాయి. కానీ తను భయపడినట్టు కనిపిస్తే సింహం తనను వదిలి పెట్టదు అని కృష్ణుడికి అర్థం అయ్యింది. సింహం కూడా మేకపోతును చూసి భయపడింది. చీకటిలో మేకపోతు కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. పెద్ద గడ్డము, కొమ్ములు, ఉన్న ఆ వింత జంతువును చూడగానే సింహానికి కూడా భయం వేసింది. ఈ వింత జంతువు బహుశా నన్ను చంపడానికే వచ్చినట్టుంది. అందుకే ఇక్కడకు వచ్చి నాకోసం ఎదురు చూస్తోంది అని అనుకుంది.

చీకటిలో తనను చూసి ఏదో వింత జంతువు అని సింహం అనుకుంటుందని అందుకే భయపడిందని మేకపోతుకు అర్థం అయ్యింది. అది అలా తనను చూసి భయపడుతూ ఉండగానే దాన్ని ఇంకా భయపెట్టాలి. ఇక్కడి నుంచి తప్పించుకోవాలి అని మేకపోతు నిర్ణయించుకుంది. కానీ ఈ చీకటిలో ఎలా తప్పించుకోవడం? ఒక వేళ తప్పించుకుని వెళ్ళినా ఈ చీకటిలో ఈ అడవిలో ఎక్కడికని వెళుతుంది? కాబట్టి ఎలాగోఅలా తెల్లవారుఝాముదాకా ఇక్కడే ఉ

ండి ఆ తర్వాత తప్పించుకోవాలి అని అనుకుని మేకపోతు గంభీరంగా అలాగే కూర్చుండిపోయింది. మరోపక్క సింహం కూడా అలాగే అనుకుంది. తెల్లవారితే ఆ వింత జంతువు ఏదో తెలుసుకోవచ్చు. ఒకవేళ అది నాకన్నా బలవంతురాలైతే దానితో స్నేహం చేసుకోవచ్చు. ఒకవేళ ఆ జంతువు తనకన్నా బలహీనురాలైతే దానిని సంహరించవచ్చు ఏదైనా తెల్లారే వరకు ఇలా మౌనంగా ఉండకతప్పదు అని సింహం అనుకుంది.

మేకపోతు, సింహం రెండూ కూడా నిద్రపోకుండా రాత్రంతా ఒకదానినొకటి గమనిస్తూ కూర్చున్నాయి. తెల్లవారుతుండగా మేకపోతు ధైర్యం తెచ్చుకుంది. అప్పుడే సింహాన్ని గమనిస్తున్నట్టుగా "ఏయ్ ఎవరు నువ్వు?" అని గద్దించింది. సింహంకు ఇంకా బెదురుపోలేదు. "నేను సింహాన్ని.... మృగరాజును. నేనే ఈ అడవికి రాజును." అంది భయం భయంగా."నువ్వు ఈ అడవికి రాజువా!? చాలా విచిత్రంగా ఉంది. ఇంత బక్కపలచగా ఉన్నావు. నువ్వు ఈ అడవికి రాజువేంటి? అంటే ఈ అడవిలో మిగతా జంతువులు నీకన్నా బలహీనంగా ఉంటాయన్నమాట. సరే ఏది ఏమైనా నా అదృష్టం పండింది. నేను ఇంతవరకు లెక్కలేనన్ని పులులను, వెయ్యి వరకు ఏనుగులను చంపాను. అది కూడా నా వాడి కొమ్ములతో ఒక్క సింహాన్ని మినహా అన్ని జంతువులను నా కొమ్ములతో ఒక్క కుమ్ము కుమ్మి చంపేసాను. సింహాన్ని కూడా చంపితే నా దీక్ష పూర్తి అవుతుంది. సింహాన్ని చంపేవరకు ఈ గడ్డం తీయనని నేను ప్రతిజ్ఞ పూనాను. నేటితో నా దీక్ష పూర్తి అయినట్టే" అంటూ సింహం మీదకు ఒక్క దూకు దూకింది.

అంతే సింహం పెద్దగా అరుస్తూ ఆ గుహలోంచి బయటకు పరుగు తీసింది. మేకపోతు సూర్యోదయం అయ్యేవరకు ఆ గుహలోనే ఉండి సూర్యోదయం అయ్యాక అడవిలోకి వెళ్ళింది. అప్పటికే దాని యజమాని వెతుక్కుంటూ అటువైపుగా వచ్చాడు. కృష్ణుడు యజమానిని చూసి పరిగెత్తుకుంటూ వెళ్ళాడు. యజమాని దానిని చూసి చాలా సంబరపడ్డాడు. "నువ్వు ఎక్కడికి వెళ్ళిపోయావో అని నేను ఎంత ఖంగారుపడ్డానో తెలుసా? రాత్రంతా ఇంటికి రాకపోతే అడవిలో తప్పిపోయి తిరుగుతున్నావో లేక ఏ జంతువుకైనా ఆహారమయిపోయావో అని భయపడ్డాను. పోన్లే నువ్వు క్షేమంగా ఉన్నావు కదా నాకు అదే చాలు". అని అంటూ కృష్ణుడ్ని దగ్గరకు తీసుకున్నాడు.

# పులి మీసం

ఒక అడవి దగ్గరలో ఒక మహిళ ఉండేది. ఆవిడ పేరు ధర్మావతి. ఆమె వుంటున్న ఊరికి ఒక ఋషి వచ్చాడు. చాలామంది ఋషి వద్దకు వెళ్ళి సలహాలు పొదుతున్నారు. ఈ సంగతి ధర్మావతి కూడా విన్నది. ధర్మావతి కొన్ని కష్టాలు వున్నాయి. ఆ ఋషి దగ్గరకు వెళ్ళి సలహా తీసుకోవాలి. ఆయన దగ్గర కొన్ని శక్తులు కూడా వున్నాయి. పొరుగువారు చెప్పగా విన్నది. కొంత కాలంగా ఆమె భర్తలో ఏదో మార్పు వచ్చింది. ధర్మావతి భర్త యుద్ధంలో పని చేసి వచ్చాడు. మూడు సంవత్సరాలు భార్యకు దూరంగా వున్నాడు. ఆ తరువాత తిరిగి వచ్చాడు ఆమె భర్త. అప్పటి నుండీ అతనిలో ఏదో తేడా వచ్చింది. ఆమెతో సరిగా మాటలాడటంలేదు. భార్యమీద యిది వరకు ప్రేమ చూపడం లేదు. ఇది ధర్మావతిని ఎంతో బాధించింది. తన భర్త ప్రేమ పొదడానికి ఏదైనా చిట్కా కావాలి. అందుకోసం ఆమె ఋషి వద్దకు వచ్చింది. వినయ విధేయతలతో చేతులు జోడించింది. నమస్కారం స్వామీజీ! నా పేరు ధర్మావతి. నాభర్త నాతో ప్రేమగా వుండటంలేదు. నా భర్త నాతో మునుపటిలాగా ప్రేమగా వుండాలి. అందుకు ఏదైనా ఉపాయం చెప్పండి అని వేడుంది. ఋషి ఆలోచించాడు. నీ భర్త యిది వరకులా నీతో ప్రేమగా వుండాలి. నేను ఒక మందు తయారు చేసి యిస్తాను. ఆ మందు అతని చేత తినిపించు. కొద్ది రోజులలో అతను నీకు దగ్గర అవుతాడు. నిన్ను గౌరవంగా చూసుకుంటాడు. నీ మీద ప్రేమను చూపుతాడు. నిన్ను వదిలి వుండలేదు అన్నాడు. ధర్మావతి సంతోషించింది. 'ధన్యవాదాలు స్వామీ' అంది. అయితే ఒక యిబ్బంది వుంది. ఆ మందుకు అన్నీ వున్నాయి. ఒక దినుసు తక్కువ అయింది. మరి ఆ దినుసు నీవు తీసుకు రాగలవా? అన్నారు స్వామీజీ. అలాగే స్వామీ. నా భర్తకోసం ప్రాణాలకు తెగిస్తాను. ఆ దినుసును తెస్తాను అంది. అప్పుడు ఆ ఋషి యిలా అన్నాడు. అది పెద్ద పులి మీసం. అది నువ్వు తీసుకు రాగలిగితే చక్కని మందు తయారవుతుంది. నీ భర్తలో మంచి మార్పు వస్తుంది. అలాగే స్వామీ. మీరు చెప్పిన విధంగానే చేస్తాను. నా ప్రాణాలకు తెగించి అయినా పెద్దపులి మీసం తెస్తాను.

పులి ధర్మావతిని చూస్తూనే గాండ్రించింది. భయంతో గజగజ వణికి

పోయింది ధర్మావతి. అయినా గుండెదిటవు చేసుకొని నిలబడింది. అలా కాసేపు నిలబడి తన యింటికి తిరిగి వెళ్ళింది. మరుసటి రోజు తిరిగి అడవికి వెళ్ళింది. అక్కడ ఇంకోచోట నిలబడింది. పులి మళ్ళీ గట్టిగా గాండ్రించింది. ధర్మావతి అలాగే నిలబడింది. ఇలా కొన్ని రోజులు జరిగాయి. రోజులు గడిచే కొద్దీ ధర్మావతిని చూసి పులి అరవడం మానుకుంది. ఆతర్వాత కొన్ని పిండి వంటలు వండి పులికి పెట్టింది. ధర్మావతి వండిన వంటకాలు రుచి చూసింది పులి. ఆవురు ఆవురు మంటూ తిన్నది. నాలుకతో మూతి తుడుచుకుని అడవిలోకి వెళ్ళిపోయింది. ఇంకొన్ని నాళ్ళకు పులి బాగా అలవాటు అయింది. ఇప్పుడూ ధర్మావతి ముట్టుకున్నా పులి ఏమీ అనడం లేదు. చివరికి ఒక రోజు ఆ పులిని నిమురుతూ వుంది ధర్మావతి. అదను చూసి పులి మీసం పీకింది. పులి మూలిగిందేగానీ ఏమీ అనలేదు. ధర్మావతి పర్గుపరుగున వచ్చింది. పులి మీసం తీసుకొని ముని వద్దకు వచ్చింది. స్వామీ ఎంతో శ్రమ పడి పులి మీసం స్మపాదించాను తీసుకోండి అన్నది ధర్మావతి. ఋషి ఆమె యిచ్చిన పులి మీసాన్ని అందుకుని మంటలో పడవేశాడు. ధర్మావతి ఆశ్చర్యపోయింద్ది. అయ్యో స్వామీ! యిలా చేశారేంటి? అని తెగ గాధపడింది. అప్పుడు ఋషి యిలా అన్నాడు. అమ్మా ధర్మావతీ నీకు ఏ మందుతోనూ పనిలేదు. నువ్వు నాకు ఒక సంగతి చెప్పు. పులిని నువ్వు ఎలా లొంగదీసుకున్నావు? ప్రేమ, ఆప్యాయతలతో! అవునా? ఎంతో కరమైన జంతువునే లొంగదీసుకున్నావు. అంతటి ఓర్పుగల నీవు నీ భర్తను లొంగదీసు కోలేవా? ఇదే ప్రేమ, అనురాగం నీ భర్తపై చూపించు. సహనంతో అతనిని నీ వైపుకు మళ్ళించుకో. నీ ప్రేమను పంచి, అతని ప్రేమను పొందు. అని చెప్పాడు ఋషి. ధర్మావతికి కళ్ళు తెరచుకున్నాయి. ధైర్యంగా యింటికి వెళ్ళింది. భర్తలో మార్పు తెచ్చింది. అతని నుండి వెనకటి ప్రేమను పొందింది.

## ఆటో డ్రైవర్ నిజాయితీ

ఏలూరు పట్టణములో నరేష్ అనే అతడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి తల్లి, తండ్రి, భార్య, ఒక కుమార్తె ఉన్నారు. సంపాదన చాలక అవస్థలు పడుతుండేవారు. తల్లికి అనారోగ్యంగా ఉండేది, తండ్రి సంపాదన

అంతంతమాత్రమే. అయినా నీతి తప్పక వచ్చే సంపాదనతో తృప్తిగా జీవిస్తున్నారు. ఒక రోజున ఇద్దరు దంపతులు అతని ఆటోలో అశోక్‌నగర్‌కి స్టేషన్ నుండి ఎక్కారు. వారు ధనవంతులు. నగలు గల బ్యాగ్ ఆటో వెనుక భాగములో పెట్టి దిగిపోయారు. ఇంటికి వచ్చి భోజనము చేస్తుండగా కూతురు ఆటో ఎక్కి ఆడుకుంటూ ఆ బ్యాగ్‌ను చూసి ఇంటిలోకి తెచ్చింది. బ్యాగ్‌లో తినే ఆహారపదార్థములేమైనా వున్నాయేమో అని జిప్ వూడదీసి చూస్తే దాంట్లో బంగారు ఆభరణాలు, డబ్బు వున్నాయి. వెంటనే తల్లిదండ్రులకి చెప్పింది.

నరేష్ వెంటనే భోజనము ముగించుకొని పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి బ్యాగ్ విషయము చెప్పి, వారి ఇంటి గుర్తులు చెప్పాడు. పోలీస్ వారితో కలిసి ఆ ఇంటికి వెళ్ళి విషయము చెప్పగా, వారు బ్యాగ్ తమదేనని ప్రయాణ బడలికలో గమనించలేదని చెప్పి, ఆటో డ్రైవర్ నిజాయితీకి సంతసించి పదివేల రూపాయలు ఇచ్చి, తమ పిల్లల్ని రోజూ ఆటోలో స్కూల్‌కి తీసుకొని వెళితే నెలకు 500 రూపాయలు ఇస్తామని చెప్పారు. ఆ విధంగా చేసి తన సంపాదన పెంచుకున్నాడు. అంతేగాక ఆ వీధిలోని పిల్లల్ని తీసుకెళ్ళి తన సంపాదన పెంచుకొని తన తల్లి ఆరోగ్యము బాగు చేయించుకొని సుఖముగా ఉన్నాడు.

## తలపాగా ఖరీదు?

ఒకరోజు నస్రుద్దీన్ ఒక కొత్త తలపాగా తీసుకుని రాజు దగ్గరికి వచ్చాడు. "రాజా ఈ తలపాగా మీరు కొంటారని తీసుకువచ్చాను" అన్నాడు.

"అలాగా! దీని ఖరీదు ఎంత?" అన్నాడు రాజు.

"వెయ్యి వరహాలు రాజా" అన్నాడు నస్రు. ఇంతలో రాజు పక్కనే ఉన్న మంత్రి ఒకరు "రాజా! ఈ నస్రుద్దీన్ మిమ్మల్ని మోసం చేయాలని చూస్తున్నాడు. ఈ తలపాగా అంత ఖరీదు చెయ్యదు." అని చెవిలో చెప్పాడు.

మంత్రి చెప్పింది నిజమే అనిపించింది రాజుకి. అయినా తలపాగా నచ్చడంతో, "నస్రుద్దీన్! ఈ తలపాగాకి అంత విలువ లేనట్టుందే. ఎందుకంత ధర?" అని అడిగాడు.

"రాజా! దీన్ని చూడగానే ఇది అత్యంత గొప్పవాళ్ల తలపైనే ఉండే తలపాగా

అనిపించింది. అంత గొప్పవాళ్లు ఎవరా అని ఆలోచిస్తే నాకు మీరు తప్ప మరెవరూ లేరనిపించింది. అందుకే బేరం కూడా చేయకుండా వెయ్యి వరహాలు పెట్టి కొన్నాను రాజా!" అన్నాడు నస్రు.

నస్రు మాటలకి రాజు పొంగిపోయాడు. వెంటనే వెయ్యి వరహాలిప్పించి, ఆ తలపాగా తీసుకున్నాడు.

వరహాలు తీసుకుని వెళ్తున్న నస్రుకి బయట మంత్రి కనిపించాడు. అతని దగ్గరకి వెళ్లి, మంత్రిగారూ! మీకు తలపాగా గొప్పదనం తెలుసు, కాని నాకు రాజుగారి బలహీనత తెలుసు" అని నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

## వింత పరిష్కారం

శ్రీకృష్ణదేవరాయలు అయిదు వందల ఏళ్ల క్రితం మన దక్షిణ భారతాన్ని పరిపాలించిన చక్రవర్తి. ఈయన యుద్ధాలలో ఎంత నిపుణుడో, కావ్య రచనలో అంత నేర్పరి. ఈయనకు "సాహితీ సమరాంగణ చక్రవర్తి" అనే బిరుదు ఉండేది. అముక్తమాల్యద, రాయలు రచించిన గొప్ప కావ్యం. రాయల దగ్గర ఎనిమిది మంది గొప్ప కవులుండేవారు. వారిని 'అష్టదిగ్గజాలు' అని పిలిచేవారు. అల్లసాని పెద్దన, ముక్కుతిమ్మన, రామభద్రుడు, ధూర్జటి, భట్టుమూర్తి, పింగళి సూరన, మాదయగారి మల్లన, తెనాలి రామకృష్ణుడు రాయల అస్థానకవి దిగ్గజాలు. ఆయన సభకు "భువన విజయం" అని పేరు.

ఒకసారి రాయల దగ్గరకు ఒక మహా పండితుడు వచ్చాడు. అతడు అనేక భాషల్లో అనర్గళంగా మాట్లాడుతున్నాడు. ఇంతకీ సమస్య ఏమిటంటే రాయల సభలోని కవి పండితుల్లో ఎవరైనా అతని మాతృభాషను కనిపెట్టాలి. రాయలవారు తన కవిదిగ్గజాలను ఈ సమస్య విడగొట్టమని కోరాడు.

మొదట 'ఆంధ్రకవితాపితామహుడని పేరు పొందిన పెద్దన కవి లేచి, తనకు వచ్చిన భాషలలో అతనితో సంభాషించి, వాదించి కూడా, అతని భాష తేల్చుకోలేక పోయాడు. తరువాత ఆరుగురూ అంతే. చివరికి తెనాలి రామకృష్ణుని వంతు వచ్చింది. ధారాళంగా భాషలన్నీ వల్లె వేస్తున్న ఆ పండితుని దగ్గరకు వెళ్ళాడు. ఎంతో సేపు అతనికి ఎదురుగా నిలబడి ఏమీ అడగలేక పోయాడు.

ఓటమి తప్పదని రాయలు భావించాడు. ఆ ఉద్ధండ పండితుడు కూడా ఉప్పొంగిపోతున్నాడు. ఇంతలో అకస్మాత్తుగా తెనాలి కవి ఆ పండితుని కాలును గట్టిగా తొక్కాడు. ఆ బాధ భరించలేక పండితుడు 'అమ్మా' అన్నాడు. అంతే! "నీ మాతృభాష తెలుగు పండితోత్తమా!" అని తేల్చేశాడు తెనాలి రామకృష్ణుడు. పండితుడు ఒప్పుకోక తప్పలేదు. రాయల ఆనందానికి అంతులేదు. శభాష్! వికటకవీ అని రామకృష్ణుని మెచ్చుకొని బహుమానంగా సువర్ణహారం ఇచ్చాడు.

మాతృభాష గొప్పతనం అదే. ఆనందంలో కాని విషాదంలో కాని మన నోటి నుండి వెలువడేది మన మాతృభాషే. కన్నతల్లిలా, మాతృభూమిలా, మాతృభాష మధురమైనది, మరపురానిది.

## రూపాయల పళ్ళెం

ఒకరోజు దర్బారులో అతిముఖ్యమైన పనులు ఏమీ లేకపోవడంతో అక్బర్ చక్రవర్తి చాలా కులాసాగా ఉన్నాడు. ఎవరూ చడీచప్పుడూ చేయకుండా అక్బరు ఏదైన మాట్లాడితే జవాబు ఇవ్వాలనుకుని ఆయన వైపు చూస్తూ కూర్చున్నారు. అక్బరుకు ఆరోజు, సభ చాలా చప్పగా జీవం లేనట్లు అనిపించింది. అందుకే ఆయన కొంచెం సేపు ఆలోచించి, భటుల చేత ఒక తివాచీ, ఒక రూపాయల పళ్ళెం తెప్పించాడు. ఒక ప్రక్క రూపాయల పళ్ళెం ఉంచి దాని ముందు తివాచీ పరచమని ఆజ్ఞాపించాడు. తరువాత అందరినీ కలియజూస్తూ ఈ రూపాయల పళ్ళెం మీ కోసమే తెప్పించాను. ఐతే ఎవరు తెలివిగా, యుక్తిగా ఆలోచించగలరో వారికి ఈ పళ్ళెం బహుమానంగా దొరుకుతుంది. ఈ తివాచీని తొక్కకుండ, అటు ప్రక్కలకి వెల్లకుండా ఆ పళ్ళెంని తెచ్చుకొండి. మీరు వెళ్ళాల్సిన దారి తివాచీ పరచిన వైపే" అని చెప్పాడు.

'ఎటూ వెళ్ళకూడదట. తివాచీని తొక్కకుండా దాటాలిట. ఇది సాధ్యం అయ్యే పనేనా?' అన్న సందేహంతో ఎవరూ ముందుకు రాలేదు.

"ఏం బీర్బల్ నీకు కూడా ఈ పని సాధ్యం కాదా?" నవ్వుతూ ప్రశ్నించాడు అక్బరు.

"ఎందుకు కాదు ప్రభూ! ఇక్కడున్న వారికి అవకాశం ఇవ్వాలని ఆగాను.

వెంటనే ఆ పని చేస్తే ఎవరికో వచ్చే బహుమతి నేను కొట్టేసినట్టవుతుంది. ఇప్పుడు మీరు ఆజ్ఞ ఇస్తే వెళ్ళి తెచ్చుకుంటాను" అని అన్నాడు వినయంగా బీర్బలు.

"ఆలస్యం ఎందుకు? వెళ్ళితీసుకో"అనుమతి ఇచ్చాడు అక్బర్. బీర్బల్ వెంటనే తివాచీని చుట్టుకుంటూ వెళ్ళి, రుపాయలపళ్ళెం తీసుకున్నాడు. తిరిగి తివాచీని పరుచుకుంటూ వెనక్కివచ్చాడు. బీర్బల్ యుక్తిని అక్బరు చక్రవర్తే కాదు,ఆయనంటే ఆసూయపడే రాజోద్యోగులు కూడ మెచ్చుకున్నారు.

## కాగితం పడవలు

రామయ్యది వెంకటాపురం. భూస్వామి భూపతి దగ్గర పాలేరుగా పని చేస్తున్నాడు. మంచి పనిమంతుడు. నమ్మకస్తుడు. అందుకే అతనంటే భూపతికి ప్రత్యేకమైన అభిమానం.

నమ్మకంగా వుంటూ, ఇంటిని, పిల్లల్ని జాగ్రత్తగా చూసుకునే మనిషి వుంటే పంపించమని పట్నంలో వ్యాపారం చేస్తున్న భూపతి కొడుకు మహేష్ ఉత్తరం రాశాడు. ఆ పనికి రామయ్యే సరైనవాడని భూపతికి తెలుసు. అదే మాట రామయ్యతో అన్నాడు. ముందూ వెనుక ఎవరూ లేకపోవడంతో రామయ్య కూడా అంగీకరించాడు. అలా రామయ్య వెంకటాపురం వదిలి హైదరాబాద్‌లో అడుగుపెట్టాడు. ప్రశాంతమైన పల్లె వాతావరణానికి అలవాటుపడిన రామయ్యకు రణగొణ ధ్వనుల మధ్య జీవించడం కొంచెం కష్టంగానే ఉంది. అయినా అలాగే సర్దుకుపోతున్నాడు.

భూపతి కొడుకు రాహుల్, కోడలు రమ్య, వాళ్లిద్దరూ వారి వారి పనుల్లో బిజీగా ఉంటారు. పిల్లలు వంశీ, వసుధ. వంశీ ఆరవ తరగతి చదువుతున్నాడు. వసుధ నాలుగవ తరగతి. పొద్దున్నే తొమ్మిది గంటలకల్లా ఎటు వాళ్లు అటు వెళ్లిపోతారు.

రమ్యకు ఇంటి పనుల్లో సాయం చేయడం, బజారుకెళ్లి కావాల్సిన సరుకులు తీసుకురావడం, పిల్లలకు కావాల్సినవి అమర్చడం, ఇంటిని కనిపెట్టుకొని వుండడం.. ఇది రామయ్య దినచర్య. రామయ్యకు వెంకటాపురంలోకంటే ఇక్కడే

పని తక్కువగా ఉంది. కాకపోతే ఒక్కటే చిక్కు. కాయకష్టానికి అలవాటుపడిన మనిషిని ఖాళీగా వుండమంటే ఉండలేడు. ఇప్పుడు రామయ్య పరిస్థితీ అదే.

ఓ రోజు ఏ కారణం చేతనో ట్యూషన్ మాష్టారు రాలేదు. పిల్లలకు కావాల్సినంత తీరుబడి దొరికింది. ఆ బజారులోని తోటి పిల్లలందర్నీ పోగు చేశారు. వాళ్లతో ఇంట్లోనే ఆటలు మొదలుపెట్టారు. రామయ్య కూడా వాళ్లతో కలిసిపోయాడు. కాసేపటికి వర్షం మొదలయ్యింది. డాబా మీద కురిసిన వాన నీళ్లు కాలువలా పెరట్లో నుండి పోతున్నాయి. రామయ్యకు ఓ ఆలోచన వచ్చింది.

"వంశీ బాబూ! నీకి కాగితాలతో పడవలు తయారుచేయడం వచ్చా?" అడిగాడు రామయ్య .

"రాదు. ఏం?"

"మేం చిన్నప్పుడు కాగితాలతో పడవలు తయారుచేసి వాన నీళ్లల్లో వదిలేవాళ్లం. మునగకుండా ఎవరి పడవ ఎక్కువ దూరం వెళ్తుందో వాళ్లు గెలిచినట్టు. ఆ ఆట భలే సరదాగా ఉంటుంది" చెప్పాడు రామయ్య.

"అయితే త్వరగా వెళ్లి కాగితాలు తీసుకురా తాతా..." అంది వసుధ.

"కాగితాలు నాన్నగారి గదిలో ఉంటాయి" వెంటనే అందుకున్నాడు వంశీ.

రామయ్య రాహుల్ గదిలోకి వెళ్లాడు. అక్కడ తెల్ల కాగితాలు, రాసిన కాగితాలు విడివిడిగా ఉన్నాయి. తెల్ల కాగితాలైతే రాసుకోవచ్చు. అదే వాడిన కాగితాలు తీసుకున్నా ఫర్వాలేదు ' అనుకున్నాడు రామయ్య రాసిన కాగితాలు తీసుకొని పిల్లల దగ్గరకొచ్చాడు. వాటితో పడవలు తయారుచేసి, పిల్లలకిచ్చాడు. వాళ్లు వాటిని నీళ్లల్లో వదులుతూ ఆనందించారు. కాసేపటి తర్వాత వర్షం ఆగిపోయింది. ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. పిల్లలు అన్నం తిని, నిద్రపోయారు. రాత్రి తొమ్మిది గంటలకు భార్యాభర్తలిద్దరూ ఇంటికొచ్చారు. వచ్చీరాగానే రాహుల్ తన గదిలోకి వెళ్లాడు. ఏవో ముఖ్యమైన కాగితాల కోసం చాలాసేపు వెతికాడు. ఎంత వెతికినా అవి కనిపించలేదు.

రామయ్యను పిలిచి, "టేబుల్ మీద నేను కొన్ని ముఖ్యమైన కాగితాలు పెట్టాను. అవేమైనా చూశావా?" అని అడిగాడు రాహుల్.

"నల్ల సిరాతో ఏదో రాసి ఉంది. అవేనా బాబుగారూ?" అడిగాడు రామయ్య.

"అవును. అవే...ఎక్కడ పెట్టావు?" ఆత్రుతగా అడిగాడు రాహుల్.

“అవి పనికిరాని కాగితాలు అనుకొని...”

“అనుకొని... నీళ్లు నమలడం మాని ఏం చేశావో చెప్పు” కోపంగా అన్నాడు రాహుల్.

“ఇందాక పిల్లలకు పడవలు చేసిచ్చాను” భయం భయంగా చెప్పాడు రామయ్య.

“అసలు వాటి జోలికెందుకువెళ్లావు? పక్కన అన్ని తెల్లకాగితాలు ఉన్నాయి. అవి తీసుకోవచ్చుగా. అయినా పాత న్యూస్ పేపర్లతో పడవలు చెయ్యొచ్చు కదా. అసలు ఆ పేపర్ల విలువేంటో తెలుసా నీకు?” ఆవేశంగా అన్నాడు రాహుల్.

రామయ్య దిగాలుగా ముఖం పెట్టి. “అయ్యా! నాకు చదువురాదు. అందుకే వాటి మీద ఏం రాసి వుందో తెలీలేదు. తెలిస్తే... వాటితో పడవలు చేసేవాణ్ణే కాదు. క్షమించండి” అన్నాడు.

“ఎలా క్షమించమంటావు? అవేమైనా పాతిక రూపాయలు పెడ్తే వచ్చే కాగితాలనుకున్నావా? కొత్తగా తీసుకున్న ఉద్యోగులతో కుదుర్చుకున్న ఒప్పందం కాగితాలు” అరిచాడు రాహుల్. రాహుల్ అరుపుల విన్న రమ్య ఆ గదిలోకి వచ్చింది.

విషయాన్ని గ్రహించి, “ఊరుకో రాహుల్. అంత ముఖ్యమైన కాగితాలను నిర్లక్ష్యంగా టేబుల్ మీద పడేసి వెళ్లిపోవడం నీ తప్పు. అవి మామూలు కాగితాలు అనుకొని రామయ్య పడవలు చేసి ఉంటాడు. జరిగిందేదో జరిగిపోయింది. మళ్లీ వాళ్లతో అగ్రిమెంట్ రాయించుకుంటే సరిపోతుంది” అంటూ సర్దిచెప్పింది.

రామయ్యవైపు తిరిగి, “రామయ్య... నువ్వు వెళ్లి భోం చేసి పడుకో” అని చెప్పింది. రామయ్య అక్కడి నుండి వెళ్లిపోయాడు.

మర్నాడు ఆఫీస్ నుండి వచ్చేటప్పుడు రామయ్య కోసం ఓ ప్యాకెట్ తీసుకొచ్చింది రమ్య. అందులో కొన్ని పుస్తకాలు ఉన్నాయి. వాటిని అయోమయంగా చూశాడు రామయ్య.

“ఇవి నీ కోసమే రామయ్య రేపటి నుండి నువ్వు కూడా చదువుకోవాలి. పిల్లలతోపాటు నీక్కూడా ట్యూషన్ మాష్టారే చదువు చెప్తారు. మరి శ్రద్ధగా చదువుకుంటావు కదూ” అంది రమ్య.

రామయ్య కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తాను చేసిన తప్పు గుర్తొచ్చింది. ఇకమీదట

అలాంటి తప్పు చేయకుండా వుండాలంటే చదువుకోవడం ఒక్కటే మార్గమని నిర్ణయించుకున్నాడు.

## రాజగురువు తెలివి

ఒకప్పుడు విజయభట్ అనే రాజగురువు వుండేవాడు. ఆ ఆస్థానంలో పన్నెండు అగ్రహారాలు వుండేవి. అందులో సురేంద్రనగర్ అగ్రహారంలో భట్ నివసించేవాడు. ఆస్థానమంతా అర్జున్ సింగ్, సాబర్ సింగ్, అనబడే అన్నదమ్ముల ఆధీనంలో వుండేది. ఇందులో అర్జున్ సింగ్ యోగ్యుడు, బుద్ధిమంతుడు, ఈ విషయం రాజగురువు భట్‌కు బాగా తెలుసు. కొన్నాళ్ళకు ఆ అన్నదమ్ములు విడిపోవాలని నిశ్చయించుకొన్నారు. అయితే సురేంద్రనగర్ అగ్రహారం కోసం ఇద్దరూ వాదులాడుకోవడం ప్రారంభించారు. ఈ విషయం రాజగురువుదాకా వెళ్ళింది. ఆయన ఆ అన్నదమ్ముల వద్దకు వచ్చాడు. వారు గురువును చూచి ఎంతో గౌరవంగా పిలిచారు. తమ సమస్యను తీర్చ వలసిందిగా కోరారు. అప్పుడు రాజగురువు వారికొౌక కథ చెప్పాడు.

పూర్వము ఒకప్పుడు ఒక మహర్షి వుండేవాడు. ఆయనవద్ద ఇద్దరు శిష్యులు ఉండేవారు. విధ్యాభాసం పూర్తయ్యాక వారు గురువును సెలవు కోరారు. అప్పుడు గురువు ఇద్దరికీ పిడికెడు విభూతి ఇచ్చి వెళ్ళి సుఖంగా వుండమని దీవించాడు. అందులో ఒకడు విభూతిని ఎంతో భక్తితో స్వీకరించి తినివేశాడు. మరొకడు చిన్నచూపుతో దాన్ని పారవేశాడు. విభూతిని స్వీకరించినవాడికి సకల విధ్యలు అబ్బినాయి. అన్ని వేళలలో నిష్ణాతుడయ్యాడు. రెండవ వాడు మాత్రం మందబుద్దితో తిరిగి వచ్చి గురువును తూలనాడాడు. రాజగురువు పై కథ చెప్పి నా తీర్పువిన్నాక రెండవ శిష్యునివలే తనను నిదించకూడదని అన్నాడు. అందుకు వారు అంగీకరించారు. సమస్యను రేపు పరిష్కరిస్తానని రాజగురువు వెళ్ళిపోయాడు. ఆ రోజు రాత్రి కథలో మొదటి శిష్యుడు చేసినట్లు చేయవలసిందిగా అర్జున్ కు రాజగురువు రహస్యంగా వర్తమానం పంపాడు. సురేంద్రనగర్ అర్జున్ సింగ్ ఆధీనంలోకి రావాలన్నదే రాజగురువు ఆశ కూడ.

మరుసటి నాడు రాజ గురువు రెండు చీటీలను ఉండలుగా చుట్టి అర్జున్

సింగ్ ను సాబల్ సింగ్ ను ఇష్టానుసారం తీసుకోమని చెప్పాడు. అర్జున్ సింగ్ చీటీ తీసుకొని మ్రింగివేసాడు, సాబల్ సింగ్ చీటీ చూచుకొన్నాడు. అందులో "సురేంద్ర నగర్ మీదికాదు" అని రాసి వుంది. మాట ప్రకారం సాబల్ సింగ్ సురేంద్ర నగరను అర్జున్ సింగ్ కు వదిలి పెట్టాడు. అయితే రాజగురువు రెండు చీటీలనూ ఒకే విధంగా అంటే "సురేంద్ర నగర్ మీదికాదు" అని రాసినట్లు తెలియదు. ఎంతో తెలివిగా ఆయన సురేంద్రనగర్ ను బుద్ధిమంతుడైన అర్జున్ సింగ్ కు వచ్చేలా చూశాడు.

## అజ్ఞానం

మౌల్వీ నజీరుద్దీన్ చాలా గ్రంథాలు చదివి అపార జ్ఞానం సంపాదించాడు. కానీ అసలు జ్ఞానం కావాలంటే అది జీవితం నుండే నేర్చుకోవాలన్నది అతని ఉద్దేశ్యం. అందుకే ప్రజలను కలుసుకునే వీలుండే పనేదైనా చేస్తే జీవిత సత్యాలు తెలుస్తాయని, అన్వేషణ ఆరంభించాడు.

నజీరుద్దీన్‌కి ఈత బాగా తెలుసు. అందువల్ల పడవ నడిపే పని బావుంటుందని, దానిలో చేరాడు. రోజూ నదికి అటూ ఇటూ మనుషుల్ని పడవపై చేరవేయడం అతని పని.

ఒకరోజు అతని పడవలో ఒక ముసలి గురువు ఎక్కాడు. ప్రయాణిస్తుండగా మాటా మాటా కలిసి, ఆ గురువు ఒక మహా పండితుడని తెలిసింది. మౌల్వీ నజీరుద్దీన్ తన పేరు చెప్పకుండా, తన గురించి తెలియనివ్వకుండా ఉన్నాడు.

కొద్దిసేపటికి వర్షం ప్రారంభమైంది. "నీకు వర్షం ఎలా కురుస్తుందో తెలుసా?" అని అడిగాడు గురువు.

"నాకు తెలియదు " అన్నాడు నజీరుద్దీన్.

"వర్షం ఎలా కురుస్తుందో తెలియకపోతే నీ సగం జీవితం వ్యర్థం" అన్నాడు గురువు ఎగతాళిగా.

"అవునా గురువుగారూ? మరెలా?" అని అడిగాడు అమాయకంగా.

"ఇంకేముంది? నువ్వు సగం చచ్చినవాడితో సమానం" అన్నాడు గురువు. ఇంతలో వర్షం ఎక్కువైంది. పడవలోకి నీళ్లు చేరుతున్నాయి. అలలు పెద్దవై

పడవ అటూ ఇటూ ఊగడం మొదలెట్టింది.

"గురువుగారూ! మీకు ఈత వచ్చా?" అని అడిగాడు నజీరుద్దీన్. అప్పటికే భయం భయంగా వణుకుతున్న గురువు "రాదు" అన్నాడు.

"అయితే మీ పూర్తి జీవితం వ్యర్థం " అని నజీరుద్దీన్ పడవలో నుండి నీటిలోకి దూకి, ఈదుకుంటూ వెళ్లిపోయాడు.

## పరమానందయ్య శిష్యులు

పరమానందయ్యగారికి పన్నెండు మంది శిష్యులు. వాళ్ళు ఒకరోజు కట్టెలకోసం అడవికి వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో వాళ్ళు ఒక వాగును దాట వలసి వచ్చింది.

"అమ్మో! వాగులో మునిగి పోతామేమో" అంటూ భయపడ్డారు. "మనం ఒకరి చేయి ఒకరం పట్టుకొని వాగు దాటుదాం" అన్నాడు ఒకడు. "సరే" అన్నాడు మరొకడు. అలాగే వారు వాగును దాటారు. శిష్యుల్లో ఒకరికి "అందరం వాగుదాటామా?" అనే అనుమానం వచ్చింది. "ఒరేయ్! మీరంతా వరుసలో నిలబడండి. నేను లెక్కపెడతాను" అన్నాడు. అందరూ వరుసలో నిలబడ్డారు.

"ఒకటి, రెండు, మూడు..... పదకొండు. ఒరేయ్ పదకొండు మందిమే ఉన్నాం! ఒకడు వాగులో మునిగిపోయాడు" అన్నాడు. శిష్యులందరూ ఒకరి తరువాత ఒకరు లెక్కబెట్టారు. ఎన్నిసార్లు లెక్కబెట్టినా సంఖ్య పదకొండే వచ్చింది.

"మనలో ఒకరు వాగులో మునిగిపోయారు" అంటూ అందరూ భోరుభోరున ఏడుస్తూ, గురువు గారి దగ్గరకు వెళ్ళారు. జరిగిన విషయం చెప్పి మళ్ళీ భోరున విలపించారు.

గురువుగారు అందరినీ తేరిపార చూశారు. శిష్యులను మళ్ళీ లెక్కపెట్టమన్నారు. ఒకడు లెక్కబెట్టాడు. మళ్ళీ పదకొండే వచ్చింది. గురువుగారు శిష్యులూ చేసిన తప్పును గుర్తించారు. వారందరినీ వరుసలో నిలబెట్టి స్వయంగా లెక్కబెట్టారు. శిష్యులు తమ పొరపాటు తెలుసుకొని నవ్వారు.

# గొప్ప గుణం

మొగసాల మర్రి గ్రామంలో ధర్మయ్య, రంగయ్య అనే ఇద్దరు వడ్డీ వ్యాపారం చేస్తూ జీవించేవారు. వారిలో ధర్మయ్య తక్కువ వడ్డీ తీసుకొని అడిగిన వారికి లేదనక అప్పులిచ్చి అవసరాలలో ఆదుకొంటుండేవాడు. ఎవరైనా ఇచ్చిన అప్పును సకాలంలో తీర్చకపోతే పీడించేవాడుకాదు. అందువల్ల ఆ ఊరి ప్రజలకు ధర్మయ్య అంటే చాలా ఇష్టం. కాని రంగయ్య మాత్రం పరమలోభి. అధిక వడ్డీలు గుంజి లక్షలకు లక్షలు సంపాదించాలని కలలు కనేవాడు. అప్పులు తీర్చకపోతే వారు తాకట్టు పెట్టిన భూములు, నగలను, ఇండ్లను తిరిగి ఇవ్వక వారికి నిలువ నీడ లేకుండా చేస్తాడు. ఆ ఊరి ప్రజలు అతనిని లోభి అని, చండాలుడని చెప్పుకొనేవారు. ప్రజల్లో ధర్మయ్యకున్న గొప్ప పేరును చూసి రంగయ్య అసూయపడేవాడు. ఎలాగైనా ధర్మయ్యను దెబ్బ తీయాలని అనుకున్నాడు. ఆ ఊరివారందరూ కలిసి ఒక రామాలయం కట్టించారు. ఆ ఊరి జమిందారు ఇచ్చిన విరాళంతో నగలను చేయించారు. ఆ గుడి తాళాలను నిజాయితీ పరుడైన ధర్మయ్యకే అప్పగించారు. అది చూసి ఓర్వలేని రంగయ్య మండిపడ్డాడు. అతను బాగా ఆలోచించి ఒక పథకం వేశాడు. ధర్మయ్య ఇంట్లో పనిచేసే రాజయ్యను రహస్యంగా కలిసాడు. ఎలాగైనా గుడి తాళాలను తెచ్చి ఇస్తే పెద్ద మొత్తంలో డబ్బు ఇస్తానని ఆశ చూపాడు. మొదట్లో రాజయ్య దానికి ఒప్పుకోలేదు. కాని కుటుంబ అవసరాల వల్ల అతను ఆ పనికి ఒప్పుకున్నాడు. ధర్మయ్య గుడి తాళాలను పెట్టెలో పెట్టి భద్రంగా వుంచాడు. రాజయ్య మాత్రం దానిని జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

ఒక రోజు ధర్మయ్య భార్య నగల కోసం పెట్టె తెరచి మరలా దానికి తాళం వేయడం మరచి లోనికి వెళ్ళిపోయింది. అదే అదనుగా భావించి చాటున ఉన్న రాజయ్య ఆ పెట్టెను తెరచి గుడి తాళాలను తీసుకొని అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. తర్వాత ఆ గుడి తాళాలను రంగయ్య చేతికిచ్చాడు. ఒకరోజు రాత్రి రంగయ్య ఊరంతా గాఢ నిద్రలో ఉండగ గుడి తలుపులు తెరచి గర్భ గుడిలోనికి వెళ్ళాడు. అక్కడ దేవతలకు అలంకరించిన నగలను తీసి ఒక సంచిలో వేసుకొని అక్కడ నుంచి మెల్లగా జారుకున్నాడు. మరుసటి రోజు దేవుని నగలు దొంగిలించారన్న

వార్త ఊరంతా పాకిపోయింది. గుడి తాళాలు ధర్మయ్య వద్ద ఉండగా దొంగతనం ఎలా జరిగిందోనని కొందరి మాటల్లో వినిపిస్తుంది. గ్రామ పెద్ద భీమన్న ఈ విషయాన్ని గూర్చి రచ్చబండ దగ్గర పంచాయితీ నిర్వహించారు. ఊరివారందరితో పాటు ధర్మయ్య, రంగయ్యలు కూడా అక్కడికి చేరుకున్నారు. అప్పుడు గ్రామ పెద్ద భీమన్న, ధర్మయ్యా! తాళాలు నీవద్ద ఉన్నాయి. మరీ దొంగతనం ఎలా జరిగింది? దీనికి నీ సంజాయిషీ ఏమిటీ? అని ప్రశ్నించాడు. ధర్మయ్య గ్రామ పెద్ద వంక చూసి "అయ్యా! గుడి తాళాలను పెట్టెలో భద్రంగా ఉంచాను. రెండు రోజులుగా అవి కనిపించలేదు. ఎంత వెతికినా వాటి ఆచూకీ తెలియలేదు" అని బదులిచ్చాడు. "ఈ ధర్మయ్య మోసకారి, తానే నగలు కాజేసి ఏమి తెలియదన్నట్లు నటిస్తునాడు. తగిన శిక్ష వేసి చెరసాలలో వేయించండని రంగయ్య చెప్పాడు.

గ్రామ పెద్ద భీమన్నకు రంగయ్య మాటలపై నమ్మకం కలుగలేదు. ధర్మయ్య నిజాయితీ పరుడని నమ్ముతున్నాడు. ఇందులో ఏదో మోసం జరిగింది. అది తెలుసుకోవాలనుకున్నాడు. ఒకరోజు గ్రామ పెద్ద ధర్మయ్య ఇంట్లో పని వారందరిని పిలిపించాడు. వారికి తలోక ఉంగరాన్ని ఇచ్చి ఇవి మహిమ కలవని, ఒక మునీశ్వరుని వద్ద నుండి సంపాదించానని చెప్పాడు. దొంగతనం చేయని వారి ఉంగరం ధగ ధగ మెరుస్తుందని నమ్మబలికాడు. వాటిని మరుసటి రోజు తిరిగి ఇవ్వమని చెప్పి వారిని పంపించాడు. రాజయ్య తాను తాళాలు దొంగిలించిన విషయం బయటకు తెలియకుండా తనకు తెలిసిన కంసాలి వద్ద ఉంగరాన్ని మెరుగు పట్టించాడు. మరుసటి రోజు వారు ఆ ఉంగరాలను భీమన్నకు అందజేసారు. భీమన్న ఆ ఉంగరాలను పరిశీలించి రాజయ్య ఉంగరం మెరుస్తుండడం గమనించాడు. అయనకు దొంగ ఎవరో తెలిసిపోయింది. వెంటనే "రాజయ్య నిజం చెప్పు? నగలను ఎక్కడ దాచావ్? అంటూ గద్దించాడు. అది విని రాజయ్య గజగజ వణికిపోయాడు. అయ్యా! నగలను గూర్చి నాకేం తెలియదు. బుద్ధి గడ్డి తిని గుడి తాళాలను రంగయ్య చేతికిచ్చాను. తర్వాత ఏమి జరిగిందో నాకు తెలియదని గ్రామ పెద్దను వేడుకొన్నాడు. రంగయ్య తను చేసిన నేరం అందరికి తెలిసిపోయిందన్న విషయం గ్రహించి సిగ్గుతో తలవంచుకున్నాడు. అప్పుడు భీమన్న "రంగయ్య నీవు స్వార్థంతో అతి పవిత్రమైన దేవుని నగలను

దొంగిలించావు! నిజాయతీ పరుడైన ధర్మయ్యపై నేరాన్ని మోపి దోషిగా అందరి ముందు నిలబెట్టావు! అందువల్ల నీకు కఠిన శిక్ష విధించి చెరసాలలో వేయించాలని తీర్పు ఇస్తున్నాను" అన్నాడు. అప్పుడు ధర్మయ్య రంగయ్యను క్షమించి వదిలివేయమని గ్రామపెద్దను వేడుకున్నాడు. భీమన్న ధర్మయ్య మాట కాదనలేక రంగయ్యను మందలించి వదిలివేశాడు. అపకారికి కూడా ఉపకారం చేసే ధర్మయ్య గొప్ప గుణానికి అక్కడున్న వారందరూ మెచ్చుకున్నారు. రంగయ్య, ధర్మయ్య చేతులుపట్టుకొని "అసూయతో చేసిన నేరానికి క్షమించమని" అడిగాడు. ధర్మయ్య "ఇప్పుడైనా నీలో మార్పు వచ్చింది! అంతే చాలు అన్నాడు. తర్వాత ఇద్దరు ఎన్నో గొప్ప పనులు చేసి ఆ ఊరిని బాగు చేసారు.

## ఎవరు గొప్ప?

ఒక అందమైన నగరం. దాన్ని దేవతలు పాలిస్తుండేవారు. తమ ధర్మాన్ని చక్కగా నిర్వహిస్తూ ఉండేవారు. అందుచేత ఆ నగరంలో అందరూ సంతోషంగా ఉండేవారు. కొంతకాలానికి ఈ దేవతలకు అమితంగా గర్వం ఏర్పడింది. ఎవరికి వారే తామే గొప్ప అని, తమవల్లే నగరంలో సంక్షేమం ఏర్పడిందని, తాము లేకపోతే అంతా ఛిద్రం అయిపోతుందని గర్విస్తూండేవారు. ఈ దేవతల నగరం ఏదోకాదు – మానవ శరీరం. దేవతలు జ్ఞానేంద్రియాలు, అవయవాలన్నీ తమ తమ పనులు సక్రమంగా నెరవేర్చేవి. అందుచేత శరీరం ఎప్పుడూ ఆరోగ్యంతో సుఖంగా ఉండేది. అవయవాలలో అహంకారం పని చేస్తే ప్రతీదీ తనకు తానే గొప్ప అని ఆలోచిస్తాయని ప్రతీదీ తాను లోపిస్తే శరీరంలో పనులు ఆగిపోతాయని, అప్పుడు శరీరం క్షీణించిపోతుందని అనుకుంది. అందుచేత వారిలో తగాదా బయల్దేరింది.

మొట్టమొదట ఎక్కడలేని అహంకారంతో మనస్సు ప్రారంభించింది. "నేను మీ అందరికీ రాజును. మీరంతా నా అధీనంలో ఉన్నారు. నేను నా ఇష్టం వచ్చినట్లు మిమ్మలను నడిపిస్తున్నాను. నేని లేకపోతే మీలో ఏ ఒక్కరూ ఏమీ చేయలేరు. ఎవ్వరూ మిమ్మల్ని గొప్ప అనుకోరు" అంది. మనస్సు చెప్పిన దానికి కోపంతో "కన్ను" నేనే ఈ శరీరంలో ముఖ్యమైన దానిని. నేను లేకుండా కాళ్ళూ,

చేతులూ తమ పనులు సక్రమంగా నెరవేర్చలేవు. నేను లేకపోతే చదువు ఉండదు, వ్రాతలు ఉండవు" అంది. వెంటనే ప్రగల్భంతో చెవి ప్రారంభించింది. "నీవు గొప్ప అంటే ఎవరు ఒప్పుకుంటారు. నేను లేకపోతే ఏమీ వినపడదు. ఏదీ వినిపించకుండా ఎవరు ఏంచేయగలరు? నేనే అందరికంటే గొప్పదానిని" అంది. వెంటనే ముక్కు లేచింది. "నేను లేకపోతే అసలు వాసనే తెలియదు. శ్వాస నావల్లే జరుగుతూంది. శ్వాసించకుండా ఎవరు జీవించగలరు? నేను మీఅందరికంటే గొప్పదానిని" అంది. అంతవరకు మాట్లాడకుండా నోటిలో ఊరుకున్న నాలుక తన గొప్ప చెప్పుకోవడం ప్రారంభించింది. "అసలు నేనే లేకపోతే మీ ప్రగల్భాలు మీరు ఇలా చెప్పుకోగలరా? మీ అందరికీ లేని మాట్లాడే శక్తి నాకుంది. నేను లేకపోతే తినే ఆహారంలో ఉప్పు, పులుపు, తీపి రుచుల వైవిధ్యం తెలియదు. రుచి తెలీనప్పుడు జీవితం విలువ ఏముంది? నేనే అందరికంటే గొప్పదాన్ని" అంది.

"ఇలా మనలో ప్రతివారూ ఎవరికి వారే గొప్ప అని, ఇతరులందరూ ఎందుకూ పనికిరానివారని అనుకుంటున్నాం. ఈ తగవు తీరేది కాదు. కాబట్టి ఒక పోటీ పెట్టి ఎవరు గొప్పో నిర్ణయించుకుందాం. మనం ఒక సంవత్సరంపాటు ఒకరి తరువాత ఒకరు ఈ శరీరాన్ని విడిచి వెళ్ళిపోదాం. అప్పుడు ఎవరు లేకపోతే దేహంలో అన్ని పనులు, క్రియలు నిలిచిపోతాయో వారే గొప్పవారుగా పరిగణించబడతారు. ఈ తీర్పుకు అన్నీ ఒప్పుకున్నాయి. మొట్టమొదట మనసు ఒక సంవత్సరంపాటు విడిచి వెళ్ళిపోయింది. తరువాత వచ్చి చూస్తే ఏ అంగానికా అంగం తమ పనులు చేసుకుంటున్నాయి. మనసు ఆశ్చర్యం వెలుబుచ్చింది. అప్పుడు అంగాలన్నీ "ఎందుకు అలా ఆశ్చర్యపోతావు? నీవు లేకపోయినా మేమంతా సుఖంగా ఉన్నాం. మాకు ఏ విచారమూ లేదు" అన్నాయి. తరువాత కన్ను బయలుదేరింది. అదికూడా తిరిగివచ్చి వివిధాంగాలు తమ పనులు యధావిధిగా నిర్వహిస్తున్నట్లు గ్రహించింది. కన్ను తరువాత చెవి బయల్దేరింది. దారిలో ఓ బధిరుడు ఎదురయ్యాడు. అతడు సంకేతాలతో అన్ని విషయాలూ చెప్పాడు. శరీరం అంతా ఇతర అంగాలతో చైతన్యవంతంగా ఉంది. దాంతో తన గడువు పూర్తికాకుండానే తిరిగివచ్చింది. తరువాత ముక్కు బయల్దేరింది. ముక్కుకి దారిలో ఓ ముక్కిడి తటస్థపడ్డాడు. వెంటనే ముక్కు తిరిగి వచ్చేసింది.

తరువాత నాలుక లేచి వెళ్ళడానికి ప్రారంభించింది. ఒక మూగవాడిని చూసీ చూట్టంతోనే తిరిగివచ్చేసింది.

అన్ని అవయవాలు వచ్చాక ఆత్మ తన ఉపన్యాసం ప్రారంభించింది, "ఇప్పుడైనా గ్రహిస్తారా నేనే గొప్పదాన్నని?" అని ఋజువు చేయడానికి శరీరం నుంచి బయటకి వెళ్ళడానికి ఉద్యుక్తురాలయ్యింది. కొంచెం కదిలిందో లేదో శరీరావయవాలన్నీ చైతన్యరహితం కాసాగాయి. కంటి గుడ్లు తేలిపోయాయి, నాలుక బైటికొచ్చేసింది, శరీరం మొద్దుబారసాగింది. దాంతో అవయవాలన్నీ "ఓ ఆత్మా, మమ్మల్ని క్షమించు. నువ్వుమాత్రం మమ్మల్ని విడిచి వెళ్ళొద్దు" అని ప్రాధేయపడ్డాయి. అప్పుడు ఆత్మ "మనలో ఏ ఒక్కరు లేకపోయినా మన శరీరం బాధపడుతుంది. మనం అందరం పొందికగా పనిచేస్తేనే శరీరం ఆరోగ్యవంతంగా, సుఖంగా ఉంటుంది. రండి. మనం అందరం చేదోడువాదోడుగా సంఘీభావంతో కలసి మన పనులు చేసుకుందాం" అనడంతో అవయవాలన్నీ తమ తమ ప్రాధాన్యలతోపాటు ఇతర అవయవాల ప్రాధాన్యతను కూడా గుర్తించాయి. శరీరంలోని వివిధ అంగాల మాదిరిగానే ఒక కుటుంబంలో, సమాజంలో, దేశంలో వివిధ సుఖ సంతోషాలు, శాంతి భద్రతలు ఐకమత్యం మీదే ఆధారపడి ఉంటాయి.

## కోతి గొప్పలు

ఒకరోజు కొందరు నావికులు సముద్రయాత్రకు బయలుదేరారు. వారు తమతోపాటు తమ పెంపుడు కోతిని వెంటబెట్టుకుని యాత్రను మొదలెట్టారు. వారు సముద్రం మధ్యలో ఉండగా ఒక భయంకరమైన ఉప్పెన వచ్చింది. ఆ ఉప్పెన ధాటికి అందరూ సముద్రంలోకి కొట్టుకుపోయారు. కోతి కూడా తాను మునిగిపోయానని అనుకునే సమయంలో ఒక డాల్ఫిన్ వచ్చి కోతిని తన వీపుపై ఎక్కించుకుంది.

కోతి, డాల్ఫిన్ ఇద్దరూ సురక్షితంగా ఒక దీవికి చేరుకున్నారు. కోతి... డాల్ఫిన్ వీపు మీది నుండి దిగి ఒడ్డుపై కూర్చుంది. డాల్ఫిన్... కోతితో, "మిత్రమా! నీకు ఈ ప్రదేశం తెలుసునా?" అని అడిగింది. అపాయం నుంచి గట్టెక్కి

సురక్షితంగా ఉన్నానని రూఢీ చేసుకున్న కోతి, "ఈ ప్రదేశం నాకు తెలియకపోవడం ఏమిటి? ఈ దీవిని పరిపాలించే రాజు నాకు మంచి స్నేహితుడు. నీకోక విషయం తెలుసో లేదో! నేను ఒక రాజకుమారుడిని."

కోతి వ్యర్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆ దీవిలో ఒక్క జీవికూడా నివసించదని తెలిసిన డాల్ఫిన్‌కు చిర్రెత్తుకొచ్చినా సమ్యమనంతో, "ఓహో! నువ్వు రాజకుమారుడివి. కాని ఇప్పటి నుంచి నువ్వు రాజువన్నమాట!" అంది. కోతికి డాల్ఫిన్ మాటలు అర్థంకాక "నేను రాజునెలా అవుతాను?" అని అడిగింది డాల్ఫిన్‌ను. ఒడ్డు నుంచి కోతికి అందకుండా దూరంగా వెళ్లిన డాల్ఫిన్. "చాలా సులభం. ఈ దీవిలో ఉన్న జీవివి నువ్వొక్కడివే కాబట్టి నీవే ఈ దీవికి రాజువు" అని సమాధానమిచ్చి కోతిని ఆ దీవిలోనే వదిలి వెళ్లిపోయింది.

## ధర్మ విజయం

ఒక ఊరిలో రాజమ్మ అనే ఒక వృద్ధ వితంతువు ఉండేది. ఆమె వద్ద నూరు బంగారు నాణాలు ఉండేవి. వయసు మీద పడుతుండడంతో రాజమ్మ తీర్థయాత్రలకు బయల్దేరాలనుకుంది. ఆమె తన దగ్గరున్న బంగారు నాణాలను ఒక సంచిలో వేసి లక్కతో కట్టేసింది. ఆ నాణాల సంచిని పొరుగింటి షావుకారుకు దాచమని ఇస్తూ "అయ్యా ఒకవేళ నేను తిరిగి వచ్చినట్లయితే నా నాణాల సంచిని తీసుకుని నీ సేవకు ప్రతి ఫలంగా పది బంగారు నాణెములు ఇస్తాను. నేను రాకపోయినట్లయితే ఈ సంచి నీదే అని చెప్పింది.

రాజమ్మ వెళ్ళిన వెంటనే షావుకారు సంచిలోని నూరు బంగారు నాణాలను లెక్కపెట్టాడు. ఆ నాణాలను దక్కించుకోవాలని ఒక పన్నాగం పన్నాడు.

రాజమ్మ తీర్థయాత్రలు ముగించుకుని తిరిగి వచ్చి తన బంగారు నాణాల సంచిని ఇవ్వమని కోరగా షావుకారు సంచిని ఆమెకు అందించాడు. ఇంటికి వెళ్ళిన తర్వాత, రాజమ్మ షావుకారుకు మాట ఇచ్చినట్లు పది బంగారు నాణాలు ఇవ్వడానికి సంచి బిరడా తొలగించి చూడగా, సంచిలో బంగారు నాణాలకు బదులుగా ఇనప నాణాలు ఉన్నాయి. ఆమె ఆ సంచి తీసుకుని షావుకారు దగ్గరకెళ్లి జరిగినదంతా వివరించింది. కాని షావుకారు తనకేమీ తెలియదని

బుకాయిస్తూ, తనకు రావలసిన పది బంగారు నాణాలు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు.

రాజమ్మ న్యాయం కోసం రాజు వద్దకు వెళ్ళి జరిగిన విషయమంతా చెప్పింది.

రాజు షావుకారును న్యాయస్థానానికి రప్పించి ఏం "ఈ విషయంపై నీవేమి చెప్పాలనుకుంటున్నావు?" అనడిగాడు.

అప్పుడు షావుకారు "నాకేమీ తెలియదు మహారాజా! ఈ అవ్వ నాకు ఒక లక్కతో బిగించిన సంచిని భద్రపరచమని ఇచ్చింది. నేను తిరిగి భద్రంగా అప్పగించాను, ఇంతవరకు నాకు రావలసిన రుసుము అందలేదు" అన్నాడు.

ఇద్దరి వాదనలు విన్న రాజు సంచిని సునిశితంగా పరిశీలించాడు. సంచికి చేసిన రంధ్రం దానిని నిపుణతతో కుట్టిన క్రమం రాజును ఆలోచించేలా చేసింది. రాజు రాజమ్మను, షావుకారును రెండు రోజుల తర్వాత న్యాయస్థానంలో హాజరుకావాలని ఆదేశించాడు. ఈ క్రమంలో, రాజు పట్టణంలోని నిపుణులైన కుట్టుపని వారిని తన ఆస్థానానికి రప్పించి వారికి ఆ సంచిని చూపించాడు. వారిలో ఒకడు ఆ సంచిని షావుకారు అడిగితే కుట్టించానని చెప్పాడు.

రెండు రోజులు గడిచిన తరవాత, రాజమ్మ, షావుకారు రాజుగారి ఆస్థానంలో హాజరయ్యారు. రాజు రాజమ్మకు అనుకూలంగా తీర్పు ఇచ్చాడు.

షావుకారు తను తప్పు చేయలేదని వాదించాడు. అప్పుడు రాజు ఆ కుట్టుపనివాడిని చూపించాడు. అంతే! షావుకారు తప్పు ఒప్పుకున్నాడు.

మొత్తం బంగారు నాణాలు రాజమ్మకి ఇవ్వవలసిందిగా షావుకారును రాజు ఆదేశించాడు. షావుకారు తనకి రావలసిన పది బంగారు నాణాలను కూడా జరిమానా రూపంలో కోల్పోయాడు. రాజమ్మ కోరిక మేరకు రాజు షావుకారుకు జైలుశిక్ష విధించలేదు.

## కాపాడిన స్నేహం

ఒక ఊరి చివర పెద్ద వేప చెట్టు ఉండేది. ఆ చెట్టు పైనుండే కాకికి, ఆ చెట్టు కింద బొరియలో ఉండే కుందేలుకి మంచి స్నేహం.

ఊరి పక్క నున్న అడవి నుండి ఒక నక్క కుందేలుని పసిగట్టి దానిని తినడానికి చెట్టు దగ్గరకు వచ్చింది. నక్కను చూడగానే కుందేలు ఒక్క ఉదుటున

పొదలోకి దూరిపోయింది.

ఎప్పటికైన సరేబయటకు రాకుండాపోతుందా అని నక్క పొద దగ్గరే కూర్చుని ఆలోచించింది. 'ప్రతి రోజు కుందేలు ఆహారం కోసం ఉండలేదు. కచ్చితంగా బయటకు రావాల్సిందే! అప్పుడు దాన్ని పట్టుకుని తినచ్చు .'

ఇదంతా చెట్టుపై నుండి కాకి చూస్తూనే ఉంది. విసుగెత్తి నక్క వెళ్ళిపోతుంది అనుకుంది గాని ఎంతసేపైనా అది పొద ముందు నుండి కదలడం లేదు. ఇలాగైతే తన మిత్రుడైన కుందేలుకి ఇబ్బంది అని ఆలోచించి, కావు కావు మని అరవడం మొదలు పెట్టింది.

అంతే! ఎక్కడెక్కడి కాకులన్నీ ఆ అరుపులకు వేపచెట్టుపైకి వచ్చి చేరాయి. నక్కకి ఏమీ అర్థంకాలేదు.

కాకి తోటికాకులకి సంగతంతా చెప్పింది. వెంటనే కాకులన్ని ఒక్కసారిగా నక్కపై దాడి చేశాయి. ముక్కులతో పొడిచి పెట్టాయి. కాకుల పోట్లని తట్టుకోలేక నక్క బతుకు జీవుడా అంటూ అడవిలోకి పారిపోయింది. మళ్ళీ ఆ వైపు రానేలేదు.

నక్క పారిపోవడంతో కుందేలు నెమ్మదిగా బొరియనుండి ఇవతలకు వచ్చింది. "నా ప్రాణాలు రక్షించినందుకు కృతజ్ఞతలు మిత్రమా!" కాకి చేసిన సాయానికి కృతజ్ఞలు చెప్పింది కుందేలు.

రెండూ కలిసి ఎప్పటిలాగే సంతోషంగా ఆడుతూ పాడుతూ ఉండసాగాయి.

## మనశ్శాంతి

రామయ్య, సోమయ్య ఇద్దరూ ఇరుగుపొరుగు వాళ్ళు. రామయ్య పేద కుటుంబానికి చెందిన రైతు సోమయ్య పెద్ద భూస్వామి. రామయ్య ఎప్పుడూ ఉల్లాసంగా, హాయిగా ఉండేవాడు. ధనం లేక పోయినా ఎంతో సంతోషంగా, సంతృప్తిగా జీవితం గడిపేవాడు.

సోమయ్య ఎప్పుడూ ఆదుర్దాగా, ఏదో ఆలోచనలో ఉండేవాడు. రాత్రిపూట అతనికి సరిగ్గా నిద్ర పట్టేది కాదు. ఏ దొంగైనా వచ్చి తన బీరువాలోని డబ్బును కాజేస్తాడేమోనని భయపడేవాడు సంతోషంగా ఉండే రామయ్యను చూసి అసూయపడేవాడు సోమయ్య.

ఒక రోజు సోమయ్య రామయ్యను పిలిచి నీవు పేదవాడివి, ఈ డబ్బుతో హాయిగా జీవించు అని కొంత డబ్బు ఇచ్చాడు.

రామయ్యకు కృతజ్ఞతలు తెలిపి వెళ్ళిపోయాడు. చీకటి పడింది. రాత్రంతా రామయ్యకు కంటి మీద కునుకులేదు. డబ్బు పెట్టె వంకే చూస్తూ కాలం గడిపాడు సోమయ్యకున్న భయం, అశాంతి ఇప్పుడు రామయ్యకు పట్టింది.

తెల్లవారగానే రామయ్య డబ్బు పెట్టెను తీసుకెళ్ళి సోమయ్యకు తిరిగి ఇచ్చి నేను పేదవాణ్ణి సోమయ్యా నన్ను ఇలాగే ఉండనివ్వు నీవు ఇచ్చిన డబ్బు నా మనశ్శాంతిని నాకు కాకుండా చేస్తోంది. నీ డబ్బు నువ్వే తీసుకో అన్నాడు.

## పిచ్చి కబుర్లు

అననగనగా ఒక వనము. ఆ వనంలో కాకి, పావురం, కొంగ స్నేహంగా ఉన్నాయి. ఒక రోజు ఆ మూడు ఒక పందెం కట్టుకున్నాయి. వనంలో అవి ఉన్న స్థలం నుంచీ దాదాపుగా ఓ కిలోమీటర్ దూరాన ఉన్న కొబ్బరి చెట్ల దగ్గరికి చేరాలి. ఎవరు ముందుగా చేరితే వారు పందెంలో నెగ్గినట్లు... ఆ నెగ్గిన వాళ్లు ఏం చెప్పినా మిగతా వాళ్ళిద్దరూ అలా నడుచుకోవాలనే పందెం అది.

కాకి, పావురం, కొంగ నిర్ణీత స్థలం నుంచీ ఆకాశ మార్గాన ఎగురుతూ వచ్చాయి. కొంగ ఎంతగా రెక్కలు అదిలించినా కాకినీ, పావురాన్ని దాటలేక చాలా దూరం వెనక బడింది. "పావురం మిత్రమా. మనం అతి వేగంగా చాలాదూరం ఎగిరి వచ్చాం. కొంగ మనల్ని దాటి పోవడం అసంభవం... కాసేపు మనమిద్దరం ఆ చెట్టు కొమ్మల చాటున కూర్చుని కబుర్లు చెప్పుకుందాం" అంది కాకి. "సరే అది వచ్చేలోపు మనం గమ్యం చేరుకోలేమా" అంది పావురం. ఆ రెండు పక్షులు చెట్టు మీదకి పోయాయి. ఏవేవో కబుర్లూ, ఊసులు చెప్పుకోవడంలో మునిగిపోయాయి.

కొంగ నెమ్మదిగా ఎగురుకుంటూ కొలను గట్టున ఉన్న కొబ్బరి చెట్లను చేరుకుంది ప్రశాంతంగా. అది చూసిన పావురం, కాకి పిచ్చి కబుర్లు ఆపేసి గబగబా ఎగిరి వచ్చి ఆయాసపడుతూ కొంగ చెంత వాలిపోయాయి. "మమ్మల్ని ఓడించావు కొంగ గారు. మా పిచ్చి కబుర్లూ, ఊసులే కొంపలు ముంచాయి... ఏకాగ్రతగా వచ్చి విజయం సాధించావు... నీకు అభినందనలు..."

అన్నాయి పావురము, కాకి తలదించుకొని...
చూశారా పిల్లలూ పిచ్చి కబుర్లు ఎంత నష్టం కలిగిస్తాయో...

## గెలుపు గర్వం

ఒక గడ్డి మైదానంలో రెండు కోడిపుంజులు నివాసముండేవి. ఒకరోజు అవి ఆ మైదానానికి యజమానిగా ఏదో ఒకటి మాత్రమే ఉండాలనుకున్నాయి.

రెండు పుంజులూ పోటీకి ఏర్పాట్లు చేసుకున్నాయి. ఒక మంచి ముహూర్తం చూసి యుద్ధనికి సన్నద్ధమయ్యాయి. ఆ పోటీలో గెలిచిన పుంజు యజమాని హోదాని పొందుతుంది. పోరు మొదలైంది. ఆ రెండు పుంజులలో ఒకటి అత్యంత బలమైనది. కాగా మరోటి కొంత బలహీనమైనది.

కొద్దిసేపటి తరువాత బలమైన పుంజును ఎదిరించలేని బలహీనమైన పుంజు ఓడిపోయానని ఒప్పేసుకుంది.

అంతే గెలిచిన కోడిపుంజుకు సంతోషంతో పాటు గర్వం కూడా కలిగింది. “చూసావా మిత్రమా, ఇప్పుడిక ఈ మైదానానికి నేనే రాజును. నువ్వు నా బానిసవు. ఈ రోజునుండి నేను చెప్పినట్టు నువ్వు వినాలి” అని పకపకా నవ్వింది. ఆ కోడిపుంజు అంతటితో ఊరుకోలేదు. తన విజయాన్ని అందరూ గుర్తించాలనీ, ఓటమిపాలైన పుంజు అవమానపడాలనీ గంతులేస్తూ గట్టిగా అరవసాగింది. ఓడిపోయిన కోడిపుంజు తలవంచుకుని నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది.

ఆకాశంలో చాలా దూరంగా ఆహారం కోసం అన్వేషిస్తున్న ఒక గద్దకు కోడిపుంజు కేరింతలు వినబడ్డాయి. గద్ద రివ్వున ఎగురుతూ కిందకు వచ్చింది. మితిమీరిన సంతోషంలో జరగబోయే ప్రమాదాన్ని పసికట్టలేక పోయిందా కోడిపుంజు. ఇంకేముంది గద్ద దాన్ని ఎత్తుకుపోయి చంపి తినేసింది. ఓడిపోయిన కోడిపుంజే ఆ మైదానానికి యజమాని అయింది.

# విలువైన ఉంగరం

ధనికుడైన వృద్ధుడొకడు తన ఆస్తిని సమభాగాలుగా తన ముగ్గురు కొడుకులకూ పంచి యిచ్చాడు. కాని విలువైన వజ్రపు ఉంగరాన్ని తను వుంచుకున్నాడు. "అలా ఎందుకు చేశావు?" అన్న ప్రశ్నకు అతను ఇలా జవాబిచ్చాడు. "ఆఖరుకు నాకు మిగిలిన ఈ వజ్రపు ఉంగరాన్ని విభజించడం సాధ్యం కాని పని. కనుక నా ముగ్గురు కొడుకులలో ఎవరు నిజమైన మానవతావాదో నేను కనుగొన్నాకనే ఈ వజ్రపు ఉంగరం వాడికి దక్కుతుంది". అతని ముగ్గురు కొడుకులూ మూడు త్రోవలలో వెళ్ళారు. కాలం అతి వేగంగా సాగిపోయింది. అతను నిర్ధారించిన సమయం ఆసన్నమైంది. ముగ్గురు అన్నదమ్ములూ తండ్రి యింటికి మరలి వచ్చారు. ఒక్కొక్కడూ తన మానవతా చర్యలను చెప్పుకోసాగాడు.

వారిలో జ్యేష్టుడు ఇలా మొదలుపెట్టాడు, "నాన్నా! విను. ఒక రోజు నా దగ్గరకు ఒక అపరిచితుడు వచ్చాడు. తన ధనాన్ని అంతా నాకు అప్పగించి, తను తిరిగి వచ్చేంత వరకు దాన్ని భద్రంగా వుంచుకోమని కోరాడు. నేను సరే అన్నాను. రాసి యిచ్చిన పత్రంలా నా మాటను అతను స్వీకరించి వెళ్ళిపోయాడు. కొన్ని రోజులయ్యాక అతను తిరిగి వచ్చి తన డబ్బునిమ్మన్నాడు. నేను దానిని నా దగ్గర వుంచేసుకునేవాణ్ణే, కాని నిజమైన మానవతావాదిని కాబట్టి ఆ డబ్బు వడ్డీతోసహా కూడా చేర్చి అతనికి అప్పగించాను. కాబట్టి ఇప్పుడు నీవే చెప్పు, ఆ వజ్రాల వుంగరానికి నేను తగినవాణ్ణే కదా!" అన్నాడు. వృద్ధుడు ఇలా అన్నాడు "కాని అబ్బాయీ, లోకంలో అంతరాత్మ వుండే వ్యక్తులు చేసినట్లే నువ్వు కూడా చేశావు" అన్నాడు.

ఇక రెండో కొడుకు ప్రారంభించాడు. "నా సముద్ర యానంలో వానా, వురుములతో సహా పెనుతుఫాను చెలరేగింది. ఆ తరుణంలో ఓడ పైభాగం మీద ఒంటరిగా నుంచున్న ఒక అమాయకుడైన బిడ్డ తూలి లోతైన సముద్రంలో పడిపోయాడు. ఆ బిడ్డను కాపాడాలని ఎవ్వరూ అనుకోలేదు. కాని నిజమైన మానవతావాదినైన నేను మాత్రం భయంకరంగా విజృంభించే కెరటాలలోకి దూకి ఒక అమాయకుడైన బిడ్డను రక్షించాను. నాన్నా, ఇప్పుడు చెప్పు, నేను యదార్థమైన

మానవతా వాదినే కదా" అన్నాడు. దానికి ఆయన తండ్రి "మంచి పనే చాశావు నాయనా! నీ జీవితాన్నే నీవు లక్ష్యపెట్టక తెగించావు. అది చాలా ఘనకార్యమే. కాని పిరికిపందకానివాడు, ఎవరైనాసరే సరిగ్గా అలాగే చేసేవాడు" అన్నాడు.

ఆఖరి కొడుకు తన అనుభవాన్ని యిలా చెప్పసాగాడు, "నాన్నా! నేను గొర్రెల మందకు కాపరిగా ఉండేటప్పుడు చల్లని గాలి నా శత్రువును నిద్రపుచ్చింది. ఆ సుఖనిద్రలో ఏటవాలుగా వుండే చోటుకు అతను దొర్లిపోయాడు. ఇంక కొంచెం దొర్లితే అతను తప్పక చనిపోయేవాడే. నేను అక్కడకు అతన్ని పోనివ్వలేదు. అతను నా శత్రువైనా అతన్ని లేపి విపత్తు నుండి అతన్ని రక్షించాను" అని ముగించాడు. అతని తండ్రి సంతోషిస్తూ "అబ్బాయి! నీవు అత్యంత ఘనమైన కార్యాన్ని చేశావు, శత్రుత్వాన్నీ, పగనూ మనస్సు నుండి బహిష్కరించడానికి అత్యంత గొప్ప హృదయం అవసరం. నీవే నిజమైన మానవతాభిమానివి. నిస్సందేహంగా ఈ వజ్రపు ఉంగరం నీకే చెందాలి" అని ఆ ఉంగరాన్ని తన చిన్న కొడుక్కి బహూకరించాడు.

## దురాశ దుఃఖమునకు చేటు

ఒక ఊరిలో నలుగురు స్నేహితులు చేరి ఉండేవారు. సమాన లక్షణాలున్న వారందరూ ఒకే చోట చేరటం సహజం. వీరందరూ గర్భ దరిద్రులు. నిలవడానికి నీడ లేకుండా ఒక పూట తింటే మరోపూట పస్తుండేవారు. నలుగురూ ధనం సంపాదిద్దామనే ఆశయంతో విశాల ప్రపంచంలోకి బయలుదేరారు. ఊరు వదిలి కృష్ణా నది గట్టు మీద ప్రయాణం సాగించారు. కొంత దూరం ప్రయాణం చేసిన తరువాత ఒక చోట జడలుకట్టుకు పోయిన జుట్టుతో ఒక సన్యాసి వీరి కంటబడ్డాడు. ఆ సన్యాసికి వారు సాష్టాంగ దండ ప్రణామంచేసి తమ కోరికను అతడితో విన్నవించుకున్నారు. యోగ శక్తితో తమకు సహకరించమని వేడుకున్నప్పుడు ఆ సన్యాసి వారికొక జ్యోతిని ఇచ్చి "ఈ జ్యోతిని మీ చేతులలో పెట్టుకుని మీరు హిమాలయ పర్వతాల వైపుకు బయల్దేరి వెళ్ళండి. చేతిలో జ్యోతి ఎక్కడ అడితే అక్కడ భూమిని త్రవ్వండి. మీకు కావలసినంత ధనం లభిస్తుంది" అని చెప్పాడు.ఆ నలుగురు ఆ జ్యోతి పట్టుకుని హిమాలయ

కొండలవైపు బయలుదేరారు. ఒకచోట ఆ జ్యోతి చేతులలోనుంచి పడిపోయింది. సన్యాసి వారికి చెప్పినట్టుగా అక్కడ భూమిని లోతుగా త్రవ్వారు. అది ఒక పెద్ద రాగి గని. ఆ నలుగిరిలో ఒకడు తనకు కావలసింది తీసుకుని దానో తృప్తిపడి వెనకకు మరలిపోయాడు. మిగిలిన ముగ్గురూ జ్యోతిని పట్టుకుని యధాప్రకారం తిరిగి ప్రయాణం సాగించారు. మరొక చోట జ్యోతి జారి పడిపోయింది. అక్కడ త్రవ్విచూశారు. అదో పెద్ద వెండి గని. ఆ ముగ్గురిలో ఒకడు ఆ వెండితో తృప్తి చెంది ఇంటికి వెళ్ళాడు. మిగిలిన ఇద్దరూ ఇంకా ఉత్తమోత్తమమైనది దొరుకుతుందేమోనని బయల్దేరి నడక ప్రారంభించారు.

మూడోసారి జ్యోతి పడిపోయింది. వీరిద్దరూ శ్రమపడి తవ్వారు. బంగారం! అదో బంగారు గని. మూడో స్నేహితుడు దాంతో బాగా తృప్తిపడ్డాడు. ఇంక నాలుగోవాడు అత్యాశతో మళ్ళీ ప్రయాణం ప్రారంభించాడు. వజ్రాలు, రత్నాలు లభిస్తాయని ఆశించాడు. ప్రయాసతో బహుదూరం ప్రయాణించాడు. కొంతదూరం వచ్చేటప్పటికి ఒక చోట ఒక మనిషి తల మీద పెద్ద చక్రం గిరగిర తిరుగుతూవుంటే అక్కడ ఆగి "ఇదేమిటి నీ తల మీద ఆ చక్రం అలా తిరుగుతూంది?: అని అడిగాడు. ఆ పెద్ద మనిషి "మొదట ఈ చక్రాన్ని నీ తల మీద పెట్టుకో. తరువాత కథ చెబుతాను" అన్నాడు. దీనికి నాలుగోవాడు ఒప్పుకున్నాడు. కథ విందామని ఆ చక్రాన్ని తన తల మీదికి పెట్టనిచ్చాడు. ఆ పెద్ద మనిషి కథ చెప్పడం ప్రారంభించాడు. "నేనూ నీలాగే ఈ సౌభాగ్య జ్యోతిని పట్టుకుని ఇంతవరకూ వచ్చాను. నేనూ ఎంతో ఆశపడ్డాను. నేను దొరికిన రాగితో తృప్తి పడలేదు. దొరికిన వెండితో తృప్తిపడలేదు. నేను ఇక్కడ ఒక వ్యక్తిని చూశాను. ఈ చక్రం అతడి తల మీద గిరగిరా తిరుగుతూంది. నీలాగే నేనూ ఈ చక్రంలో తల దూర్చాను. ఇటివంటి తప్పు ఇంకొకడు చేసి నీకు విముక్తి కలిగించే వరకు ఈ చక్రం నీ తల మీద ఇలా తిరుగుతూనే ఉంటుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

# గురువుగారి సేవ

ఒక గురువుగారు, ఆయనకిద్దరు శిష్యులు. శిష్యులు స్వతహాగా మంచివారే కానీ కొంచెం అమాయకులు, మరి కొంచెం తెలివితక్కువ వారు. ఒకడి పేరు రామ, మరోకడి పేరు సుధామ. వారి ప్రవర్తన గురువుకు అప్పుడప్పుడు చాలా తలనొప్పిగా తయారయ్యేది. అయినా సరే ఆయన వాటన్నింటిని సహిస్తూ వారికి కొంతైనా విద్య ఒంటబట్టాలనే ఉద్దేశ్యంతో తన దగ్గరే ఉంచుకున్నాడు.

ఒకరోజు గురువుకి కాస్త ఒంట్లో నలతగా ఉండి కాస్సేపు విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. శిష్యులను పిలిచి, "రామా, సుధామా! నాకు ఒళ్ళు నొప్పులు విపరీతంగా ఉన్నాయి. మీరిద్దరు నా కాళ్ళు నొక్కాలి నేను కొంచెంసేపు నిద్రపోతాను." అన్నాడు.

గురువుగారికి సేవ చేసే అవకాశం రావడంతో శిష్యులకు చాలా సంతోషం కలిగింది. "తప్పకుండా గురువుగారు!" ఎంతో ఉత్సాహంగా అన్నారు.

రామ, సుధామ గురువు చెరో కాలు తమ ఒళ్ళో పెట్టుకుని ఎంతో ప్రేమతో కాళ్ళు నొక్కసాగారు. కొంచెంసేపు తరువాత నిద్రలో గురువు రెండు కాళ్ళు దగ్గరకు తీసుకోవడంతో రామ ఒత్తుతున్న కాలు సుధామ దగ్గరున్న కాలికి తగిలింది.

"ఏయ్ రామా, నీ కాలును దూరంగా ఉంచు. లేకపోతే బాగోదు." అన్నాడు సుధామ కోపంగా.

"పోవోయ్, నీదేమైనా గొప్పకాలా? ఛండాలమైన కాలు. నువ్వే నీ కాలును దూరంగా ఉంచుకో" అని జవాబిచ్చాడు రామ.

సుధామ ఇంకోమాటన్నాడు. దానికి రామ ఇంకోలా జవాబిచ్చాడు. ఈ విధంగా వాదన కాస్త పోట్లాటలోకి మారిపోయింది. ఒకడు కాలిని నరికేస్తానంటే మరొకడు నిప్పుతో తగలెడతానని అన్నాడు. అంతే రామ కోపంగా వంటింటి వైపు పరిగెత్తి మండుతున్న కట్టెను తీసుకుని వచ్చాడు. సుధామ బయటకు పరిగెత్తి గొడ్డలి పట్టుకుని వచ్చాడు.

ఈ గందరగోళానికి గురువుకు మెలుకవ వచ్చి చూస్తే ఏముంది? ఆయన్ని తగలబెట్టడానికి, నరకడానికి ఇద్దరు శిష్యులు యమదూతల్లా నిలబడి ఉన్నారు.

"ఒరేయ్ నాయనల్లారా ఏమిటిరా ఇది!" కంగారుగా పైకి లేచాడు గురువు. జరిగింది తెలుసుకుని ఇద్దరిని బాగా చివాట్లు వేసాడు. మూర్ఖులతో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే మన ప్రాణం మీదకే వస్తుంది.

## పసిమనసు

రాఘవరావుగారు కూతురును చూడటానికి పట్నం నుండి వచ్చారు. ఆయన కర్నూలు జిల్లాలో హెడ్‌మాస్టర్. తాతగారిని చూసి పరుగున వచ్చాడు పవన్. మనవడిని ఎత్తుకొని ముద్దాడుతూ ఇంట్లోకి నడిచాడు రాఘవరావుగారు. అమ్మా! అమ్మా! తాతయ్య వచ్చాడు. అరిచాడు పవన్. శైలజ కిచెన్ రూం నుండి బయటికి వచ్చి తండ్రిని క్షేమసమాచారాలడిగింది. అనంతరం అల్లుడుగారింకా రాలేదా? అడిగారాయ

ఆఫీస్ టైం అయిపోయింది కదా! వస్తుంటారు నాన్నా అని చెప్పింది శైలజ. మనువడితో ఆడుకుంటూ కబుర్లలో పడ్డాడు రాఘవరావుగారు. తండ్రి కోసం పవన్ మనసు ఎదురుచూస్తుంది. ఆఫీస్, దారి కబుర్లు పూర్తి చేసుకొని రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చాడు రంగనాథం. రాగానే పరుగున వెళ్ళి తండ్రి చేయి పట్టుకున్నాడు పవన్. అలసటగా వున్న రంగనాథం చేయి విడిపించుకున్నాడు. మామగారిని చూసి క్షేమసమాచారాలు అడిగాడు. టవల్ తీసుకొని బాత్‌రూం వైపు నడిచాడు. తండ్రి తనను ఎత్తుకోవాలని ఎంతో ఆశగా పరుగెత్తుకుంటూ వచ్చిన పవన్ మనసు నిరాశతో గిలగిలలాడింది.

రంగనాథం డ్రస్ చేంజ్ చేసుకొని వచ్చాడు. అలసటగా కుర్చీలో కూర్చున్నాడు. టి.వి. ఆన్ చేసాడు. పవన్ పలక చేత పట్టుకొని పరుగున వచ్చాడు. పలకలో ఓ సున్నా చుట్టి, దానికి రెండు కళ్ళు, ముఖం, చెవులు పెట్టాడు. నాన్నా! నాన్నా! నేను బొమ్మ గీశాను చూడు అన్నాడు. రంగనాథం టి.వి పై నుండి చూపు మరల్చలేదు. పలకలోకి చూడకుండా ఎబిసడిలు రాసుకోకుండా ఈ బొమ్మలేంటి? వెళ్ళి ఎబిసిడిలు రాయి వెళ్ళు అన్నాడు చెంపలు నిమిరి. తాను గీసిన బొమ్మ చూసి నాన్న మెచ్చుకుంటాడని ఆశ పడిన పవన్ ముఖం చిన్నబోయింది. మెల్లగా వెళ్ళి గోడవారగా కూర్చున్నాడు. ఎబసిడిలు

వచ్చినవన్నీ రాసాడు. నాన్నా నాన్నా! ఎబిసిడిలు రాశాను అంటూ ఉత్సాహంగా వచ్చాడు. తాతయ్యకు చూపించు అన్నాడు రంగనాథం. ఉరకలు వేసే ఉత్సాహం చచ్చుబడిపోయింది. చేసేది లేక ముఖం చిన్నబుచ్చుకుని తాతయ్య దగ్గరకెళ్ళి కూర్చున్నాడు. రాత్రి భోజనాలయ్యాక టి.వి లో వార్తలు వింటున్నాడు రంగనాథం. పవన్ వచ్చాడు. నాన్నా! నాన్నా! కథ చెప్పవా? గడ్డం పట్టుకుని లాగుతూ అడిగాడు. "కథకు కాళ్ళులేవు. ముంతకు చెవుల్లేవు పడుకోకన్నా" అన్నాడు రంగనాథం. పవన్ కథ చెప్పమని గడ్డం పట్టుకులాగుతున్నాడు. వార్తలు వినాలి. చెబుతుంది నీక్కాదా విసిగించకు వెళ్ళి పడుకో! లేకుంటే పిచ్చోడికి పట్టిస్తా అన్నాడు. అంతా గమనిస్తున్న రాఘవరావుగారు అల్లుడూ వాడికి కథ చెప్పు అన్నారు.

అదేంటి మామయ్యా! వాడేదో పిల్ల తనం కొద్దీ కథ చెప్పమంటున్నాడు. అలాగని కథలు చెబుతూ కూర్చోవటమేనా? అంత తీరికెక్కడుంది. అన్నాడు రంగనాథం. వచ్చినప్పటి నుండీ గమనిస్తున్నాను. నువ్వు వాడిని నిర్లక్ష్యం చేస్తున్నావు అన్నారు రాఘవరావుగారు. నేను వాడిని నిర్లక్ష్యం చేయటమేమిటి? వాడు నాప్రాణం. వాడికి పదిహేను జతల బట్టలు తెచ్చాను. కోరిన తినుబండారాలు కొనిచ్చాను. వందలకొద్దీ ఫీజ్‌తో స్కూల్లో చేర్చాను. వాడికేంతక్కువైంది? అన్నాడు రంగనాథం. వాడికి అన్నీ అమర్చావని నీ వనుకుంటున్నావు. సంతృప్తి పడుతున్నావు కానీ, వాడి ఒంటరితనాన్ని దూరం చేసే నీ ప్రేమ మాత్రం వాడికి లేదు అన్నారు రాఘవరావుగారు. వాడు నా ప్రాణం. వాడిపై నాకు ప్రేమలేక పోవడమేమిటి మావయ్యా? ఆశ్చర్యంగా అడిగాడు రంగనాథం.

రాఘవరావుగారు అల్లుడి మాటలకు నవ్వి, పిల్లలకు తల్లిదండ్రులతో కబుర్లు చెప్పాలని ఉంటుంది. తాము రాసిన అక్షరాలు, బొమ్మలు చూపి మెప్పుపొందాలని ఉంటుంది. కథలు వినాలని ఉంటుంది. తల్లిదండ్రులతో ఆడుకోవాలని ఉంటుంది. కానీ మనం యాంత్రిక జీవితంలో పడి పట్టించుకోము. వారికేలోటు చేయలేదనుకుంటాం. వాళ్ళ మనసులో బాధ మనకర్థం కాదు. వాళ్ళ ఒంటరితనాన్ని గుర్తించలేము. వాళ్ళ ఉత్సాహాన్ని అల్లరి అంటాం. వాళ్ళు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక గదమాయిస్తాము, భయపెడతాము. వాళ్ళ ఉరకలు వేసే ఉత్సాహాన్ని ఆనకట్ట వేస్తాము. తెలుసుకోవాలనే ఉత్సుకతను ఆదిలోనే

నరికేస్తాం. ఎన్నో పనులతో అలసిపోయామంటాము. కానీ పిల్లల సమక్షంలో అలసట తీర్చుకోవచ్చని మనకు తెలియదు. పని, స్నేహితులు, ఊరి రాజకీయాలు, అనవసర కబుర్లు, టి.వి కోసం కేటాయించే సమయంలో కొంత టైం కూడా పిల్లలకోసం వినియోగించలేము. వారితో కలిసి కబుర్లు చెప్పలేం, ఆడలేం. వాళ్ళని మానసికంగా ఒంటరిని చేస్తాం. వాడికన్నీ అమర్చామనుకుంటాం. ఇదీ మనం పిల్లల కోసం చేస్తున్న త్యాగం అన్నారు.

ఆయన మాటల్లోని యదార్థం అర్థమయ్యి రంగనాథం ఉలిక్కిపడ్డాడు. నన్ను క్షమించండి మామయ్యా! మీరు చెప్పింది అక్షరాలా నిజమే! అంటూ తాత పక్కన నిద్రలోకి జారుకున్న బాబు వైపు నడిచాడు రంగనాథం.

## బీదవాడు-గొప్పవాడు

ఒకరోజు సభలో అక్బర్ చక్రవర్తి బీర్బల్‌ను ఈ విధంగా ప్రశ్నించాడు. "ఒక వ్యక్తి ఒకే సమయంలో బీదవాడు మరియు గొప్పవాడుగా గుర్తింపు పొందడం సాధ్యమవుతుందా?"

"సాధ్యమవుతుంది ప్రభూ" అని చెప్పాడు బీర్బల్. " అలాగా! అయితే అలాంటి వ్యక్తిని నాకు చూపించగలవా?" . "తప్పకుండా చూపిస్తాను ప్రభూ" అని బీర్బల్ సభ నుండి బయటకు వెళ్ళి పోయాడు. కొద్దిసేపటి తర్వాత ఒక వ్యక్తిని వెంటబెట్టుకుని సభకు తిరిగి వచ్చాడు. "ఇతను కడు బీదవాడు ప్రభూ! బిచ్చ మెత్తుకుని జీవిస్తాడు" బీర్బల్ ఆ వ్యక్తిని అక్బరు ముందు నిలబెడుతూ చెప్పాడు.

"ఆ విషయం చూస్తేనే అర్థం అవుతోంది. మరి ఇతను గొప్పవాడు ఎలా అవుతాడు?" ఆసక్తిగా అడిగాడు అక్బరు. "ఒక చక్రవర్తితో పాటు ఇతను కూడా ప్రజల ముందు సత్కారాన్ని పొందగలిగితే, ఇతను తన బిచ్చగాళ్ళ మధ్య గొప్పవాడిగా గుర్తింపు పొందుతాడు" అన్నాడు బీర్బల్.

బీర్బల్ చాతుర్యానికి అక్బరు చక్రవర్తి ఎంతో ఆనందించాడు.

# అభిమాని

అభిమానం చాలా చిత్రమైనది. ప్రేమ గుడ్డిది అంటారు. అలాగే ఈ అభిమానం కూడా గుడ్డిదేనని చెప్పాలి. కత్తి పండ్లు కోసుకొని తినడానికే పనికి వస్తుంది. అలాగే ఆ అభిమానం మనుషుల మధ్య అనుబంధానికి దారి తీస్తుంది. మనుషుల పతనానికీ దారి తీస్తుంది. అయితే ఇక్కడ ఒక చిన్న సవరణ! “అతి సర్వత్రావర్జ్యయేత్” అని అన్నారు పెద్దలు. మంచి అయినా, చెడ్డ అయిన ఒక స్థాయివరకూ పరవాలేదు. ఆ స్థాయి దాటితే ముప్పు తప్పదు కదా. అటువంటి సమయాల్లో తమని అభిమానించే వారిని పెడదోవ పెట్టనీకుండా సరైన సలహా ఇచ్చి, వారిని సక్రమమైన మార్గంలో పయనించేలా చూడాల్సిన బాధ్యత అభిమానింపబడే వారిలోనూ వుంది. అందుకు ఉదాహరణే ఈ కథ.

పదవ తరగతి చదువుతున్న మహేష్‌కు రచయిత చక్రపాణి గారంటే చాలా ఇష్టం. చక్రపాణి గారి కథలను, నవలలను విడవకుండా చదువుతాడు. చక్రపాణిగారిని చూడాలని మఖాముఖి మాట్లాడాలని ఎంతో ఆశగా ఉండేది మహేష్‌కి. ఆయన ఉండేది హైదరాబాదులో కాబట్టి అక్కడికి వెళ్ళేంత డబ్బు తన వద్ద లేదు కాబట్టి, తల్లిదండ్రులను అడిగినా ప్రయోజనం వుండదు కనుక ఊరకుండిపోయాడు.

అదృష్టవశాత్తు చక్రపాణిగారు ఆ ఊరిలో జరిగే ఓ సభకు ముఖ్య అతిథిగా వస్తున్నారు అని తెలుసుకున్నాడు మహేష్. తన అభిమాన రచయిత తన ఊరు వస్తున్నందుకు కలిసి మాట్లాడబోయే అవకాశం కలుగుతున్నందుకు ఎంతో సంతోషించాడు. కానీ వెంటనే మరుసటి రోజు నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, అలాంటి రోజుల్లో తల్లిదండ్రులు తనను బయటకు రానీయరని గుర్తుకొచ్చి తనలోతానే బాధపడ్డాడు.

ఏది ఏమైనా తల్లిదండ్రులకు మస్కాకొట్టి సభ జరిగే చోటికి వచ్చి చక్రపాణిగారిని చూసి, ఆయనతో మాట్లాడాలని నిర్ణయించుకున్నాడు. ఎలాగైతేనేం ఆ రోజు తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటి నుంచి బయట పడ్డాడు. కార్యక్రమం జరిగే వేదిక వద్దకు చేరుకున్నాడు.

సభ పూర్తయిన తరువాత ఒంటరిగా ఉన్న సమయంలో చక్రపాణిగారి

దగ్గరకు వెళ్ళాడు మహేష్. ఆయనకు నమస్కరించి, తనను పరిచయం చేసుకున్నాడు. "సార్! నేను ఈ ఊరి హైస్కూల్లోనే టెన్త్ క్లాస్ చదువుతున్నాను. మీరంటే చాలా ఇష్టం. అందుకే రేపు పరీక్షలైనా చదవాల్సిన బుక్స్ ప్రక్కన పెట్టి మిమ్మల్ని చూడటానికి వచ్చాను" అని గొప్పగా చెప్పాడు.

మహేష్ చివరిమాటలు విని ఎంతో బాధపడ్డారు చక్రపాణిగారు. అది గమనించిన మహేష్, "ఏంటిసార్! అలా ఉన్నారు" అని అడిగాడు.

"బాబూ మహేష్ నీవు నా అభిమానివైనందుకు సంతోషం. కానీ ఇప్పుడు నీవు చేసిన పని బాగులేదు. ఎందుకంటే ఈ వయస్సులో నీకు చదువు ముఖ్యం. ఇక ముందు ఇలాంటి పని చేయకు. నీవు బాగా కష్టపడి చదివి, ప్రయోజకుడివి అయితే నీ తల్లిదండ్రులు సంతోషిస్తారు. నీలాంటి అభిమానుల్ని సంపాదించుకున్నందుకు, నేనూ గర్వపడతాను" అని చెప్పారు చక్రపాణిగారు.

ఆయన మాటలను ఆలోచిస్తూ తానుచేసింది తప్పేననిపించింది మహేష్‌కి. వెంటనే ఇకముందు ఇలాంటి పనులు చేయనని చక్రపాణిగారికి మాట ఇచ్చి, ఇంటికొచ్చి చదవటంలో నిమగ్నుయ్యాడు మహేష్.

## బాలుడు - తోటకూర

ఒక గ్రామములో సుశీల అనే ఆమెకి, సురేష్ అనే కొడుకు ఉన్నాడు. అతను చిన్నతనములో ఒకనాడు పక్కవారింటిలో నుంచి తోటకూర దొంగిలించి తీసుకొచ్చి తల్లికి ఇచ్చెను. దానికి ఆమె ఆప్యాయంగా కౌగిలించుకొని మానాయనె! అని మెచ్చుకొన్నది. అది ఏదో ఘనకార్యము అన్నట్లుగా ఆ పిల్లవాడు చాలాబాగున్నదని తలచి ఇరుగుపొరుగు వాళ్ళ ఇంటిలో నుంచి వస్తువులు తీసుకురావడము మొదలుపెట్టాడు. తల్లి తప్పని కూడా మందలించలేదు. అదే అవకాశంగా తీసుకొని రోజూ స్కూలులో, తనతోటి పిల్లల దగ్గర పెన్ను గానీ, పెన్సిల్ గానీ, పుస్తకం గానీ, దొంగతనముగా తీసుకురావడము మొదలు పెట్టాడు. క్రమంగా పెరిగి పెద్దవాడైయ్యేటప్పటికి గజదొంగగా మారి అనేక వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఒక రోజు రక్షక భటులు ఇతన్ని పట్టుకొనిపోవుచూండగా అతని తల్లి "అయ్యో! తోటకూర నాడే ఇది తప్పని చెప్పలేక పోయానే!

చెప్పినట్లయితే తన కొడుకు ఇలాంటి వాడు కాక పోవును కదా” అని దుఖించింది. కావున ఎప్పుడూ దొంగతనము చేయరాదు.

## మార్పు

అది బస్టాండ్. ప్రయాణికుల అరుపులు, పాప్‌కార్న్ అమ్మే కుర్రాళ్ళ కేకలతో గందరగోళంగా ఉంది. ఇంతలో చేతిలో బ్రీఫ్‌కేస్‌తో బస్‌స్టాండ్‌లోకి అడుగుపెట్టాడు నవీన్. కళ్ళకు గ్లాసులు, మెడలో గోల్డ్‌చెయిన్, సఫారీ డ్రస్‌తో నవీన్ చాలా అందంగా ఉన్నాడు. తను ఎక్కబోయే బస్సు కోసం ఎదురుచూస్తున్నాడు. ఇంతలో బాబూ అన్న పిలుపుకు పక్కకి తిరిగి చూసాడు నవీన్. తనకెదురుగా కొంచెం దూరంలో ఒక ముసలివాడు, మాసిన గడ్డం అక్కడక్కడ చిరిగిన బట్టలతో అసహ్యంగా ఉన్నాడు. ఏమిటి అంటూ నిర్లక్ష్యంగా ముసలాయన వైపు చూసాడు నవీన్. బాబూ గూడెం బస్సు ఇక్కడే కదా ఆగేది అన్నాడు. ఆ ప్రశ్నకు అవునంటూ ముక్తసరిగా సమాధానం చెప్పి మరో వైపు ముఖం తిప్పుకున్నాడు నవీన్. మళ్ళీ బాబూ! అంటూ పిలిచాడు అదే ముసలాయన. ఏమిటన్నట్లు అసహ్యంగా ముఖం పెట్టి కళ్ళతోనే ప్రశ్నించాడు నవీన్.

నవీన్ చూపులకు భయపడ్డ ముసలాయన ఈ బస్సు జంక్షన్లో ఆగుతుందిగా బాబూ అన్నాడు. ఆ ఆగుతుందిలే అంటూ మరో వైపు ముఖం పెట్టాడు. నవీన్ శుభ్రతకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తాడు. అలాంటి నవీన్ అపరిశుభ్రంగా ఉన్న ముసలాయనతో మాట్లాడటం అంటేనే అదోరకంగా ఫీలవుతున్నాడు. అదీగాక ఈ బస్‌స్టాండ్‌లో ఇంతమంది ప్రయాణికులుండగా పనిగట్టుకొని తననే అడుగుతున్నందుకు మనసులోనే తిట్టుకోసాగాడు. ఇంతలో గూడెం బస్ వచ్చి పాయింట్‌లో ఆగింది. బిల బిలమంటూ వచ్చిన జనం బస్సులో ఎక్కడానికి ఒకర్నొకరు తోసుకుంటూ నానాయాతన పడుతున్నారు. కొందరైతే బస్సు కిటికీ గుండా చేతిరుమాళ్ళు, బ్రీఫ్‌కేసులు వేసి సీటులు రిజర్వ్ చేసుకుంటున్నారు. నవీన్ కూడా కిటికీ గుండా బ్రీఫ్‌కేస్‌ను ఓ సీటులో పెట్టి అందరూ ఎక్కిన తరువాత ఎక్కవచ్చులే అని మనసులో అనుకుని క్రిందే ఉండి చుట్టూ పరిశీలించసాగాడు.

కొన్ని క్షణాల అనంతరం బస్సు లోపల నుండి బాబూ! ఇదిగో బాబూ మిమ్మల్నే అంటూ గట్టిగా అరవడంతో బస్సు వైపు చూసాడు నవీన్. నల్ల బనీను ధరించిన ఓ వ్యక్తిని గట్టిగా పట్టుకొని అరుస్తున్నాడు ఇంతకు మునుపు తను చూసిన ముసలాడు. జరిగిందేమిటో అర్థంకాని నవీన్ ఒక్క ఉదుటున బస్సులోకి దూసుకుపోయాడు. బస్సులోకి వెళ్ళిన నవీన్ దృష్టి నల్ల బనీను వ్యక్తి చేతిలో ఉన్న తన బ్రీఫ్‌కేస్ మీద పడింది. అంటే వీడు దొంగన్న మాట. అని మనసులో అనుకొని ఆ దొంగపై పిడిగుద్దుల వర్షం కురిపించాడు. నవీన్ రావడంతో పాపం ముసలాయన రొప్పుతూ దొంగని వదిలేసాడు. ఇంతలో ఒక కానిస్టేబుల్ జరుగుతున్న గొడవ చూసి బస్సులో కొచ్చాడు. జరిగింది తెలుసుకొని ఆ దొంగని లాఠీతో కొట్టుకుంటూ బయటకు తీసుకెళ్ళాడు.

ఇంతలో నవీన్ దృష్టి బస్సు రాడ్‌కు ఆనుకొని ఆయాసంతో రొప్పుతున్న ముసలాయన మీద పడింది. పాపం అతని బట్టలు చూసి ఇంతవరకూ తను అసహ్యించుకున్నందుకు ఎంతో బాధపడ్డాడు. కానీ అవేమీ పట్టించుకోని ఆ ముసలాయన తనకు చెప్పలేనంత సహాయం చేసాడు. తనే ఆ దొంగని గమనించి పట్టుకోకపోతే బ్రీఫ్‌కేస్‌లో ఉన్న తన స్టడీ సర్టిఫికేట్స్, రెండువేలరూపాయల డబ్బు, బట్టలు అన్నీ తను పోగొట్టుకొని ఉండేవాడు. అందుకే తను చేసిన తప్పును తెలుసుకొని ఆ దేవుడి ఋణం తీర్చుకోవాలి అని మనసులో అనుకొని ఆయాసంతో రొప్పుతున్న ఆ ముసలి వ్యక్తిని చేత్తో గట్టిగా పట్టుకొని, చూడు తాతా! నీకు చాలా నీరసంగా ఉంది కదూ! నా సీట్లో కూర్చొని కాసేపు విశ్రాంతి తీసుకొందువుగానీ రా తాతా! అంటూ తీసుకెళ్ళి తన సీట్లో కూర్చోబెట్టాడు.

## పొట్టేలు-ఎద్దు

సాధు జంతువైన ఎద్దును ఒక సింహం తరుముతూ వచ్చింది. ప్రాణభయంతో ఎద్దు కొన్ని మైళ్ల దూరం పరిగెత్తంది. ఏమి చేయాలో పాలు పోక, తరుముకొస్తున్న మృగరాజు నుండి తప్పించుకోవడానికి ఒక గుహలోకి చొరబడింది. ఆ గుహ ఒక పొగరుబోతు పొట్టేలు నివాసం. దృఢమైన శరీరం, వాడియైన కొమ్ములు ఏ జంతువుకూ ఉండవని దాని భ్రమ, గుహలోకి చొరబడిన

ఎద్దును చూసి పొట్టేలు ప్రాణభయంతోఎందుకొచ్చావంటూ కొమ్ములతో పొడవడం ప్రారంభించిది. ఎద్దు ఎంత వారించినా పొట్టేలు వినలేదు సరికదా నా కొమ్ములు పోట్లు కాచుకో అంటూ మరింతగా పొడవడం మొదలు పెట్టింది.

అప్పటికే అలసిపోయిన ఎద్దు పొట్టేలు దూడుకుతనాన్ని,దుర్మార్గాన్ని కొద్ది సేపు సహనంతో భరించింది. కాని సింహం కనుచూపు మేరలో కనబడకుండా పోయేసరికి తన జవాబును పొట్టేలుకు చూపించింది.

నాకు నీకంటే బలమైన శరీరం, వాడియైన కొమ్ములు ఉన్నాయంటూ సత్తా చూపించి, పొట్టేలును స్పృహకోల్పోయేలా చేసింది ఆ ఎద్దు స్పృహలోకొచ్చిన పొట్టేలు తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడింది.

## ప్రాణం తీసిన దురాశ

సంస్కృత భాషలో అద్భుతమైన నీతి కథలను, నీతి చంద్రిక, పంచతంత్రము, హితోపదేశము మొదలైన పేర్లతో లోకానుభవంతో పండిన మహానుభావులు రచించారు. హితోపదేశం – మిత్రలాభంలో నారాయణకవి చెప్పిన గొప్ప నీతి వున్న చిన్న కథ ఒకటి ఉంది.

వింధ్యారణ్య ప్రాంతంలో భైరవుడు అనే పేరుగల వేటగాడు ఉండేవాడు. రోజూ అడవికి వెళ్ళి, రకరకాల ఆహారపదార్థాలను సేకరించి, వాటితో తన కుటుంబాన్ని పోషించేవాడు. అడవిలో దొరకనిదేముంది? ఆకులు, దుంపలు, కాయలు, పండ్లు, తేనె, వెదురు బియ్యం ఇలా ఎన్నో లభిస్తాయి. కాని, ఈ శాఖాహారం కంటే కుందేలు, జింక, అడవి పంది వంటి జంతువుల మాంసాహారమే ఈ వేటగాళ్ళు ఇష్టపడతారు. భైరవుడు ఒకనాడు ఒక బలసిన జింకను వేటాడి చంపాడు. ఇంటిల్లిపాదీ ఆనందంగా విందు చేసుకోవచ్చుననుకుంటూ, దానిని భుజంపైన వేసుకొని తన ఇంటి దారి పట్టాడు. అయితే ఆ అడవి మార్గంలో అతనికి అనుకోకుండా బాగా మదించి, కోరలు ఉన్న అడవి పంది కనిపించింది.

భైరవుడు తన భుజం మీది జింక శవాన్ని నేలపైకి దించి, తన విల్లమ్ములు తీసుకున్నాడు. పదునైన బాణంతో ఆ అడవి పంది రొమ్మును గాయపరిచాడు. అడవి పందులకు కోపం మొండితనం ఎక్కువ. వేటగాడి బాణం వెనుదిరిగి

వచ్చిందా అన్నట్లు, అది అతి వేగంగా వచ్చి, భైరవుని పొట్టను కోరలతో చీల్చి చంపింది. తర్వాత, అదీ చచ్చింది. వీరి తొక్కిసలాటలో ఆటుగా వచ్చిన పాము కూడా, ప్రాణాలు విడిచింది.

ఇంతలో క్షుద్రబుద్ధి అనే నక్క ఆహారం వెదకుతూ అటుకేసి వచ్చింది. చచ్చిపడి ఉన్న వేటగాడు, జింక, పంది, పాము దానికి కన్నుల విందుగా కనిపించాయి. నక్కలు స్వయంగా వేటాడలేవు. పులి, సింహం లాంటి జంతువులు చంపి తిని వదలిన అవశేషాలను, జీవుల శవాలను తిని తృప్తి పడతాయి. అందుకే ఒకేసారి నాలుగు శవాలు కనిపించే సరికి క్షుద్రబుద్ధి ఎగిరి గంతులు వేసింది. నక్క ఇలా ఆలోచించింది "ఈ మనిషి శవం ఒక మాసం పాటు తినొచ్చు. జింక, పంది శవాలను రెండు నెలల పాటు భోంచేయవచ్చు. ఈ పాము తలను తీసేసి ఒక రోజంతా కడుపునింపుకోవచ్చు. అంటే మూడు నెలల ఒక్క రోజు పాటు ఆహారం గురించి వెదికే పనే లేదన్నమాట. మరి ఈ పూట మాటేమిటి? ఆ! ఈ వేటగాని ధనుస్సుకు కట్టివున్న కమ్మని వాసన వేస్తున్న, నరాలతో చేసిన అల్లెత్రాటిని తింటే సరిపోతుంది."

క్షుద్రబుద్ధి వింటిని సమీపించి, లాగి బిగించి ఉన్న దాని నరాలతో చేసిన అల్లెత్రాడును కొరికింది. అంతే! పదునైన వింటి కోపు దాని శరీరంలో గుచ్చుకుని, తన దురాశకు చింతిస్తూ క్షుద్రబుద్ధి ప్రాణాలు విడిచింది. ఇప్పుడక్కడ ఐదు శవాలు పడి ఉన్నాయి.

భైరవుడు ఒక మృగము చాలదని మరో దాన్ని వేటాడబోయి చచ్చాడు. క్షుద్రబుద్ధిఎటువంటి కష్టం లేకుండా మూడు నెలల పాటు తిండి దొరికించుకుని కూడా పేరుకు తగినట్లు పిసినారి తనంతో వింటినారిని కొరికి, తానూ శవంగా మారింది. అందుకే అత్యాశ మంచిది కాదు. మానవుడు ఆశాజీవి. కానీ దురాశకు పోతే దుఃఖమే మిగులుతుంది.

# పుండరీకుడు

“భారతీయ సంస్కృతికి ప్రధాన సూత్రము మాతృదేవోభవ – పితృదేవోభవ అనే పవిత్ర శాసనము. దీనిని ధిక్కరించిన, దేవుడు కూడ సహించడు.” – బాబా.

చంద్రభాగానదీ తీరమున పుణ్యక్షేత్రమయిన పండరీపురమున పుండరీకుడనే బ్రాహ్మణుడుండెడివాడు. అతడు ప్రతిదినము వేకువ రూమున లేచి తల్లిదండ్రులకు చంద్రభాగానదిలో స్నానము చేయించి వారికి పాదపూజ చేసి, వారిని సంతృప్తులను చేసి, తదితర కార్యక్రమములో నిమగ్నమయ్యెడి వాడు. పుండరీకునకు తల్లిదండ్రుల యందుగల భక్తి ప్రపత్తులు అందరికి తెలిసినవే ఒకనాడు శ్రీకృష్ణుడు పుండరీకుని పరీక్షింపదలచి అతని కుటీరము వద్దకు వచ్చి, వాకిట వద్దనే నిల్చి పుండరీకుని పిల్చెను. పుండరీకుడు ఆ సమయమున మాతాపితల సేవలో మునిగి యుండెను. అతడు తలయెత్తి చూడకయే మీరెవరని అడిగెను. అంతట “నేను పాండురంగను, నిన్నను గ్రహించుటకు వచ్చి తిని, నీవు మాతాపితల సేవలో నిరతుడైన మిక్కిలి మక్కువతో నున్నావు. నా దర్శనము దుర్లభమైనను, నీయందు దయతో నిన్ననుగ్రహించుటకు వచ్చి తిని నీ కొరకై వేచియున్నాననెను.” అప్పుడు పుండరీకుడు “ఈ దీనుని నిమిత్తమై యింత సేపటి నుండి బురదలో నిలిచియున్నావు కదా! ఇదిగో ఈ ఇటుక మీద కొంత సేపు నిలుచుండమని” ఒక యిటుకను స్వామి యెదుట వేసెను. పండరీనాధుడు ఆ యిటుకపై నిలచుండి భక్తుని రాకకై వేచి యుండెను.

పుండరీకుడు తల్లిదండ్రుల సేవ పూర్తి గావించుకొని వారి ఆజ్ఞను తీసుకొని, పండరీనాధుని దర్శించి వారి అనుగ్రహమునకు పాత్రుడయ్యెను.

# శ్రవణ కుమారుడు

దశరథ మహారాజు అయోధ్య రాజ్యాన్ని పరిపాలించే కాలంలో శ్రవణ కుమారుడు అనే బాలుడు ఆయన రాజ్యంలో నివసించేవాడు అతని తల్లితండ్రులిద్దరూ ముసలివారు, గ్రుడ్డివారు శ్రవణుడికి తల్లిదండ్రులంటే అమిత

ప్రేమాభిమానాలు, భక్తి శ్రద్ధలు ఉండేవి. వారి సేవ చేయుటలో శ్రవణుడు చిరాకు, కోపము లనునవి ఎరుగడు. ఒకసారి అతని తల్లితండ్రులకు తీర్థయాత్ర చేయవలయునను కోరిక కలిగినది. కాని గ్రుడ్డివారు కదా, శ్రవణ కుమారుడు చిన్నవాడు ఏమి తోచక వారు విచారముగా నుండిరి. శ్రవణుడు తల్లిదండ్రుల కోరిక తీర్చుటకు తీర్థయాత్రకు వెళ్ళే ప్రయత్నం ఆరంభించాడు. అతడు తనకు తెలిసిన వడ్రంగి వద్దకు వెళ్ళి కావడి తయారు చేయించుకొని, తల్లిదండ్రులు అందులో కూర్చుండబెట్టాడు. కావడి భుజానికి ఎత్తుకుని తీర్థయాత్రలు ప్రారంభించాడు. శ్రవణుడు దీక్షతో తల్లిదండ్రులకు ఏమాత్రము కష్టము కలిగించకుండా అన్ని ప్రదేశాలు చూపిస్తూ, ఎన్నో కష్టనష్టాలను సహించి, తన తల్లిదండ్రులను తృప్తిపరచెను. ప్రజలంతా తల్లిదండ్రులయందు అతనికి కల భక్తి శ్రద్ధలను వేనోళ్ళ పొగిడారు. వారు ఒక రాత్రి అడవిలో గడపవలసి వచ్చింది. అతని తండ్రికి కొంత సేపటికి దాహము వేయగా శ్రవణుడు ఒక పాత్ర తీసుకొని నీటి కోసం బయలుదేరాడు. ఒక నదిలో ఆ పాత్రను ముంచుతుండగా, ఎక్కడి నుంచో ఒక బాణం రివ్వున వచ్చి శ్రవణుడి గుండెల్లో గుచ్చుకొంది అతను కెవ్వున కేకపెట్టాడు. ఆ బాణం వేసినవాడు దశరథుడు అతడు శ్రవణుడి కేకకు పరిగెత్తుకు వచ్చి అతని గుండెల్లో గ్రుచ్చుకొన్న బాణం చూచి చాలా బాధపడ్డాడు శ్రవణకుమారుడు చనిపోతూ కూడ “అయ్యా! ఈ అడవిలో ఒక చెట్టు క్రింద నా తల్లిదండ్రులు దాహంతో బాధపడుతున్నారు. మీరు వెంటనే వెళ్ళి ఈ నీరు వారికందించండి అని చెప్పి తల్లిదండ్రుల ధ్యాసతోనే అతడు మరణించాడు. ఈ విషయం దశరథుని ద్వారా విని అతని తల్లిదండ్రులు పుత్రశోకంతో అక్కడే ప్రాణాలు విడిచారు. ఈ విధంగా తల్లిదండ్రుల సేవయే పరమావధిగా భావించిన శ్రవణ కుమారుని కథ ఆదర్శప్రాయమయ్యెను.

## సత్యకాముడు

పూర్వము గౌతముడను గురువు వద్ద అనేక మంది శిష్యులు విద్యను నేర్చుకొనుచుండిరి. ఒకనాడు గురువు వారిని పిలిచి “మీకు ఈ ప్రాంతమునందు కరువు కాటక మేర్పడిన విషయము తెలుసును. మన 400 గోవులకు అవసరమైన

ఆహార పానీయాదులు దొరుకుట లేదు. అవి దీనముగా, ఆకలితో అలమటించడము నేను చూడలేను. అట్లు చూస్తూ నా విధులను నిర్వర్తింపలేను. మీలో ఒకరు వాటిని దూర ప్రాంతమునకు తీసుకొని వెళ్లి వాటి సంరక్షణ భారము కొన్ని దినముల వరకు వహించవలెను" అని చెప్పిరి. ఆ మాటలు విని శిష్యులు ఏమీ బదులు చెప్పలేక తలవంచుకొని నిల్చిండిరి. వారిలో సత్యకాముడను శిష్యుడు ముందుకు వచ్చి తాను ఆ బాధ్యతను తీసుకొందునని చెప్పెను. అతనిని ఆ పనియందు నిరుత్సాహపరుచుటకు తక్కిన శిష్యులు ప్రయత్నించిరి. కాని సత్యకాముడు గురుభక్తితో ధైర్యముతో ఆవులను తొలుకొని దూర ప్రాంతమున కేగెను. ఆశ్రమము నుండి వెడలునప్పుడు గురువు దగ్గరకు వెళ్ళి తానెప్పుడు తిరిగి రావలయమున అను విషయమును గురించి అడిగెను. గురువు ఎప్పుడు 400 ఆవులు వేయి ఆవులు అగునో అప్పటికి రమ్మని చెప్పి, ఆశీర్వదించి పంపెను.

సత్యకాముడు గోసేవయే గురుసేవగా, గురుసేవయే భగవంతుని సేవగా భావించి వాటిని జాగ్రత్త సంరక్షించుచుండెను. తన కాలము గొసేవకు, భగవన్నామస్మరణకు వినియోగించెను. పెక్కు దినములు గడిచెను. కాని అతడు దినములను గాని, గోవుల సంఖ్య గాని లెక్కింపలేదు. ఒకనాడు దేవేంద్రుడు ప్రత్యక్షమై 'ఆవుల సంఖ్య వేయి అయినది. వాటిని తీసికుని గురువు దగ్గరకు వెళ్ళమని తెలిపెను' అట్లు తెలిసిన దేవేంద్రుడు తాను కూడా అతని వెంట ప్రయాణము చేసెను. దారిలో అతనిని నాల్గు వేదములు బోధించి ఆశీర్వదించి అంతర్ధానమయ్యెను. సత్యకాముడు అపరిమితమైన తేజస్సుతో, వేయి ఆవులతో, ఆనందముగా తేన గురువు వద్దకు వెళ్ళి వినయ విధేయతతో నిలబడెను.

'భక్తి శ్రద్ధలతో గురువును సేవించిన వారికి దైవమే సహాయపడును'. ఈ విధముగ గురుభక్తి ప్రబోధించు కథమరొకటి లేదు.

## పద్మపాదుడు

శంకరాచార్యుల వద్ద నలుగురు, తెలివైన శిష్యులుండెడివారు. అందులో పద్మపాదుడు గురుసేవలో నిమగ్నుడై ఉండుట. వలన చదువులో వెనుకబడేవాడు. చదువులో వెనుకబడిన పద్మపాదుని చూచి మిగిలిన విద్యార్థులు చులకనగా

చూసేవారు. గురు సేవయందు ఆసక్తి కలిగిన పద్మపాదుడు ఒక రోజున గురువుగారి వస్త్రములు నది మధ్యనున్న ఇసుక తిన్నపై అరబెట్టుచుండగా నది భయంకరముగా పొంగి ఇసుక తిన్నెను ముంచివేసెను. ఇసుక తిన్నెపై ఆరబెట్టిన వస్త్రము నదిలో కొట్టుకొని పోవుచుండెను. గురువు గారికి ఎట్లయినను అందివ్వవలెనను ఆతృతతో గురువు అనుగ్రహము పై భారము వేసి ప్రాణములకు తెగించి ప్రవాహమున దిగెను. వానికి నడచుటకు వీలుగా అడుగడుగునా పాదములు మోపుటకొక పద్మము ప్రత్యక్షము కాదొడగెను. ఇది చూచి శిష్యులు ఆశ్చర్యమునొంది, అతని గాఢమైన గురుభక్తియే దివ్యశక్తియై అతనని దరిజేర్చినదని గ్రహించి సిగ్గుతో శిరమును వంచుకొనిరి. అతనికి శంకరాచార్యులు పద్మపాదుడు అని నామకరణము చేసెను.

## బాల ఆరుణి

పూర్వము ధౌమ్యుడనే మహర్షి వద్ద అనేక మంది శిష్యులు విద్యనభ్యసించెడివారు. ఒక దినము ధౌమ్యుడు శిష్యులకు బోధన చేస్తున్న సమయంలో కుండపోతగా వర్షము కురియనారంభించెను. గురువు అరుణి అను శిష్యుని పిలిచి "నాయనా! ఒకసారి చేను ఎట్లున్నదో చూచిరమ్ము బోదెగట్లు తెగిపోవచ్చును" అని చెప్పెను వెంటనే గురువుగారి ఆజ్ఞ ప్రకారము ఆరుణి చేను దగ్గరికి వెళ్ళెను. అనుకున్నట్లే బోదె గట్లకు గండిపడినది. అది చూచి అరుణి వెంటనే తన గురువుగారి ఎకరాల చేనును మునిగిపోకుండా కాపాడవలెను, అని తలంచి గండికి అడ్డముగా పరుండెను. మరునాడు గురువు ఆరుణి జాడ తెలియక శిష్యులతో కూడ అతనిని వెతుకుతూ చేను దగ్గరకు వెళ్ళెను. అక్కడ గండికి అడ్డంగా స్పృహ తప్పి పడి ఉన్న అరుణిని చూచి ఆయన గుండె కరిగిపోయెను. శిష్యుని లేవదీసి అతని గురుభక్తి మెచ్చి, మనసారా ఆశీర్వదించెను.

# సుధాముడు

భగవంతుడే నిజమైన బంధువు, అతడే ఆపద్బాంధవుడు - అను ఆదర్శమును స్వానుభవ రూపకముగా లోకమునకు తెలియజేసిన పరమ భక్తుడు సుధాముడు. ఇతడే కుచేలుడు.

శ్రీకృష్ణుని చిన్ననాటి స్నేహితుడు సుధాముడు. బలరామకృష్ణులతో బాటు సాందీపుని వద్ద ఇతడు కూడ విద్యాభ్యాసము గావించెను. పెద్దవాడయిన పిమ్మట పరిస్థితుల ప్రభావము వలన నిత్యదారిద్ర్యముతో బాధపడుచుండెను. ఒకనాడు అతని భార్య వామాక్షి కోరికపై బాల్య స్నేహితుడయిన శ్రీకృష్ణుని సహాయము కోరుటకు బయలుదేరెను. చిరకాల మిత్రుని చూడబోవుచుండుటచే తన ఇంటిలో నున్న అటుకులను చిరిగిన వుత్తరీయపు కొంగున ముడివేసుకొని శ్రీకృష్ణునికి సమర్పించుటకు నిశ్చయించుకొనెను. శ్రీకృష్ణుడు తన మిత్రుని రాక నెరంగి ద్వారము వద్దకు పరుగు పరుగున వచ్చి, ఆనందముతో ఆలింగనము చేసుకొనెను. పిమ్మట సుధాముని మందిరములోనికి వెంట పెట్టుకొని వెళ్ళి తన బంగారు సింహాసనముపై కూర్చుండబెట్టి పాదములను స్వయంగ కడిగి, ఆ నీటిని తన తలపై చల్లుకొనెను. శ్రీకృష్ణుని భార్యలును అట్లే చేసిరి. వారిద్దరూ చిన్న నాటి ముచ్చటలను చెప్పుకొనుచూ ఆనందించిరి. శ్రీకృష్ణుడు కుచేలుని చేతి యందున్న చిన్న మూటను చూచి మిత్రమా! ఇంత కాలమైన తరువాత నన్ను చూచుటకు వచ్చితివి. నాకేమి తెచ్చితివి? అని ఆప్యాయంగా ప్రశ్నించుచూ, ఆ మూటలోని అటుకులను తన నోట వేసికొనెను. సుధామునకు అమృతతుల్యమయిన భోజనము పెట్టి హంస తూలికా తల్పమున పరుండచేసి, సంతోషముగా సేవ చేసెను.

శ్రీకృష్ణుని అపారమైన ప్రేమకు సుధాముడు బ్రహ్మానందభరితుడయినాడు. ఎంత ప్రయత్నం చేసిననూ తన కష్టములను శ్రీకృష్ణునితో చెప్పుకొని సహాయం కోరలేకపోయెను. మరునాడు ఉదయమే వట్టి చేతులతో శ్రీకృష్ణుని వద్ద దురదృష్టమునకు చింతించుచూ, భార్యకు ఏమని సమాధానము చెప్పవలెనో తెలియక దిగులుగా వూరు చేరెను. అతనికి తన గ్రామమున ఎంత వెదికిననూ తన పూరి గుడిసె కనిపించలేదు. తన కుటీరముండిన చోట ఒక దివ్య భవనము కనుపించెను. ఏమీయూ తోచక దిక్కులు చూచుచుండగా సర్వాభరణ శోభితురాలై

అతని భార్య ఆ భవనము నుండి వచ్చి 'శ్రీకృష్ణ భగవానుని కృప వలన మన దారిద్ర్యం తీరిపోయినది. అష్టైశ్వర్యములు సంప్రాప్తించినవి. ఈ భవనమే మన గృహము అని ఆహ్వానించెను.

మాధవుని మహిమను గ్రహించిన సుధాముడు అనాడి నుండి శాశ్వతానందమును పొందుటకు సంకల్పించుకొనెను. భగవంతుని అనుగ్రహము పొందుటకు నిశ్చయించుకొనెనను.

సుదర్శనము పొందిన సుధాముడు ఎంతటి అదృష్టవంతుడు.

## అతిథి దేవోభవ

ధర్మరాజు అశ్వమేధ యాగము చేయుచుండెను. ఎంతో మందికి అన్నదానం చేసి ఇంకా ఎన్నో ధర్మకార్యములు చేసి యాగము చక్కగా జరిగినదను కోనుచుండగా ఒక ముంగిస వారి ముందుకు వచ్చి వారిని చూచి నవ్వెను, ఆ ముంగిన యొక్క ఒక పార్శ్వము బంగారు పూత పూసినట్టుండెను. పాండవులు ముంగిసను సమీపించి ఎందులకు నవ్వితివి అని అడిగిరి దానికి సమాధానముగ ముంగిస 'ఓ రాజా! నీవేమో గొప్పగా అన్నదానము చేసినావని అనుకొనుచున్నావు. నీవు త్యాగశీలుడువని అనుకొంటున్నావు. కాని ఒకప్పుడు ఒక పేద బ్రాహ్మణుడు చేసిన దానము, త్యాగమునకు పోల్చి చూచిన నీ యాగము ఏ పాటిది! ఆ కథను చెప్పెదను వినుము.

ఒకప్పుడు కురుక్షేత్రములో ఒక పేద బ్రాహ్మణ కుటుంబముండెడిది వారు తమకు గల కొలదిపాటి పొలములో సజ్జలు పండించుకొని దాని నుండి ఆహారమును పొందెడివారు వారు బీదవారైనను నీతి నిజాయితీపరులు, త్యాగమూర్తులు, ఉన్నంతలో ఇతరులకు సహాయపడేవారు.

ఒకసారి వారు నివసించు ప్రాంతమున క్షామము సంభవించెను. ప్రజలందరు ఆకలితో అలమటించి బాధపడుచుండిరి. అట్టి తరుణమున ఒక దినము వారు తమ వద్దనున్న కొలది పాటిపిండితో ఆహారము తయారు చేసుకొని తమ తమ భాగములను ముందుచుకొని తినబోవుచుండిరి. ఆ సమయమున ఒక వృద్ధ బ్రాహ్మణుడు వారి గుడిసెను చేరెను. వారు అతనిని ఆదరముతో

నాహ్వానించి తమతో భుజింపుడని కోరిరి. మొదట ఆ ఇంటి యజమాని తన ఆహారమును అతనికిచ్చెను. అతడు దానిని భుజించి ఆకలి తీరలేదనెను. ఆ ఇంటి యజమాని భార్య తన ఆహారము ఇచ్చిను అప్పటికీ అతని ఆకలి తీరలేదు. తదుపరి కుమారుడు తన భాగమును సమర్పించెను. అది కూడా అతిధి యొక్క ఆకలి తీర్చలేదు. చివరకు ఆ ఇంటి కోడలు తన భాగము నిచ్చెను. ఆ విధముగా ఆ నలుగురు తమకున్నదంతా అతిథిని సంతృప్తిపరచుట కిచ్చి వేసిరి. వారి అతిథి సేవాతత్పరతకు త్యాగబుద్ధికి మెచ్చి ఆ బ్రాహ్మణుడు తాను ధర్మ దేవతననియు వారిని పరీక్షించుటకు వచ్చి తిననియు చెప్పి వారిని స్వర్గమునకు తీసుకొనిపోయెను.

రాజా! నేను ఆ సంఘటనంతయూ చూచి వారు వెళ్ళిన వెంటనే క్రింద రాలిన పిండిని కొంచెము చవి చూచితిని. కొంత పిండి నా శరీరమున కంటుకొనిపోయెను. ఆ భాగమంతయు సువర్ణమయ్యెను వారు దానము చేసిన పిండి కింత మహాత్యము కలదని గుర్తించితిని అప్పటి నుండి ఎవరైన గొప్పవారు దానము చేస్తే అక్కడికి వెళ్ళుతూ ఉండేదానిని అని చెప్పి వారిని ఆశ్చర్యమున ముంచివేసెను.

భారతీయులు అతిధులను దైవసమానముగా ఎంచి గౌరవింతురు.

## ధ్రువుడు

పట్టిన పట్టును వదలక పరమేశ్వరును దర్శించి, కన్న తల్లిదండ్రులకు సద్గతిని అందించిన బాలుడే ఈ ధ్రువుడు.

అయోధ్య నగరమును పాలించు ఉత్తానపాదుడను మహారాజునకు యిరువురు భార్యలు. మొదటి భార్యయైన సునీతి కుమారుడు ధ్రువుడు. రెండవ భార్యయైన సురచి కుమారుడు ఉత్తముడు.

ఒకనాడు ధ్రువుడు అడుకొనుచు, తమ్ముడు తండ్రి తొడపై కూర్చొనుట చూచి తాను కూడా కూర్చుండబోయెను. కాని సినతల్లి అయిన సురచి అసూయతో ధ్రువుని చేయిపట్టి క్రిందకు లాగి 'నీకు నీ తండ్రి తొడపై కూర్చొనుటకు అధికారము లేదు. నా గర్భమున పుట్టిన వానికే తండ్రి ఆదరణ, రాజ్యభోగము అనుభవించు

అర్హత కలదు. నీకు కూడా అట్టి కోరిక ఉన్న యెడల నాకు కుమారునిగా పుట్టునట్లు భగవంతుని వరము పొందుము' అని అవమానించెను. ధ్రువుడు తండ్రి దెస చూచిననూ, ఉత్తానపాదుడు పూరకుండుటచే, రోషము విషాదము కలిగెను. వెంటనే దీనవదనముతో తల్లికి జరిగినదంతయు విన్నవించెను. సునీతి ఆవేదనతో 'కుమారా! నీ తండ్రి తొడపై కూర్చొను భాగ్యమును పొందవలెనన్న, నీవే ఈ జగములన్నింటికి తండ్రియైన శ్రీహరిని ప్రార్థింపుము. అతడే నీకు దారి చూపగలడు' అనెను. తల్లి దీవెనతో బాలుడైన ధ్రువుడు ఆరణ్యములో తపస్సు నాచరించుటకు బయలుదేరెను. మార్గమధ్యమున నారదుడి బాలుని చూచి, విషయమును తెలిసికొనెను. అతని పట్టుదలను తెలిసుకొనవలెనని నారదుడు ఎన్నో విధములుగా ఆటంకపరచిననూ ధ్రువుడు తన పట్టును వీడలేదు. అపుడు నారదమహర్షి ఆ బాలుని నిశ్చలతత్త్వమునకు సంతసించి అతనికి 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అను మంత్రమును ఉపదేశించెను, ధ్రువుడు ఏకాగ్రచిత్తముతో ఆ మంత్రమును జపించుచు తపస్సును ఆచరించెను. అతనిని అనుగ్రహించుటకు శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై వరము కోరమనగా ధ్రువుడు తన కోరికను మరిచి శ్రీహరి సన్నిధానమునే కోరెను. శ్రీహరి ధ్రువుని రాజ్యపాలన ముగిసిన పిదప తారామండలమందు శాశ్వత స్థానము నందుకొనగలవని ఆశీర్వదించెను. ఈ విధముగా ధ్రువుడు బాల్యముననే శ్రీహరి ప్రేమకు పాత్రుడయ్యెను.

## ప్రహ్లాదుడు

ప్రహ్లాదుండు బాలుడైననూ, శ్రీహరియందు అచంచలమైన విశ్వాసము గలవాడు. ఇందు గలడందులేడను సందేహంబూ వలదు. చక్రి సర్వోపగతుండు ఎందెందు వెదకి చూచిన అందందేగలడను సత్యమును నిరూపించినవాడు. రాక్షస రాజైన హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. హిరణ్యకశిపుడు తనకంటె వేరు దైవము లేడను అహంకారి. ప్రహ్లాదుడు బాల్యము నుండి నిరంతరము నారాయణ నామస్మరణము చేయుట చూచి, శ్రీహరి నామస్మరణను మాన్పుటకు కులగురవగు చండమార్కుల కప్పగించెను. గురువు బోధించిన విషయములను

నేర్చుకొనుచు, తోటి బాలురకు హరినామ మహాత్మ్యమును వేదాంత రహస్యములను తెలుపుచుండెడివాడు. గురువుల కఠిన దండనలనోర్చెనేకాని, తన విశ్వాసమును వీడలేదు.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని విష్ణుభక్తి వృద్ధి చెందుట చూచి పుత్రుడని కూడ భావించక ఏనుగులచే నెట్టించెను. పాములచే కరిపించెను. విషమును త్రాగించెను. కొండలపై నుండి పడద్రోయించెను. ఎన్నో విధములయత్నించిన ప్రహ్లాదుని భక్తి విశ్వాసమును వీడలేదు.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని విష్ణుభక్తి వృద్ధి చెందుట చూచి పుత్రుడని కూడ భావించక ఏనుగులచే నెట్టించెను. పాములచే కరిపించెను. విషమును త్రాగించెను. కొండలపై నుండి పడద్రోయించెను. ఎన్నో విధములయత్నించిన ప్రహ్లాదుని భక్తి విశ్వాసములు చలించలేదు. తండ్రి నిందింపలేదు. కన్నీరు కార్చలేదు.

హిరణ్యకశిపుడుగ్రుడై నిరంతరము నీవు ధ్యానించు శ్రీహరి ఎక్కడ గలడని ప్రశ్నించెను. ప్రహ్లాదుడు మందస్మిత వదనముతో ఎందు చూచిన అందేకలడని పలికెను. అంత హిరణ్యకశిపుడు ఒక స్తంభమును చూసి 'ఈ స్తంభమున శ్రీహరి కలడా?' అని ప్రశ్నించెను. ప్రహ్లాదుడు నిశ్చలమైన భక్తితో కలడని పలికెను. ఆ స్తంభమును చీల్చుకొని శ్రీ మహావిష్ణువు నరసింహ స్వరూపుడై ప్రత్యక్షమాయెను. బాల ప్రహ్లాదుని వలె భగవద్విశ్వాసము, నిశ్చల భక్తి కావలెను.

## సత్యంవద - ధర్మంచర

శ్రుతులు సత్యంవద - ధర్మంచర అని ప్రభోదిస్తున్నాయి. సత్యమునే చెప్పమని వేదములు తెలుపుచున్నవి. మహాభారతమున భీష్ముడు ఈ రెండింటిని, తన జీవితమున ఆచరించి ఆదర్శప్రాయుడయ్యెను.

శంతన మహారాజు యొక్క కుమారుడు దేవవ్రతుడు సర్వగుణసంపన్నుడు. ఒకనాడు శంతన మహారాజు విచారముగా ఆలోచనా నిమగ్నుడై యుండెను. శంతన మహారాజు విచారమును పోగొట్టి అతనికి ఆనందమును కలిగించుటయే తనయుని ధర్మమని భావించి అతని కుమారుడు తండ్రిని కారణమడిగెను. శంతనుడు విషయము నెరిగించుటకు సందేహించెను. కాని దేవప్రతుడు తండ్రి

దుఃఖము పోగొట్టని తనయుని జీవితము వ్యర్థమగునని పట్టుబట్టి మరల అడిగెను. అపుడు శంతనుడు తాను సత్యవతి అను పేరుగల బెస్తరాజు కుమార్తెను వివాహమాడ దలచితిననియు, అందులకు ఆమె తండ్రి తన కుమార్తెకు కలిగిన కుమారునకే రాజ్యమునిత్తునని చెప్పి, అట్లు వాగ్దానము చేసిన వివాహమునకు సమ్మతింతునని తెలిపెనని చెప్పి అట్లు వాగ్దానమునిచ్చుట పెద్ద కుమారుడైన దేవవ్రతునకు అన్యాయము చేయుటయేనని తలంచుచు బాధపడుచున్నాని చెప్పెను.

